ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 01.06.2026 | సంపుటి :12 సంచిక : 312 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




# గ్రామాల్లో మేమెట్లా బతకాలే..?

**కాలుష్యపు కాలకూట విషం.. ఆరు ఊర్లపై మృత్యుఛాయలు**

రెండు దశాబ్దాలుగా ఆ పల్లెలన్నీ క'న్నీటి' గోస పడుతున్నయ్. పచ్చని పంటలతో కనిపించే ప్రాంతమంతా బీళ్లుగా మారాయ్. సాగు, తాగునీరు సైతం గగనమై.. నిత్య కాలకృత్యాలకూ అరిగోస పడుతున్నయ్. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా, ఎన్నో ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడే లేకపోవడంతో చుట్టుపక్కల గ్రామాల్లో ఎప్పుడూ కంటతడే. వందలాది ఎకరాల్లో సాగుచేసే పరిస్థితి లేక రైతులంతా పొట్టపోసుకోవడం కూడా ప్రశ్నార్థకంగా మారింది.

## పరిశ్రమల వ్యర్థాలు, రసాయనాలకు బలవుతున్న పల్లెలు

- అభివృద్ధి పేరుతో విధ్వంసం.. ప్రకృతి వినాశనం
- తాగునీరు దొరకదు.. పంటలు పండవు.. ఆరోగ్యమే ప్రశ్నార్థకం
- 20 ఏండ్లుగా ప్రజలను పట్టి పీడిస్తున్న 'పోలేపల్లి'
- సాగు, తాగును దూరం చేసిన 'కాలుష్య'భూతం


పరిశ్రమల నుంచి ఏర్పడే వ్యర్థాలను నిబంధనలను ఉల్లంగించి నేరుగా చెరువుకు తరలిస్తున్న దృశ్యం



చిక్క వెంకటరమణ
(మహబూబ్‌నగర్ బ్యూరో, జనంసాక్షి):
ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే అతిపెద్ద పారిశ్రామికవాడ జడ్చర్ల మండలం పోలేపల్లి. ఇది ప్రారంభమై ఏళ్లు గడుస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2007లో పోలేపల్లిలో దాదపు వెయ్యి ఎకరాల వరకు సేకరించి ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఏర్పాటు చేశారు. ప్రారంభం నుంచి ఇప్పటివరకు దీని చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతూనే ఉన్నాయి. కంపెనీలు స్థాపించి రెండు దశాబ్దాలకు చేరువవుతున్నా ప్రజల ఇబ్బందులనుగానీ, వాళ్ల సమస్యలనుగానీ పట్టించుకునే వారే కరువయ్యారు. పోలేపల్లి సెజ్‌లో 17 ఫార్మా కంపెనీలతో పాటు, వివిధ రకాల 100కు పైగా పరిశ్రమలు ఏర్పాటుకాగా, ఈ కంపెనీల నుంచి మిగతా 2లో..

### వ్యవసాయం చేయలేకపోతున్నాం :శేఖర్ గౌడ్



పోలేపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన సెజ్ కారణంగా తమ జీవనాధారం దెబ్బతింటోంది. సుమారు వెయ్యి ఎకరాల్లో ఏర్పాటైన ఈ పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్య జలాలు చెరువుల్లోకి చేరుతున్నాయి. నీరు విషపూరితంగా మారింది. ఈ కలుషిత నీటి ప్రభావంతో వ్యవసాయం చేయలేకపోతున్నాం. మరోవైపు చెరువుల్లో చేపల పెం పకం కూడా దెబ్బతిందని మత్స్యకారులు వాపోతున్నారు.

---

సీబీఎస్ఈ విద్యార్థులను వదలి

# మామిడిపళ్ల రుచులు కావాల్సివచ్చిందా?

**మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించినవారు సమాధానాలకు బదులుగా అవమానాలను ఎదుర్కొన్నారు**
**సీబీఎస్ఈ ఓఎస్ఎం సమస్య కేవలం నిర్లక్ష్యం కాదు.. అదో కుట్ర ● మోదీపై మండిపడ్డ రాహుల్**



న్యూఢిల్లీ(జనంసాక్షి):సీబీఎస్ఈ ఆన్‌స్క్రీన్ మార్కింగ్ వివాదంపై రాహుల్ గాంధీ మరోసారి కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'మన్‌కీ బాత్'లో మామిడి పండ్ల గురించి మాట్లాడ్డానికి ప్రధాని మోదీకి సమయం ఉంటుంది గానీ, 18.5 లక్షల మంది విద్యార్థుల భవితవ్యం గురించి మాట్లాడేందుకు తీరిక లేదంటూ విమర్శించారు. సీబీఎస్ఈ ఆన్ స్క్రీన్ మార్కింగ్ సమస్య కేవలం నిర్లక్ష్యం కాదని.. అదో కుమ్మక్కు అంటూ రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ ఉదయం 'మన్‌కీ బాత్'లో ప్రధాని మోదీ పండ్ల మామిడి పండ్ల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. మామిడి పండ్ల గురించి చర్చలేని ఇల్లు ఉండదని పేర్కొన్నారు. ఒక్కో ప్రాంతానికి ఒక్కో రకం మామిడి పండు ఉంటుందని, దానికంటూ రుచి వేరేగా ఉంటుందన్నారు. మహారాష్ట్ర అల్ఫోన్సో, గుజరాత్ కేసర్, తెలుగు రాష్ట్రాల్లో బంగినపల్లి, తోతాపురి, నీలం, సువర్ణ రేఖ వంటి రకాలు లభిస్తాయని చెప్పారు. భారత్‌లో గ్రామీణ ప్రాంతాల్లో పండే మామిడి పండ్లకు ప్రపంచస్థాయి మార్కెట్ ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. సీబీఎస్ఈ మూల్యాంకనం గురించి ప్రశ్నలు లేవనెత్తిన విద్యార్థులతో ముచ్చటించిన వీడియోను తన సోషల్‌మీడియా ఖాతాలో పంచుకున్నారు. మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మిగతా 2లో..



### ఓఎస్ఎం పోర్టల్.. లోపాలు పరిశీలిస్తున్నాం
సీబీఎస్ఈ

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఆన్-స్క్రీన్ మార్కింగ్ మూల్యాంకన ప్రక్రియపై వివాదం నేపథ్యంలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఎట్టకేలకు మౌనం వీడింది. ఈ పోర్టల్‌లో వెలుగు చూస్తున్న లోపాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని పేర్కొంది. ఈ వ్యవస్థను పటిష్టం చేయడానికి సైబర్ సెక్యూరిటీ నిపుణుల బృందం కొన్ని రోజులుగా పనిచేస్తోందని, ఇప్పటివరకు గుర్తించిన సమస్యలను సరిచేసిందని తెలిపింది." ఆన్ మార్క్ పోర్టల్‌లో వెలుగు చూస్తోన్న లోపాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నాం. ఈ వ్యవస్థలను మిగతా 2లో..

పాఠశాల విద్యలో తెలంగాణ పనితీరు గణనీయంగా

# మెరుగుపడింది

**పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో పేర్కొనడం ప్రజాప్రభుత్వ రెండేళ్ల కృషికి నిదర్శనం**

- ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా విద్యాశాఖ బాధ్యతలు స్వయంగా తీసుకుని కృషిచేస్తున్నా..
- విద్యా వికాస పునర్నిర్మాణానికి నడుం బిగించాం: సీఎం రేవంత్



హైదరాబాద్(జనంసాక్షి): పాఠశాల విద్యలో తెలంగాణ పనితీరు గణనీయంగా మెరుగుపడిందని కేంద్ర విద్యాశాఖ.. పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో పేర్కొనడం తమ ప్రభుత్వ రెండేళ్ల కృషికి నిదర్శనమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అభివృద్ధికి తొలి కొలమానం విద్య అని చెప్పారు. విద్య ఒక్కటే పేదరికాన్ని నిర్మూలించి, సమాజాన్ని జాగృతం చేయగలదని తాను బలంగా విశ్వసించినట్లు తెలిపారు. ఆ దిశగా ప్రజా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా విద్యాశాఖ బాధ్యతలు స్వయంగా తీసుకుని.. రెండేళ్లుగా తెలంగాణ మోడల్ స్కూళ్ల ఏర్పాటు, నూతన ఉపాధ్యాయుల నియామకం, డిజిటల్ విద్యకు ప్రాధాన్యం, ప్రభుత్వ బడులకు ఉచిత విద్యుత్ సదుపాయం, ఇతర మౌలిక సదుపాయాల కల్పన, డ్రాపౌట్ల నియంత్రణ వంటి అంశాలపై బలమైన కార్యాచరణ చేపట్టినట్లు వివరించారు.పదేళ్లలో జరిగిన విద్య విధ్వంసం నుంచి విద్యా వికాస పునర్నిర్మాణానికి నడుం బిగించామన్నారు. తాజా ఫలితాలతో సంతృప్తి పడట్లేదని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం పూర్తయి.. భవిష్యత్‌లో ఈ పాఠశాలలు దేశ విద్యా వ్యవస్థలో రాష్ట్రాన్ని స్థానాన్ని నం.1గా నిలబెడతాయన్న విశ్వాసం ఉందన్నారు. ఆ లక్ష్య సాధన దిశగా కేంద్ర నివేదికలో పేర్కొన్న ఫలితాలు ప్రేరణ ఇచ్చాయని సీఎం తెలిపారు.



### ఖర్గేకు స్వాగతం పలికిన ముఖ్యమంత్రి రేవంత్
పార్టీ జాతీయ అధ్యక్షుడితో కాంగ్రెస్ నేతల భేటీ.. రాష్ట్ర రాజకీయాలపై చర్చ

2లో..

### నేడు ఆసిఫాబాద్‌లో సీఎం పర్యటన
పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

# రైతు డిస్కంపై కేటీఆర్ అనుమానాలు

**ఆ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి కొత్త నాటకమాడుతున్నాడని ఆరోపణలు**



హైదరాబాద్(జనంసాక్షి): రైతు డిస్కం పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి కొత్త నాటకం ఆడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. "రేవంత్‌రెడ్డి గతంలో సాగుకు రోజుకు 3 గంటల విద్యుత్ చాలన్నారు. ఇప్పుడు మాటమార్చి రైతు డిస్కం ఏర్పాటు చేస్తామంటున్నారు. రైతు మెడకు ఉరి పెట్టే డిస్కం అది. కంటోన్మెంట్ ఉప ఎన్నిక సమయంలో స్థానికంగా ఆరు వేల ఇళ్లు కట్టిసామన్నారు. ఇప్పటి వరకు ఆరు ఇళ్లయినా కట్టించారా? రేవంత్‌రెడ్డి 420 హామీలు అమలు చేసి చూపించాలి. కేసీఆర్ అప్పులు చేసి సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేశారు. రూ. 4 లక్షల కోట్ల అప్పులు చేసిన సీఎం రాష్ట్రానికి ఏం చేశారో చెప్పాలి" అని డిమాండ్ చేశారు.

### అన్నదాతల పాలిట శాపంగా రైతు డిస్కం
7 గంటలే విద్యుత్ ఇచ్చేలా కుట్ర
దీనితో తాగునీటి ప్రాజెక్టులకు కూడా కరెంట్ కోతలు : హరీశ్‌రావు
2లో..

# ఎండలున్నాయ్ జాగ్రత్త!



- ఎక్కడికెళ్లినా నీళ్లు వెంట తీసుకెళ్లండి
- మన్‌కీబాత్‌లో ప్రజలకు మోదీ మరోసారి సూచనలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రధాని మోదీ 'మనసులో మాట' 134వ ఎపిసోడ్- ఇటీవల ఝార్ఖండ్‌లో అథ్లెటిక్స్ గురించి ప్రస్తావించిన మోదీ- మన్‌కీ బాత్‌లో గుర్వీందర్, అనిమేష్‌తో మాట్లాడిన ప్రధాని మన్‌కీ బాత్ 134వ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఎండల దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. బయటకు వెళ్లాల్సి వస్తే తాగునీరు వెంట ఉంచుకోవాలని మరోసారి సూచించారు. వివిధ రాష్ట్రాల్లో ఎండల నుంచి ఉపశమనం కోసం తాగే పానీయాల గురించి ప్రధాని ప్రస్తావించారు. మజ్జిగ, షర్బత్, తదితర పానీయాలను తాగాలని ప్రజలకు సూచించారు. ఆ తర్వాత కేరళ ఆలువా ప్రాంతంలో స్విమ్మింగ్ క్లబ్ సేవలను మోదీ ప్రశంసించారు. 15 వేల మంది ఔత్సాహికులకు క్లబ్ నిర్వహకులు ఉచితంగా ఈత నేర్పించారని తెలిపారు. ఇటీవల ఝార్ఖండ్‌లో అథ్లెటిక్స్ గురించి ప్రస్తావించిన మోదీ నాలుగు విభాగాల్లో క్రీడాకారులు రికార్డులు సృష్టించారని అన్నారు. వంద మీటర్ల పరుగులో గుర్వీందర్, అనిమేష్ రికార్డులు సృష్టించారని వెల్లడించారు. ఈ సందర్భంగా గుర్వీదర్, అనిమేష్ పరుగు మిగతా 2లో..

# సీడీఎస్‌గా రాజా సుబ్రమణి

**బాధ్యతల స్వీకరణ ● మే 30తో ముగిసిన జనరల్ అనిల్ చౌహాన్ పదవీకాలం**



న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత నూతన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్‌గా జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. జనరల్ అనిల్ చౌహాన్ పదవీకాలం మే 30న ముగిసిన నేపథ్యంలో ఆయన స్థానంలో రాజా సుబ్రమణి నియమితులయ్యారు. బాధ్యతల స్వీకరణ సందర్భంగా దిల్లీలోని సౌత్ బ్లాక్ లాన్స్‌లో జనరల్ రాజా సుబ్రమణికి మిగతా 2లో..

# జూన్ 3 వరకు ఎండలే..

పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు



హైదరాబాద్(జనంసాక్షి):
తెలంగాణలో జూన్ మూడో తేదీ వరకు ఎండల తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ శనివారం వెల్లడించింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతాయని స్పష్టం చేసింది. పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను కూడా జారీ చేసింది. 31వ తేదీన 28 జిల్లాలు, జూన్ ఒకటిన 11 జిల్లాలు, 2వ తేదీన 12, మూడో తేదీన 17 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యే మిగతా 2లో..

ముగ్గురు స్నేహితులను కాపాడి..

### తాను ప్రాణాలు కోల్పోయి..

అమెరికాలో రంగారెడ్డి జిల్లా యువకుడి మృతి



2లో..

## ఖర్గేకు స్వాగతం పలికిన సీఎం రేవంత్

**పార్టీ జాతీయ అధ్యక్షుడితో కాంగ్రెస్ నేతల భేటీ.. రాష్ట్ర రాజకీయాలపై చర్చ**

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్ మీదుగా గుల్బర్గా వెళ్లిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కలిశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీహరి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ తదితరులు.. ఆప్యాయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయాలపై మల్లికార్జున ఖర్గేతో చర్చించారు. పార్టీ బలోపేతానికి నేతలు కృషి చేయాలని ఈ సందర్భంగా ఖర్గే సూచించినట్టు సమాచారం.

## నేడు ఆసిఫాబాద్‌లో సీఎం పర్యటన

**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**

కుమురంభీం ఆసిఫాబాద్(జనంసాక్షి):నేడు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు. రూ.112.14 కోట్ల విలువైన అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. విద్యుత్ మౌలిక సదుపాయాలు, సౌర విద్యుత్ ప్రాజెక్టు, ఆసిఫాబాద్‌లో మున్సిపల్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

## మక్కలు కొంటున్న ఏకైక రాష్ట్ర తెలంగాణ

**కేంద్ర ప్రభుత్వ చర్యల వల్ల కొనుగోళ్లలో కొంత ఆలస్యమైంది:మంత్రి తుమ్మల**

**హైదరాబాద్(జనంసాక్షి):** దేశంలో మొక్కజొన్నలు కొన్న ఏకైక రాష్ట్రం తెలంగాణనేనని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 14 లక్షల టన్నుల మక్కలు కొన్నట్లు చెప్పారు. మక్కల కొనుగోలుపై మంత్రి ఆదివారం మాట్లాడారు. "కేంద్ర ప్రభుత్వ చర్యల వల్ల కొనుగోలులో కొంత ఆలస్యమైంది. లారీలు, కూలీలు, డీజిల్ కొరత ఉంది. అయినా, రాష్ట్రంలో గోదాంలు నిండటంతో పొరుగు రాష్ట్రాలకు పంపుతున్నాం. మక్కల కొనుగోలు వల్ల నష్టం వచ్చినా.. రైతులను ఆదుకుంటాం. దేశంలో అత్యధికంగా వరి కొనుగోలు చేసిన రాష్ట్రం కూడా తెలంగాణనే. ఇప్పటి వరకు 65 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం" అని మంత్రి తెలిపారు.

## అన్నదాతల పాలిట శాపంగా రైతు డిస్కం

**7 గంటలే విద్యుత్ ఇచ్చేలా కుట్ర**

**దీనితో తాగునీటి ప్రాజెక్టులకు కూడా కరెంట్ కోతలు : హరీశ్‌రావు**

హైదరాబాద్(జనంసాక్షి): రైతు డిస్కం.. అన్నదాతల పాలిట శాపంగా మారనుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఈ డిస్కం వల్ల తాగునీటి ప్రాజెక్టులకు కూడా కరెంట్ కోతలు వస్తాయని చెప్పారు. ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి తీరుపై మండిపడ్డారు. "ప్రస్తుతం రైతులకు రోజుకు 13 గంటలకు మించి కరెంట్ ఇవ్వట్లేదు. రైతు డిస్కం ఏర్పాటుతో 7-8 గంటలే ఇచ్చేందుకు కుట్రలు చేస్తున్నారు. గుజరాత్‌లో రైతులకు 7 గంటలే విద్యుత్ ఇస్తున్నారు. బడే భాయి మోదీ విధానాలనే అమలు చేసేందుకు ఛోటా భాయి యత్నిస్తున్నారు. రైతు డిస్కంలో సౌర విద్యుత్ మాత్రమే ఇస్తామని జీవోలో పేర్కొన్నారు. ఆ విద్యుత్‌తో ఎత్తిపోతల ప్రాజెక్టుల మోటార్లు ఎలా నడుస్తాయి?"అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

## తెలంగాణలో జూన్ 3 వరకు ఎండలే

ఉన్నాయని సూచించింది.శనివారం తెలంగాణలో అత్యధికంగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలో 45.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయింది. పెద్దపల్లి జిల్లా అంతర్గాం 45.3, నిర్మల్ జిల్లా మామడ 45.2, ములుగు జిల్లా మంగపేట 45.2, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండలంలో 45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయింది. అత్యవసర సమయాల్లో తప్ప బయటకు వెళ్లొద్దని అధికారులు పేర్కొంటున్నారు. తాగు నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని తెలిపారు.శనివారం నాటికి అరేబియా మహా సముద్రంతో పాటు లక్షద్వీప్, ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతం ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాలు పూర్తిగా విస్తరించాయి. మరో ఐదు రోజుల్లో కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలను తాకడానికి పరిస్థితులు అనువుగా ఉన్నాయని వాతావరణ విభాగం వెల్లడించింది. ఈసారి తెలంగాణలో వర్షపాతం కొంత లోటుగా ఉంటుందని వాతావరణ అధికారులు చెబుతున్నారు. ఉత్తర, దక్షిణ తెలంగాణల్లో 20 నుంచి 30 శాతం లోటు ఉంటుందని, మధ్య తెలంగాణలో మాత్రం సాధారణంగా ఉండే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.ఎండల తీవ్రత కారణంగా రాష్ట్రవ్యాప్తంగా శనివారం వివిధ ప్రాంతాల్లో వడ దెబ్బకు గురై 13 మంది మృతి చెందారు. అత్యధికంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఐదుగురు, కరీంనగర్‌లో ముగ్గురు, నల్గొండలో ముగ్గురు, నిజామాబాద్‌లో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. సిద్దిపేటలో ఒకరు మృతి చెందారు.

రైతులకు ముందస్తు సమాచారం : తెలంగాణలో రైతులకు వాతావరణ పరిస్థితులపై ముందస్తు సమాచారం అందించే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డిజిటల్ సాంకేతికత, డేటాల అనుసంధానంతో సాటిలైట్ ఆధారిత వాతావరణ అంచనాలతో రూపొందించిన సమాచారాన్ని 17 జిల్లాల్లోని రైతులకు సెల్‌ఫోన్ల ద్వారా అందించే కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సచివాలయంలో ప్రారంభించారు. తొలి వాతావరణ సూచనను వాట్సాప్ ద్వారా తెలంగాణ రైతాంగానికి పంపించారు.

వాతావరణం సలహా పేరిట : తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమం పేరుతో వ్యవసాయశాఖ దీనిని ప్రతిష్టాత్మకంగా రూపొందించింది. దీని అమలుకు డెవలప్‌మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ (డీఐఎల్), ఇండియా ఎవిడెన్స్ యాక్షన్ సంస్థలతో ఎంఓయూ కూడా కుదుర్చుకుంది. వాతావరణశాఖ సహకారంతో ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, కుమురంభీం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, జగిత్యాల, జయశంకర్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, వరంగల్ జిల్లాల్లోని దాదాపు 304 మండలాలకు చెందిన 15 లక్షల మంది రైతులకు వాట్సప్ ద్వారా సమాచారాన్ని వేగంగా చేరవేస్తారు. ఈ కార్యక్రమాన్ని త్వరలో మిగిలిన జిల్లాలకు విస్తరిస్తామని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, సంచాలకుడు గోపి, సహకార శాఖ ప్రత్యేక డైరెక్టర్ రాహుల్ రాజ్, ఎవిడెన్స్ యాక్షన్ సంస్థ కంట్రీ డైరెక్టర్ అంకుర్‌గర్ తదితరులు పాల్గొన్నారు.

## పాక్ దుశ్చర్య

**ఉగ్రవాదులకు సాయంగా భారత్‌లోకి అక్రమంగా టెలికామ్ సంకేతాలు**

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఉగ్రవాద పోషణలో పాక్ వంకర బుద్ధి మారడంలేదు. జమ్మూ కశ్మీర్‌లోని ఉగ్ర నెట్‌వర్క్‌ల కోసం అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ నిబంధనల ఉల్లంఘనలకు కూడా పాల్పడు తోంది. ఇందుకోసం సరిహద్దుల వెంట భారత్ వైపు అక్రమంగా సెల్యూలర్ సంకేతాలను పంపిస్తోంది. ఇది ఉగ్రవాదుల రహస్య కమ్యూనికేషన్లకూ ఊపిరిగా ఉపయోగపడుతోందని అధికారులు వెల్లడించారు. ఇటీవల పాకిస్థాన్ చర్యలు అధికారుల అనుమానాలను మరింత బలపరుస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణ పీర్ పంజాల్ పర్వతశ్రేణుల్లో చొరబాట్లు పెరుగుతున్నాయి. దీనికి తోడు నియంత్రణ రేఖకు అటువైపు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఏర్పాటు చేసిన సెల్ టవర్ల సంకేతాలు కరుడు గట్టిన ఉగ్రవాదులున్న జైళ్లకు చేరుతున్నాయి. కశ్మీర్‌లోని పర్వతశ్రేణులు సహజంగా చాలా వరకు సంకేతాలను అడ్డుకొంటున్నా.. మైదాన ప్రాంతం ఉన్న జమ్మూలో మాత్రం ఈ సంకేతాలు భారత్‌లోకి చొరబడి ఉగ్రనెట్‌వర్క్‌లకు చేరుతున్నాయి. ముఖ్యంగా కతువా, రాజౌరీ, పూంచ్ జిల్లాలు, జమ్మూలోని కోట్ బల్వాల్ జైలు వంటి ప్రదేశాల వద్ద పాక్ టెలికామ్ సిగ్నల్స్‌ను మన దళాలు గుర్తించాయి. కొన్ని జైళ్లలో ఇప్పటికే జామర్లను ఏర్పాటు చేసినా వీటిని అడ్డుకోవడంలో విఫలం అవుతున్నాయి. అక్రమంగా కారాగారాల్లోకి చేరిన ఫోన్లను ఖైదీలు వినియోగిస్తున్నారు. జమ్మూకశ్మీర్‌లో మొత్తం 14 జైళ్లు, రెండు కరెక్షన్ హోమ్‌లు ఉన్నాయి. పాకిస్థాన్ టవర్లు చైనాకు చెందిన సీడీఎంఏ టెక్నాలజీని వినియోగిస్తున్నాయి. వీటిల్లో అత్యున్నత స్థాయి ఎన్‌క్రిప్షన్ సాధ్యమవుతుంది.

**గాలి.. నీరు.. నేల విషం..**

# గ్రామాల్లో మేమెట్లా బతకాలే..?



రసాయన వ్యర్థాలను బయటకు విడుదల చేస్తుంటారు. ఈ వ్యర్థాలను కామన్ ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటు(ఈటీపీ) ద్వారా శుద్ధి చేసి ప్రత్యేక కాలువల ద్వారా బయటకు విడుదల చేయాల్సి ఉండగా దానికి భిన్నంగా నేరుగా విడుదల చేస్తున్నారు. దీంతో నీరంతా వ్యవసాయ పొలాలు, చెరువుల్లోకి వెళ్తోంది. ఈపీటీ ప్లాంట్ ద్వారా రీసైకిల్ చేయాలంటే ఖర్చుతో కూడుకున్నది. ఖర్చు నుంచి తప్పించుకునేందుకు బయటకు వదిలిన నీరు కుంటల్లోకి చేరేలా పిల్ల కాల్వలను తీసి.. ఒక కుంట నిండాక దానికి గండి కొట్టి మరో కుంటకు కాల్వను తీసి లింక్ కలుపుతున్నారు. ప్రస్తుతం సెజ్ పరిధిలో ఉన్న కుంటలు మొత్తం పూర్తిగా వ్యర్థ జలాలతో నిండిపోయి కలుషితమ య్యాయి. మరోవైపు మరి కొన్ని ఫార్మ కంపెనీలు తమ కంపెనీల చుట్టు పక్కల సుమారు 4, 5 వందల అడుగుల లోతు వరకు బోర్లు వేసి ఆ వ్యర్థ జలాలను పైపులైన్ ద్వారా అందులోకి వదులుతున్నాయి. దీంతో జడ్చర్ల మండలంలోని పోలేపల్లి, గుండ్లగడ్డ తండా, రాజాపూర్ మండలంలోని రాయపల్లి, ముదిరెడ్డిపల్లి, నందిగామ గ్రామాలపై కాలుష్య ప్రభావం ఉంటోంది. రసాయనాలతో పంటల దిగుబడి తగ్గుతోందని, భుగర్భ జలాలు కలుషితమవడంతో అనారోగ్యానికి గురవుతున్నామని ప్రజలు ఏళ్లుగా అధికారులకు మొరపెట్టుకుంటూనే ఉన్నారు.

**నిత్యం నరకం.. అన్నివిధాలా నష్టం**

ఈ సెజ్ పరిధిలో పోలేపల్లి గ్రామం వద్ద రంగమ్మకుంట, గుండ్లగడ్డ తండా వద్ద అవుసులవారి చెరువు(గండి కుంట), కుమ్మరికుంట, ముదిరెడ్డిపల్లి వద్ద పల్లె చెరువు, రాయపల్లి వద్ద పెద్దకుంట, చిన్నకుంట ఉన్నాయి. గుండ్లగడ్డ తండాకు చెందిన ప్రజలు కుమ్మరికుంట, అసువులవారి చెరువు మధ్యలో తవ్విన కాల్వను దాటుకొని తండాలోకి వెళ్లాలి. ఈ కాల్వను దాటుతున్నప్పుడు కాళ్లు తడుస్తుండటంతో మోకాళ్ల వరకు ప్రజలకు స్కిన్ ఇన్‌ఫెక్షన్ వస్తోంది. ఈ నీళ్లతో స్నానాలు చేస్తున్నవారికి ముఖాలు కందిపోయినట్లు అవుతోంది. తల వెంట్రుకలు రాలిపోతున్నాయి. నీళ్లల్లో తడిస్తే కనీసం నాలుగు గంటల వరకు దురద తగ్గడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. సెజ్ చుట్టు ఉన్న కుంటలు, చెరువుల ద్వారా సుమారు రెండు వేల ఎకరాల సాగు జరుగుతుండేది. వానానాలం సీజన్‌లో వరి సాగు చేస్తుంటారు. ప్రస్తుతం ఈ చెరువులోకి ఫార్మా కంపెనీల వ్యర్థాలు చేరడంతో నీళ్లు రంగు మారాయి. ఇవే నీళ్లు పొలాల్లోకి వెళ్తుండటంతో పంటలు పండడం లేదు. మొక్కలకు బలం కోసం మందులు వాడుతున్నా లాభం లేదు. పంటలు వేసిన రెండు వారాల్లోనే ఎర్రగా మారుతున్నాయి. చనిపోతున్నాయి. కొన్నిచోట్ల వరి కంకులు ఏర్పడినా గింజ పట్టలేదు. తాలే మిగులుతోంది. చివరికి మిగిలిన పంటనైనా కోద్దామంటే పొలాల్లో వ్యర్థ జలాలు ఉండటం వల్ల చర్మవ్యాధులు వస్తున్నాయని కూలీలు రావడం లేదు. పొలాల్లోకి నీళ్లు వస్తుండటంతో వరి కోత మెషిన్లు బురదలో ఇరుక్కుపోతున్నాయి. పోలేపల్లి చుట్టూ ఉన్న చెరువులను నమ్ముకొని కొంత మంది మత్స్యకారుల కుటుంబాలు జీవిస్తున్నాయి. ప్రభుత్వ సబ్సిడీ కింద చెరువులో వేల చేప పిల్లలు వదులుకున్నారు. రసాయనల నుంచి ఆ చేపలు బతికిన దాఖలాలు లేవు.

**ఫిర్యాదులన్నీ బుట్టదాఖలే..**

నిబంధల ప్రకారం పరిశ్రమల నిర్వాహకులు ఫార్మా ఉత్పత్తుల తయారీలో వెలువడిన వ్యర్థ జలాలను రీసైక్లింగ్ చేసి వదిలేయాలి. ఇక్కడ అలాంటి పరికరాలు లేనందున ఆ నీటిని ట్యాంకర్ల ద్వారా రీసైక్లింగ్ కేంద్రాలకు పంపించాలి. ఇవేమీ పట్టించుకోకుండా నేరుగా బయటకు వదులుతున్నారు. అధికారుల పర్యటనలు, గ్రామస్తులు ఫిర్యాదుల చేసినప్పుడు మాత్రమే వాటిని తరలిస్తున్నట్లు వాహనాలను చూపి సర్దుబాటు చేస్తుంటారు. ఇక వర్షాకాలంలో అయితే వరద పేరిట ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వరద మాటున పిల్ల కాలువలను తీసి అందులో వ్యర్థాల నీళ్లను కలిపి సమీప కుంటలకు, చెరువులకు వదులుతుంటారు. దీనిపై స్థానికులు మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో ఎన్నోసార్లు ఫిర్యాదు చేశారు. పాలమూరు అధికారులకు పట్టకపోవడంతో నెలకోసారి హైదరాబా ద్‌లోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులను కలిసి ఫిర్యాదు చేస్తున్నారు. చివరికి జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్‌జీటీ)లో ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాల్లేక వారి రోదన అరణ్యరోదనగా మారింది.

**బోర్ల నీరు కూడా రంగు మారుతోంది – కావలి సత్యయ్య**



ఫార్మా కంపెనీలు విడుదల చేస్తున్న కలుషిత జలాలు చెరువుల్లోకి చేరి నీరు విషపూరితమవుతోంది. చెరువుల కింద ఉన్న బోర్ల నీరు కూడా రంగు మారిపోయి, పంటల దిగుబడులు తగ్గిపోతున్నాయి. పశువులకు కూడా ఇబ్బందిగా మారింది. ఎర్రటి రంగులో ఉన్న నీటిని ఉపయోగిస్తే చర్మంపై దురద వస్తోంది. ఇప్పటికైనా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి స్పందించి రైతులకు న్యాయం చేయాలి. పరిశ్రమల వ్యర్థ జలాలపై కఠిన చర్యలు తీసుకుని, కాలుష్య నియంత్రణ చర్యలు అమలు చేయాలి.

**వందల అడుగుల లోతుల్లో బోర్లు వేసి.. – నరసింహా**



సెజ్‌లో అనేక ఫార్మా కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. వాటి రసాయన వ్యర్థాల వల్ల తాగునీరు కలుషితమవుతుందని ముదిరెడ్డిపల్లి గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. 300 నుంచి 500 అడుగుల లోతులో బోర్లు వేసి, వాటిలో రసాయన అవశేషాలను వదులుతున్నారు. చర్మవ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం, కాలుష్య నియంత్రణ అధికారులు తక్షణమే స్పందించాలి.

**నీటిని కొనుక్కుంటున్నాం : రత్తమ్మ**



రసాయన వ్యర్థాలపై అధికారులకు ఫిర్యాదు చేసినప్పుడు కొద్దిరోజుల పాటు మాత్రమే కాలుష్యం తగ్గుతుంది. తర్వాత మళ్లీ యథావిధిగా రంగురం గుల నీటితో కూడిన వ్యర్థాలు కాల్వల ద్వారా చెరువులోకి చేరుతున్నాయి. గ్రామంలో తాగునీటిని కొంటున్నాం. బోర్ల నీరు కలుషితమైపోవడంతో దానిని తాగితే అనారోగ్య సమస్యలు తప్పవని, ఆసుపత్రుల పాలవడం ఖాయమని మహిళలు భయాందోళనలో ఉన్నారు.

## సీడీఎస్‌గా రాజా సుబ్రమణి

త్రివిధ దళాలు గౌరవ వందనాన్ని సమర్పించాయి. అనంతరం దేశ రాజధానిలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. పాకిస్థాన్, చైనా వ్యవహారాల్లో నిపుణుడిగా గుర్తింపు పొందిన సుబ్రమణి, నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్‌లో సైనిక సలహాదారుగా సేవలు అందించారు. గతేడాది జులై 31న వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా ఆయన పదవీ విరమణ చేశారు. సీడీఎస్?గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సుబ్రమణి మీడియాతో మాట్లాడారు. సైనిక దళాల బలోపేతం, త్రివిధ దళాల మధ్య సమన్వయం, ఏకీకరణకు సంస్థాగతంగా సంస్కరణలు తేవడమే తన లక్ష్యమని ఆయన స్పష్టంచేశారు. దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను పరిరక్షించడానికి కట్టుబడి ఉన్నామని వెల్లడించారు. సాయుధ దళాలు అంకితభావం, ధైర్యం, వృత్తి నైపుణ్యంతో దేశానికి సేవ చేయడం కొనసాగిస్తాయని, ఈ మేరకు దేశ ప్రజలకు హామీ ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, రాజా సుబ్రమణి సీడీఎస్ పదవితో పాటు భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ మిలిటరీ అఫైర్స్' సెక్రటరీగా కూడా బాధ్యతలను నిర్వర్తించనున్నారు. భారత చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్‌గా బాధ్యతలు స్వీకరించడం నాకు గౌరవంగా ఉంది. సాయుధ దళాలపై దేశం ఉంచిన నమ్మకానికి మేం కృతజ్ఞులం. భారతదేశ భద్రతను బలోపేతం చేసే 'సమగ్ర దేశ విధానంలో' భాగంగా మేం, భారత సైన్యం, నౌకాదళం, వైమానిక దళం, రక్షణ మంత్రిత్వ శాఖ, వ్యూహాత్మక సంస్థలు, సంబంధిత వర్గాలన్నీ ఐక్యంగా నిలుస్తాం. ఈ ప్రయాణంలో ఆదర్శప్రాయమైన నాయకత్వానికి, సహకారానికి గాను, నా విశిష్ట పూర్వాధికారులైన దివంగత జనరల్ బిపిన్ రావత్, జనరల్ అనిల్ చౌహాన్‌లకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మన సైనికులు, నావికులు, వాయుసేన యోధుల ధైర్యాన్ని, వృత్తి నైపుణ్యాన్ని మేం ఎప్పుడు గుర్తుంచుకుంటాం. వారి శిక్షణ, సంక్షేమం మా ప్రథమ ప్రాధాన్యతగా ఉంటుంది. వారి శౌర్యం, త్యాగం, దేశభక్తి మనకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి. మన మాజీ సైనికులు, వీరనారీల సంక్షేమానికి మేం కట్టుబడి ఉన్నామని తెలిపారు.

## ఓఎస్‌ఎం పోర్టల్.. లోపాలు పరిశీలిస్తున్నాం

పటిష్టం చేయడానికి గత కొన్ని రోజులుగా ఐఐటీలు, వివిధ ప్రభుత్వ విభాగాలతో కూడిన సైబర్ సెక్యూరిటీ నిపుణులు ప్రయత్నిస్తున్నారు. వ్యవస్థను మరింత సురక్షితంగా మార్చేందుకు కృషి చేస్తున్నారు. ఇప్పటికే గుర్తించిన లోపాలను సరిచేశారు. ఇంకా ఏమైనా లోపాలు ఉన్నాయా? అనేది పరిశీలిస్తూ కట్టడి చేసే పనిలో ఉన్నారు. ఈ వ్యవహారంలో అప్రమత్తంగా ఉంటూ లోపాలను ఎత్తిచూపుతున్న పౌరులు, ఎథికల్ హ్యాకర్లందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. వారిలో కొందరిని సంప్రదించాం. మరేదైనా సమాచారం ఉంటే సైబర్ భద్రతా విభాగాన్ని సంప్రదించవచ్చు" అని ఎక్స్ వేదికగా సీబీఎస్ఈ సూచించింది.

## ముగ్గురు స్నేహితులను కాపాడి.. తాను ప్రాణాలు కోల్పోయి

**అమెరికాలో రంగారెడ్డి జిల్లా యువకుడి మృతి**

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికాలోని లూసియానాలో విషాద ఘటన చోటు చేసుకుంది. అమెరికా లూసియానాలోని టోరోడో పార్క్‌లో ఉన్న సెబాన్ రివర్?లో సరదాగా స్నేహితులతో ఈత కొట్టేందుకు కోడూరు అనురూప్ రెడ్డి వెళ్లారు. ఈత కొట్టే సమయంలో అతనితో పాటు మరో ముగ్గురు స్నేహితులు ఉన్నారు. హఠాత్తుగా ముగ్గురు స్నేహితుల్లో ఒక్కొక్కరు లోతు ప్రదేశంలోకి వెళుతూ రక్షించండి అంటూ హాహాకారాలు చేశారు. గమనించిన అనురూప్ రెడ్డి ఆ ముగ్గురిని ఒక్కొక్కరిని పైకి లాగుతూ ఒడ్డుకు చేర్చారు.వారం రోజుల్లో పార్థివదేహం స్వదేశానికి : అనంతరం అనురూప్ రెడ్డి పైకి వచ్చే క్రమంలో అనూహ్యంగా చెరువులో ఉన్న ఫిషింగ్ వైరు కాలికి చుట్టుకుంది. పైకి రావడం ఇబ్బందికరంగా మారింది. అదే సమయంలో నీటి ప్రవాహం పెరగడంతో అనురూప్ రెడ్డి అందులోనే మృత్యువాతపడ్డాడు. ఒడ్డున ఉన్న స్నేహితులు, అక్కడున్న ఇతర ఈతగాళ్లు రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగింది. అనురూప్ రెడ్డిని స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. అప్పటికే అనుదీప్ మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ఇంకా పోస్టుమార్టం ప్రక్రియ పూర్తికాలేదు. టీం ఎయిడ్ అనే స్వచ్ఛంద సంస్థ, ఇండియన్ ఎంబసీ, లూసియానా కాన్సులేట్?లు సంయుక్త సహకారాలు అందించి, మరో వారం రోజుల్లో అతని పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు.

**అనురూప్ రెడ్డి నేపథ్యమిదే :**

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లి గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి కోడూరు రాజేందర్ రెడ్డి - దుర్గా భవాని దంపతులకు అనురూప్ రెడ్డి రెండో సంతానం. మొదటి కుమారుడు అశ్రీత్ రెడ్డి 2023లో అమెరికా వెళ్లగా, అనురూప్ రెడ్డి సైతం 2024లో అమెరికాకు వెళ్లారు. యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ మాస్టర్స్ గ్రాడ్యుయేషన్?ను గత నెల మేలో పూర్తి చేసిన అనురూప్ రెడ్డి, స్నేహితులతో కలిసి సరదాగా టోలేడో పార్కులో సేద తీరేందుకు వెళ్లారు.జూన్ నుంచి ఉద్యోగ అన్వేషణ చేయాల్సిన క్రమంలో సరదాగా గడిపే ఉద్దేశంగా క్యాంపింగ్ వెళ్లిన వారు ఇలా విగత జీవిగా మారడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## సీబీఎస్ఈ విద్యార్థులను వదలి మామిడిపళ్ల రుచులు కావాల్సివచ్చిందా?

ధైర్యవంతులు అని కొనియాడారు. అయితే, వారికి సమాధానాలకు బదులు అవమానాలు ఎదురయ్యాయని ఆందోళన వ్యక్తంచేశారు. సీబీఎస్ఈ టెండర్ నిబంధనలను మార్చేసిన ఫలితమే ఇదీ అని రాహుల్ గాంధీ తన ఎక్స్‌లో పేర్కొన్నారు. వాస్తవానికి 300 డీపీఐతో ఆటోమేటిక్ రోబోటిక్ స్కానర్లను పరీక్ష పత్రాల స్కానింగ్‌కు వినియోగించాల్సి ఉండగా.. తర్వాత నిబంధనలను సవరించారని పేర్కొన్నారు. దీంతో సంబంధిత టెండర్ దక్కించుకున్న కోఎంప్ట్ సంస్థ ఆన్సర్ షీట్లను మొబైల్ ఫోన్ సాయంతో స్కాన్ చేసి తప్పిదాలకు పాల్పడిందని ఆరోపించారు. దీనివల్ల విద్యార్థులు బాధితులుగా మారారని తెలిపారు. దీనిపై కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండగా.. ప్రధాని మోదీ 'మన్‌కీ బాత్'లో ఒక్క మాటా మాట్లాడలేదని విమర్శలు గుప్పించారు.

**స్టూడెంట్స్ అకస్మాత్తుగా దేశద్రోహులుగా మారిపోయారు'**

"వేదాంత్, అతని స్నేహితులు తెలివైన, ధైర్యవంతులైన భారతీయ యువకులు. వారు సీబీఎస్ఈ, మోదీ ప్రభుత్వాన్ని సాధారణ ప్రశ్నలు అడిగారు. కానీ సమాధానాలకు బదులుగా అవమానాలను ఎదుర్కొన్నారు. ఆ స్టూడెంట్స్ ఉజ్వలమైన, సురక్షితమైన భవిష్యత్తుకు అర్హులు. ఆ భవిష్యత్తును పొందేలా మేము చూస్తాం. విద్యార్థులు తమ జవాబు పత్రాలను అడిగారు అంతే. దీంతో స్టూటెండ్స్ కాస్త అకస్మాత్తుగా దేశద్రోహులుగా మారిపోయారు. సమస్యను అంగీకరించడానికి ప్రభుత్వం నిరాకరిస్తోంది. అందుకు బదులుగా పేద విద్యార్థులను నిందిస్తోంది. డీప్ స్టేట్, గూఢాచారులు, ఉగ్రవాదులు అని ముద్ర వేస్తోంది." అని విద్యార్థులతో రాహుల్ గాంధీ పేర్కొన్నారు.డీప్ స్టేట్ ఏజెంట్లు, పాకిస్థానీలు అని విద్యార్థులపై ముద్ర వేస్తున్నారు : ఖర్గే మరోవైపు, సీబీఎస్ఈ వివాదంపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే స్పందించారు. మోదీ సర్కార్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆందోళనలు వ్యక్తం చేస్తున్న విద్యార్థుల మాట వినకుండా, వారిపై 'డీప్ స్టేట్ ఏజెంట్లు', 'పాకిస్తానీలు' అని ముద్ర వేస్తున్నారని మండిపడ్డారు. విద్యా రంగంలో ప్రభుత్వ వైఫల్యాల కారణంగా సీబీఎస్ఈ విద్యార్థులు, నీట్ అభ్యర్థులు ఇద్దరూ బాధితులుగా మారారని పేర్కొన్నారు. ఒకప్పుడు ప్రతిభను పెంపొందించడంలో కీలక పాత్ర పోషించిన ప్రభుత్వ విద్యా సంస్థలు, ఇప్పుడు బీజేపీ నేతృత్వంలోని సర్కార్ హయాంలో పతనాన్ని ఎదుర్కొంటున్నాయని అన్నారు. నిరసన తెలిపే, సమస్యలను లేవత్తిన యువత గొంతులను మోదీ ప్రభుత్వం అణచివేస్తోందని ఆరోపించారు. నిరాధారమైన ఆరోపణలతో యువతను లక్ష్యంగా చేసుకుంటున్నారని విమర్శించారు. దేశ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడంలో బీజేపీ విఫలమైందని, నియామక పరీక్షలను తప్పుగా నిర్వహిస్తోందని మండిపడ్డారు. ఈ వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఖర్గే ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. "విద్యార్థులు పరీక్షా యోధులుగా నిలవడానికి ఎగ్జామ్‌కు బయలుదేరారు. కానీ అందుకు బదులుగా వారిపై డీప్ స్టేట్ ఏజెంట్లు, పాకిస్తానీలు అని ముద్ర వేశారు. సీబీఎస్ఈ విద్యార్థులదైనా, నీట్ ఆశావహులదైనా అదే పరిస్థితి. మోదీ ప్రభుత్వం దేశ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి కుట్ర పన్నుతోంది. దేశ యువతను తమ అవినీతి వలలో చిక్కుకునేలా చేసింది. ఒకప్పుడు ఐఐటీలు, ఐఐఎంలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు వంటివి దేశ ప్రతిభను పెంపొందించేవి. ఇప్పుడు బీజేపీ దోపిడీ కారణంగా ఒక్క బోర్డు పరీక్షను కూడా సరిగ్గా నిర్వహించలేకపోతున్నాయి. ఆ సంస్థలను బీజేపీ ఈ దుస్థితికి తీసుకువచ్చింది. ప్రభుత్వం విద్యా సంస్థలను బలహీనపరుస్తోంది. విద్యార్థుల గొంతుకను అణచివేస్తోంది. యూజీసీని నాశనం చేసింది. విశ్వవిద్యాలయాల్లో కక్షపూరిత రాజకీయాలను రెచ్చగొట్టింది. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల నుంచి చరిత్రను తొలగించింది. వీసీల నియామకాలు సైద్ధాంతికంగా ప్రభావితమయ్యాయి. దేశంలో 90,000కు పైగా ప్రభుత్వ పాఠశాలను మూసివేసింది. గత కొన్నేళ్లుగా బడ్జెట్‌లో విద్యా రంగానికి నిధుల కేటాయింపును తగ్గించింది."అని మల్లికార్జున ఖర్గే అన్నారు.సీబీఎస్ఈ ఓఎస్‌ఎం వివాదం నేపథ్యంలో కేంద్రమే టార్గెట్‌గా కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ విమర్శనాస్త్రాలు సంధించారు. మంత్రి ప్రధాన్ కుంభకోణాల మంత్రిత్వ శాఖకు సంబంధించిన నేడు 20 లక్షల 12వ తరగతి విద్యార్థుల జవాబు పత్రాలు బహిరంగంగా అందుబాటులోకి వచ్చాయని ఆరోపించారు. ఇది 20 లక్షల మంది విద్యార్థుల గోప్యతను ప్రమాదంలో పడేసిన ఒక భారీ డేటా లీక్ అని అభిప్రాయపడ్డారు. దీంతో కోఎంప్ట్ అసమర్థత, నిర్లక్ష్యం మరోసారి బట్టబయలైందన్నారు. ఆర్ఎఫ్‌పీ సాంకేతిక నిబంధనలను మార్చి సీబీఎస్ఈ కాంట్రాక్టును కోఎంప్ట్‌కు ఇచ్చారని అన్నారు. ఈ మార్పు బహుశా కోఎంప్ట్‌కు ప్రయోజనం చేకూర్చి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. "లీక్ అయిన జవాబు పత్రాలలో కాగితం మడతలు, డ్రాప్ షాడోల ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. సాధారణంగా స్కానింగ్ మెషీన్లకు బదులుగా మొబైల్ ఫోన్లతో చేసిన స్కాన్‌లలో కనిపించే గుర్తులు ఇవి. మూడో ఆర్ఎఫ్‌పీలో రోబోటిక్ స్కానర్ల అవసరాన్ని తొలగించారని మనకు తెలుసు. ఇది ఒక ప్రశ్నను లేవనెత్తుతోంది. కోఎంప్ట్ నిజానికి ఎలాంటి స్కానర్లను ఉపయోగించింది? స్కాన్ నాణ్యత ఎందుకు ఇంత పేలవంగా ఉంది?" అని జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

## ఎండలున్నాయ్ జాగ్రత్త!

పందెంలో తమ అనుభవాలను ప్రధాని మోదీతో పంచుకున్నారు. అలాగే, పురాణ కాలం నాటి అపూర్వ సంపద గురించి మోదీ ప్రస్తావించారు. ఈ సందర్భంగా చోళుల కాలం నాటి తామర పత్రాల విశిష్టత, ఛత్తీస్‌గఢ్‌లో లభించిన పాండవుల కాలం నాటి తామరపత్రాల గురించి వివరించారు.'కొద్ది రోజుల క్రితం నెదర్లాండ్స్‌ను సందర్శించే అవకాశం నాకు లభించింది. అక్కడ నేను అనేక సమావేశాల్లో పాల్గొన్నాను. అయితే, అక్కడ జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో చోళుల కాలం నాటి పురాతన రాగి ఫలకాలను భారత్‌కు అప్పగించారు. అంతేకాదు, ఆ కార్యక్రమానికి నెదర్లాండ్స్ ప్రధాని కూడా హాజరయ్యారు. ఈ ఫలకాల గురించి దేశం నలుమూలలు, విదేశాల నుంచి నాకు నిరంతరం సందేశాలు వస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళ సమాజాల్లో కూడా ఒక ప్రత్యేకమైన ఉత్సాహం నెలకొని ఉంది. వీటిలో 21 పెద్ద, 3 చిన్న రాగి ఫలకాలు ఉన్నాయి. అవి ప్రధానంగా మొదటి రాజేంద్ర చోళ మహారాజుకు సంబంధించినవి. ఆనైమంగళం గ్రామాన్ని బౌద్ధ విహారానికి ఇచ్చినట్లు ఇందులో పేర్కొన్నారు. అవి చోళ రాజవంశం విజయాలను వివరిస్తాయి. ఆ రాజవంశం బలమైన సముద్ర శక్తిని చూపిస్తాయి. ఆగ్నేయాసియా దేశాలతో వారి సంబంధాల గురించి కూడా సమాచారాన్ని అందిస్తాయి. చోళ సామ్రాజ్యం గొప్ప చరిత్ర, సంస్కృతి మనందరికి గర్వకారణం. అటువంటి అమూల్యమైన వారసత్వ సంపదను పరిరక్షించడానికి మా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది." అని అన్నారు.ఖగోళ శాస్త్రం తరతరాలుగా భారతీయులను ఆకర్షించిందని, గ్రామీణ ప్రాంతాల్లో ఈ విషయాన్ని ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి బెంగళూరు ఖగోళ సొసైటీ ఒక కార్యక్రమాన్ని ప్రారంభించిందని మోదీ నొక్కి చెప్పారు. అలాగే, రాత్రిపూట నక్షత్రాలను చూడటం అనేది ఒక అద్భుతమైన అనుభవమని, ఆస్ట్రో కేరళ అనే సంస్థ రాత్రిపూట పరిశీలన శిబిరాలు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తుందని ఆయన చెప్పారు. అక్కడి యువత టెలిస్కోపులు తయారు చేయడం, నక్షత్ర పటాలను ఉపయోగించడం నేర్చుకుంటున్నారని అన్నారు. "రాజ్‌కోట్‌లోని బిగ్ బ్యాంగ్ ఆస్ట్రానమీ క్లబ్ గిర్ అడవుల నుంచి రాన్ ఆఫ్ కచ్ వరకు అనేక ఖగోళ శాస్త్ర కార్యక్రమాలను నిర్వహించింది" అని మోదీ అన్నారు.

**మన్ కీ బాత్ స్ఫూర్తితో సైనికులకు విరాళం**

మరోవైపు, తమిళనాడులోని నాగర్‌కోయిల్‌కు చెందిన విద్యావేత్త గిరిజా అమ్మ గురించి మోదీ మాట్లాడారు. ఆమె చెన్నైలోని జైగోపాల్ గరోడియా హిందూ విద్యాలయంతో సహా 15 పాఠశాలలను నడుపుతున్నారని చెప్పారు. ఆమె దేశభక్తి స్ఫూర్తి ప్రతి భారతీయుడికి ఉత్తేజం ఇస్తుందన్నారు. "మన్ కీ బాత్ స్ఫూర్తితో, ఆమె దేశంలోని అనేక మంది సైనికులకు విరాళం ఇవ్వడానికి ప్రతిజ్ఞ చేశారు. ఇది చేయడానికి, ఆమె తన పాఠశాలలన్నింటిలోని విద్యార్థులను ప్రేరేపించారు. ధైర్యవంతులైన సైనికుల కోసం ప్రతిరోజూ ఒక రూపాయి విరాళంగా ఇవ్వమని ఆమె పిల్లలను కోరారు. అంటే, ప్రతి విద్యార్థి ఒక సంవత్సరంలో 365 రూపాయలు సేకరించారు. ఈ చిన్న విరాళాల ద్వారా సుమారు 40 లక్షల రూపాయలు సేకరించారు" అని మోదీ పేర్కొన్నారు.చెన్నైలోని మొట్టమొదటి హిందూ పాఠశాల గత సంవత్సరం తన 50వ వార్షికోత్సవాన్ని జరుపుకుందని మోదీ పేర్కొన్నారు. "దేశ విద్య, సాంస్కృతిక గౌరవాన్ని పెంపొందించడంలో ఈ పాఠశాలల పోషిస్తున్న పాత్ర ప్రశంసనీయం. ఇందులో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరినీ నేను అభినందిస్తున్నాను. ముఖ్యంగా మన ధైర్యవంతులైన సైనికులకు విరాళాలు అందించిన విద్యార్థులను ప్రశంసిస్తున్నాను. భారతదేశంలోని ప్రతి గ్రామంలో, నగరంలో మనకు స్ఫూర్తినిచ్చే ఏదో ఒక సంఘటన జరుగుతూనే ఉంది" అని మోదీ పేర్కొన్నారు.

# లారీలు వస్తలేవు.. ధాన్యాన్ని కొంటలేరు

- మాజీ మంత్రి దయాకర్‌రావు
- తొర్రూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మాజీ మంత్రి



**పాలకుర్తి, మే 31(జనంసాక్షి) :** లారీలు వస్తలేవు, ధాన్యం కొనుగోలు చేసేవారు ఎవరులేక రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లోను ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆవేదన వ్యక్తవ చేశారు. ఆదివారం హైదరాబాద్ నుంచి పాలకుర్తికి వస్తుండగా తొర్రూరు ధాన్యం కొనుగోలు కేంద్రంలోని దాన్యాన్ని చూసిన దయాకర్ రావు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. దయాకర్ రావు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసి నలబై రోజులుగా ఎవరు పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. రాసుల కొద్ది కుప్పలు పోసిన లారీలు మాత్రం వస్తలేవని, ఒక్క లారీ నాలుగు రోజులకు వస్తుందని రైతులు దయాకర్ రావు దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూతో దయాకర్ రావు మాట్లాడి రైతులు పడుతున్న ఇబ్బందులు నష్టాన్ని వివరించినట్లు తెలిపారు. రాష్ట్రంలో రాక్షస పాలను సాగుతుందని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డికి రైతుల పట్ల ప్రేమ ఉంటే ధాన్యం కొనుగోళ్లపై దృష్టి పేట్టేవారని, రెండు నెలలు గడుస్తున్న ధాన్యం ఇంకా కళ్లల్లోనే ఉందని వెంటనే లారీలను రప్పించి, ధాన్యం కొనుగోళ్లను వెంటనే చేపట్టాలని అన్నారు. ఆయన వెంట ఆ గ్రామ సర్పంచులు పసులాది యాకస్వామి, బానోతు మహేందర్, మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, పసునూరి నవీన్, మాచెర్ల ఎల్లయ్య, పసులాది అశోక్, నాయిని మల్లారెడ్డి, లొంక మల్లేష్, రాంరెడ్డి, పెండ్లి ఎల్లయ్య, చిదురాల ధనుంజయ తదితరులు ఉన్నారు.

# ఇండ్ల స్థలాలపై కన్నేసిన బడాబాబులు?



**ఆత్మకూర్, మే 23 (జనంసాక్షి) :** ఆత్మకూరు మండలంలోని నీరుకుళ్ళ క్రాస్ వద్ద ప్రతిపాదిత ఇళ్ల స్థలాల కేటాయింపు వ్యవహారం వివాదాస్పదంగా మారుతోంది. అసలైన నిరుపేదలను పక్కనపెట్టి అర్హత లేని వారికి స్థలాలు కేటాయించే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆత్మకూరు ఎమ్మార్వో జగన్మోహన్ రెడ్డికి వినతిపత్రం అందజేసి తమ అభ్యంతరాలను తెలియజేశారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నోటీసు బోర్డుకు స్పందిస్తూ, అర్హుల జాబితాను బహిర్గతం చేసి పూర్తి పారదర్శకతతో స్థలాల కేటాయింపు చేపట్టాలని కోరారు. కొంతమంది పలుకుబడి కలిగిన వ్యక్తుల ఒత్తిళ్లతో నిజమైన పేదలకు అన్యాయం జరిగే పరిస్థితి ఉందని గ్రామస్తులు ఆరోపించారు. క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన నిరుపేద కుటుంబాలకే ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

# ఆరెకటిక కులస్తుల గుజరాత్ యాత్ర

- స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ వద్ద తెలంగాణ వేడుకలు..



**వరంగల్ ప్రతినిధి, మే 31 (జనం సాక్షి):** తెలంగాణ చారిత్రాత్మక వారసత్వాన్ని ఆధ్యాత్మిక చింతన పెంపొందించడానికి వరంగల్ జిల్లా రంగసాయిపేట ఆరెకటిక పరపత్ సంఘం ఆధ్వర్యంలో గుజరాత్ రాష్ట్రంలోని పలు చరిత్ర చారిత్రాత్మక ప్రదేశాలు సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టాచు ఆఫ్ యూనిటీ వద్ద తెలంగాణ వేడుకలు జరుపుకొనున్నారు. ఆదివారం సాయంత్రం వరంగల్ రంగసాయిపేటకు చెందిన 108 మంది ఆరెకటిక కులస్తులు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు ప్రాంతాలకు విహారయాత్ర కోసం తరలి వెళ్లారు. ఆరెకటిక కులస్తులు పరస్పర ప్రేమ ఆప్యాయతలను పంచుతూ చారిత్రాత్మక విషయాలను రాబోయే తరం పిల్లలకు అందించడానికి విహారయాత్ర దోహదపడుతుందని ఉద్దేశంతో దేశంలోని పలు పర్యటక ప్రాంతాలతో పాటు తెలంగాణ నవనిర్మాణ దోహదపడిన సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద జూన్ రెండవ తేదీన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆరెకత్వ కులస్తుల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకొనున్నారు. ఆదివారం వరంగల్ రైల్వే స్టేషన్ నుండి గుజరాత్ రాష్ట్రానికి తరలి వెళ్లారు.

# బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

- మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైది రెడ్డి



**హుజూర్ నగర్, (జనంసాక్షి):** రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ పార్టీ ఎన్ఆర్ఐ విభాగం స్టేట్ కన్వీనర్ శానంపూడి సైదిరెడ్డి అన్నారు. ఆదివారం బీజేపి పార్టీ కార్యాలయంలో శానంపూడి సైదిరెడ్డి మాట్లాడుతూ బిజెపి పార్టీ నూతన ఉత్తేజంతో పనిచేస్తుంది. ప్రతి ఒక్కరూ బీజేపీ ని కోరుకుంటున్నారు. దేశంలో, రాష్ట్రాల్లో జాతీయ వాదం రావాలి. కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం చేసిన ఆరు గ్యారెంటీలతో పాటు చెప్పేవి అన్ని అబద్ధాలే అన్నారు. గతంలో అందరూ అధికారుల సమక్షంలో విలేకరులకు ఒక ఎమ్మెల్యేగా ఉన్న నేను ఇండ్ల పట్టాలిస్తే వాటికి అనుమతులు లేవు అంటున్నారు. గతంలో నా హయాంలో చేసిన అభివృద్ధి పనులు తప్ప, ఇక్కడ ఇప్పటివరకు ఏ అభివృద్ధి జరగలేదన్నారు. వ్యవసాయ కళాశాల కోసం రైతుల నోట్లో మట్టి కొట్టారని ఆరోపించారు. హుజూర్ నగర్ లో ఏ రోడ్డు చూసిన అవి వేసింది నా హయాంలోనే అన్నారు. రింగు రోడ్డుతో పాటు అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లను వేసింది నా హయాంలోనే అన్నారు. హుజూర్ నగర్ నియోజకవర్గంలో మట్టి మాఫియా రాజ్యమేలుతుంది అలాగే ఇతర పార్టీలకు చెందిన వారిని బెదిరింపు చర్యలకు పాల్పడి జైళ్ల పాలు చేస్తున్నారు. ఇక్కడ పుట్టి ఇక్కడ సేవ చేయాలనుకునే ఎన్ఆర్ఐ లను వేధించి జైళ్ల పాలు చేస్తామని బెదిరించిన ఘటనలు వాస్తవం కాదా అన్నారు. గ్రామ పంచాయితీ సర్పంచుల కు ఏడుపు తప్ప మిగిలింది ఏమీ లేదు. ఇక్కడ పుట్టి ఇక్కడ పెరిగిన నేను రాజకీయం కోసం కాదు ఇక్కడికి వచ్చింది అభివృద్ధి కోసం మాత్రమేనని అన్నారు. ఈఎస్ఐ హాస్పిటల్, బ్లడ్ బ్యాంక్, ఈసీజీ సెంటర్ తెచ్చింది మా హయాంలోనే అన్నారు. రానున్న రోజుల్లో పూర్తి స్థాయిలో నియోజకవర్గ అభివృద్ధికి పని చేస్తాము, ఇక్కడే ఉండి బీజేపీ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. దీనికి ప్రజలందరి సహకారం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో హుజూర్ నగర్ పట్టణ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్, రూరల్ మండల అధ్యక్షుడు గంగసాని నారపురెడ్డి, మఠంపల్లి మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంకటశివ, బిజెపి జిల్లా నాయకులు సోమగాని ప్రదీప్ గౌడ్, బెల్లంకొండ నరేష్ గౌడ్, గుండా గోపి, కొప్పెర సాయిరాం, రాళ్లబండి రామారావు, కంటు నాగరాజు, జగదయ్య, హిందూజా, గుండా కోటేశ్వరరావు, ఆరాల సైదులు, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

# నిప్పులు కక్కుతున్న భానుడు!

- గ్రామాల్లోని రోడ్లన్నీ నిర్మానుష్యం
- బయటికి వెళ్లాలంటేనే జంకుతున్న జనం...
- ఒక వైపు తీవ్రతరమైన ఎండ... మరోవైపు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి
- శీతల పానీయాలతో ఉపశమనం పొందుతున్న ప్రజలు







**చెన్నారావుపేట, మే 31 (జనంసాక్షి) :** ఎండలు రోజురోజుకు దంచి కొడుతున్నాయి. భానుడు నిప్పులు కక్కుతూ తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. మే నెల పూర్తయి జూన్ నెల ప్రారంభం అవుతున్నప్పటికీ సూర్యుడు ఉగ్రరూపం దాల్చుతూనే ఉన్నాడు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఎండలు భగభగ మండుతున్నాయి. బయటికి వెళ్లాలంటేనే గ్రామాల్లోని ప్రజలు జంకుతున్నారు. చెన్నారావుపేట మండల కేంద్రంతో పాటు గ్రామాలలోని రోడ్లు మొత్తం ఆదివారం ఎండ తీవ్రతతో నిర్మానుష్యంగా మారాయి. దీనికి తోడు ఒక వైపు వడగాలులు మరోవైపు ఉక్కపోతతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. పశుపక్షాదులు సైతం ఎండను తట్టుకోలేకపోతున్నాయి. రోజురోజుకు ఎండలు మండుతుండడంతో జనం కొబ్బరి బోండాలు, జ్యూస్ లు, ఇతర శీతల పానీయాలు, కూలర్లు, ఏసీలు, చల్లని ఫ్రిడ్జ్ లు, రంజన్ల నీటితో ఉపశమనం పొందుతున్నారు. కొంతమంది గ్రామాల్లోని చెట్ల కింద సేద తీరుతున్నారు. అంతేకాక గ్రామాలలోని యువకులు, విద్యార్థులు చెరువులు, వ్యవసాయ బావులలో ఈతలను కొడుతూ ఉపశమనం పొందుతూ నీటిలో సేద తీరుతున్నారు. అదేవిధంగా చిరు వ్యాపారస్తులు, ఉద్యోగులు, పాదాచారులు పడరాని పాట్లు పడుతున్నారు. క్రమక్రమంగా పెరుగుతూ వస్తున్న ఉష్ణోగ్రతలు ఆదివారం నాటికి 45 డిగ్రీల సెంటిగ్రేడ్ ను దాటాయి. తప్పనిసరి బయటికి వెళ్లాలంటే ముఖానికి తలపాగా, టోపీ, స్కార్పులు ధరించుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

### జూన్ 4 వరకు మరింత తీవ్రతరం కానున్న ఎండలు...

జూన్ 4వ తేదీ వరకు ఎండలు మరింత తీవ్రతరం కానున్నాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు 45 డిగ్రీల సెల్సియస్ నుండి 55 డిగ్రీల సెల్సియస్ వరకు దాటే అవకాశం ఉందని ఎవరు బయట తిరగకూడదని హెచ్చరికలు జారీ చేశారు. దీని కారణంగా ఎవరికైనా ఊపిరి ఆడకుండా అకస్మాత్తుగా అస్వస్థకు గురైనట్లయితే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరుతున్నారు.



# సమీకృత జిల్లా కార్యాలయం పనులు త్వరగా పూర్తి చేయాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద..



**వరంగల్ ప్రతినిధి, మే 31 (జనంసాక్షి):** వరంగల్ జిల్లా సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద దేవి పరిశీలించారు. 'ఆదివారం ఓ సిటీ లో నిర్మాణం లో ఉన్నా జిల్లా సమీకృత కార్యాలయ సముదాయాన్ని సందర్శించారు. ఈ సందర్శనకు వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్ ,సంబంధిత అధికారులు ,కాంట్రాక్టర్ తదితరులు కలెక్టర్ కు పురోగతిలో ఉన్న పనుల గురించి వివరించారు. అనంతరం సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్లను నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తిచే యాలని, త్వరలో అందుబాటులోకి రానున్న సమీకృత జిల్లా కలెక్టరేట్ సముదాయాన్ని మొక్కలు కొన్ని అందమైన చెట్లును నాటడం ద్వారా ఇంకా సుందరీకరణగా తీర్చిదిద్దాలని కలెక్టర్ తెలిపారు.



### కాళేశ్వరంను దర్శించుకున్న దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు

**కాళేశ్వరం, జూన్ 1 (జనంసాక్షి) :** ఆదివారం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, వారి కుటుంబ సభ్యులు మరియు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వారికి ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు శేష వస్త్రాలు అందజేశారు.

# సీఎం ఓవర్సీస్ పథకానికి దరఖాస్తు చేసుకోండి

- మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** విదేశాల్లో ఉన్నత విద్యలను అభ్యసిస్తున్న మైనారిటీ విద్యార్థుల కొరకు మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న సీఎం ఓవర్సీస్ పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ. యాకూబ్ పాషా ఆదివారం నాడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం ఐదు లక్షల రూపాయల లోపు కలిగి, 01-01-2026 నుంచి 30-06-2026 లో అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, బ్రిటన్, సింగపూర్, జర్మనీ, సౌత్ కొరియా, జపాన్, ఫ్రాన్స్, న్యూజిలాండ్ దేశాలలో పీజీ (ఇంజనీరింగ్) పీహెచ్.డీ (ఇంజనీరింగ్)లలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు మాత్రమే ఈ స్కాలర్ షిప్ లు పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు తమ పదవతరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ సర్టిఫికెట్లు, జీఆర్ఈ/జీమాట్ పరీక్ష స్కోర్ కార్డు, టోఫెల్/ఐల్ట్స్ స్కోర్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్, నివాస ధ్రువీకరణ పత్రం, పాస్పోర్ట్, విదేశీ విద్యాలయాలలో చేరినట్లు ధ్రువీకరణపత్రం, బ్యాంకు పాసు పుస్తకం, పాస్పోర్ట్ ఫోటో, ఒరిజినల్ ట్రాన్ స్క్రిప్ట్ పత్రాలతో జూన్ 30 వ తేదీ లోపు www.telanganaepass.cgg.gov.in వెబ్ సైట్ నందు తమ వివరాలను నమోదు చేసుకొని హార్డ్ కాపీలను తమ తమ జిల్లాలలో గల మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయాలలో అందించాలని తెలిపారు. ఈ ఉపకార వేతనాలకు ఎంపికైన వారికి 20 లక్షల రూపాయలతో పాటు విమాన చార్జీల నిమిత్తం 60 వేల రూపాయలు కూడా అందిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని మైనారిటీ వర్గాలకు చెందిన ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకై 8520860785 నంబర్ కు సంప్రదించాలని కోరారు.

### చెలరేగిన మంటలు.. తప్పిన ప్రమాదం



**చిట్యాల, మే 31 (జనం సాక్షి) :** ఆదివారం మండల కేంద్రంలోని రాంనగర్, బీసీ కాలనీ సమీపంలో పంట పొలాలకు రైతులను నిప్పు పెట్టడంతో, ఉష్ణోగ్రత పెరిగి గాలి ఎక్కువగా వీచడంతో మంటలు చెలరేగి, గ్రామాల్లో మంటలు రావడంతో ప్రజలు ఆందోళనతో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. స్థానిక సర్పంచి గ్రామపంచాయతీ వాటర్ ట్యాంక్ తో పాటు ఏలేటి రామయ్య పల్లి, గ్రామపంచాయతీ వాటర్ ట్యాంక్ లతోపాటు భూపాలపల్లి, ఫైర్ ఇంజన్, సిబ్బందితో మంటలు ఆర్పారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. అగ్నిప్రమాదంలో రైతులు బోల్లపల్లి సాంబయ్య, ఆరెపల్లి సమ్మయ్య, కట్కూరి సమయ తదితర రైతుల వడ్లు, పైపులు, వరిగడ్డి ,దగ్ధమైనట్లు తెలిపారు.

# వేములవాడ పట్టణాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

- రోడ్డు వెడల్పు పనులు పరిశీలించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**వేములవాడ, మే 31 (జనంసాక్షి):** వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం వేములవాడ పట్టణంలో రాజన్న ఆలయం ముందు జరుగుతున్న రోడ్డు వెడల్పు పనులను పరిశీలించారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా వేములవాడ పట్టణ అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యం ఇస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రులు, దేవదాయ శాఖ జిల్లా మంత్రుల సహకారంతో పనులను వేగవంతం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.రాజన్న ఆలయంలో సుమారు రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అందులో భాగంగా ఆలయం ముందు నుంచి బ్రిడ్జి వరకు 80 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులు చేపట్టినట్లు చెప్పారు. నిర్వాసితులు, దుకాణదారులు, పట్టణ పెద్దలు, ప్రజాప్రతినిధుల సహకారంతో ఈ పనులు ముందుకు సాగుతున్నాయని వెల్లడించారు.ఈ రోడ్డుకు సంబంధించి సుమారు రూ.6.50 కోట్ల అంచనా వ్యయంతో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయనీ, కాంట్రాక్టర్ త్వరితగతిన పనులు పూర్తి చేసి అప్పగిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. త్వరితగతిన తారు రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించినట్లు పేర్కొన్నారు.వేములవాడ పట్టణంలో బ్యూటిఫికేషన్ పనుల కోసం రూ.2.60 కోట్లతో చర్యలు తీసుకున్నామని, సెంట్రల్ లైటింగ్ సిస్టం పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. వనమహోత్సవం సందర్భంగా రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేక మొక్కలు నాటాలని నిర్ణయించినట్లు చెప్పారు.అలాగే అన్నదాన సత్రం పనులు రూ.35 కోట్లతో కొనసాగుతున్నాయని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బీమేశ్వర ఆలయాన్ని రూ.6 కోట్లతో ఆధునికరించినట్లు తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధి పూర్తయ్యే వరకు భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు.బద్ది పోచమ్మ ఆలయం వద్ద కూడా పనులు వేగంగా జరుగుతున్నాయని, అక్కడి నిర్వాసితులకు సెటర్లు ఏర్పాటు చేసే పనులు త్వరలో పూర్తవుతాయని తెలిపారు. వేములవాడను ఆలయ అభివృద్ధితో పాటు పట్టణ సౌందర్యీకరణ, మౌలిక వసతుల పరంగా మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, మాజీ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు కొండా శేఖర్, అన్నారపు శ్రీనివాస్, కొక్కుల బాలకృష్ణ , తోటరాజు, నాయకులు కూరగాయల కొమురయ్య, సాగరం వెంకటస్వామి, సిరిగిరి శ్రీకాంత్, నాగరాజు ,తోట లహరి, పులి రాంబాబు, అనిల్, నాగుల విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

### జన గణనకు ప్రతి ఒక్కరు సహకరించాలి

- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**యాదాద్రి, కరస్పాండెంట్ మే 31 (జనం సాక్షి) :** జన గణనకు ప్రతి ఒక్కరు సహకరించాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. జనాభా లెక్కల సేకరణ కార్యక్రమంలో భాగంగా భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తమ నివాసంలో జనాభా లెక్కల అధికారులకు కుటుంబ వివరాలను అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు కుటుంబ సభ్యుల వివరాలు, విద్య, ఉపాధి, సామాజిక-ఆర్థిక అంశాలకు సంబంధించిన సమాచారాన్ని నమోదు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి కుటుంబం జనాభా లెక్కల సేకరణలో భాగస్వాములై సరైన సమాచారాన్ని అందించి ప్రభుత్వానికి సహకరించాలని ప్రజలని కోరారు.

# పెట్టుబడుల పేరిట పాపాల పంట

*తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి పేరిట జరుగుతున్న విధ్వంసానికి పోలేపల్లి స్పెషల్ ఎకానమిక్ జోన్ ఒక జ్వలంత నిదర్శనం. మహబూబ్‌నగర్ జిల్లాలో వేల ఎకరాల సారవంతమైన భూమిని రైతుల నుండి కారు చౌకగా స్వాధీనపరచుకొని, ఆ స్థలంలో ఫార్మా కంపెనీలను స్థాపించారు. ఆ రైతులకు వాగ్దానం చేసిన అభివృద్ధి నేటికీ కనుచూపు మేరలో కనపడలేదు. కానీ ఆ కంపెనీల రసాయన వ్యర్థాలు మాత్రం నేరుగా చుట్టుపక్కల గ్రామాలలోకి చేరుతున్నాయి. గాలి విషమైంది, నీరు కలుషితమైంది, భూమి చచ్చుబడింది. ఒకప్పుడు పచ్చగా నిండు జీవితాలు గడిపిన రైతాంగం నేడు తమ స్వంత ఊళ్లలో అనాథలుగా మారింది.*

సంపాదకీయం

ఈ కష్టాలు నేటి కొత్తవి కావు. ఏళ్ళుగా స్థానిక ప్రజలు తమ గోడును పాలకుల దృష్టికి తీసుకెళ్ళడానికి ప్రయత్నిస్తున్నారు. విన్నపాలు పెట్టారు, నిరసనలు చేసారు, ధర్నాలు నిర్వహించారు. కానీ పాలకుల చెవులకు ఆ మాటలు చేరలేదు, లేదా చేరినా మనసుకు తగలలేదు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో నారాయణపేట సమీపాన చిత్తనూరు గ్రామం వద్ద ఇతనాయిల్ ఫ్యాక్టరీ వెదజల్లే దుర్గంధం, విష వ్యర్థాలు అక్కడి మనుషుల జీవితాలను నరకప్రాయంగా మార్చాయి. పిల్లలు జబ్బుపడుతున్నారు, పశువులు చనిపోతున్నాయి, పంటలు ఎండిపోతున్నాయి. ఇది అభివృద్ధా? ఎవరికోసమైన అభివృద్ధి ఇది?

గద్వాల జిల్లా పెద్ద దన్వాడలో, అదిలాబాద్ జిల్లా దిలావర్‌పూర్‌లో ప్రజలు తిరుగుబాటు చేసినప్పుడు పాలకులకు ఒక హెచ్చరిక లభించింది. కానీ ఆ హెచ్చరికను పాఠంగా తీసుకోకుండా మళ్ళీ అదే నిర్లక్ష్యాన్ని కొనసాగించడం శోచనీయం. ప్రజలు రాజ్యాంగబద్ధంగా పోరాడుతున్నప్పుడే వారితో సంభాషించి సమస్యను పరిష్కరించడం ప్రజాస్వామ్యపు మూలసూత్రం. ఆ అవకాశాన్ని వినియోగించుకోకపోతే, ప్రజల ఓర్పు నశించి అసహనం పెచ్చరిల్లితే దానికి బాధ్యత పాలకులదే అవుతుంది.

భారత రాజ్యాంగం ప్రసాదించిన జీవించే హక్కు అంటే కేవలం శ్వాస తీసుకోవడం మాత్రమే కాదు. గౌరవంగా, ఆరోగ్యంగా, జీవనోపాధితో జీవించే హక్కు అది. కలుషితమైన గాలిలో ఊపిరి పీల్చడం జీవించడం కాదు, అది క్రమంగా చావడం మాత్రమే. ఒక పక్క పెట్టుబడిదారులకు కోట్ల రాయితీలు కట్టబెడుతూ, మరోపక్క ప్రజల ప్రాణాలతో, భూములతో, నీళ్ళతో చెలగాటమాడటం ఇది పాలన కాదు, పాపం.

పోలేపల్లి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అడుగుతున్నది ఏదో అసాధ్యమైన సౌకర్యాలు కావు. తాము తాగే నీళ్ళు విషం కాకూడదని, తమ పిల్లలు ఆడే గాలి కలుషితం కాకూడదని, తమ తాత ముత్తాతల నుండి వస్తున్న భూమి చచ్చుబడిపోకూడదని మాత్రమే కోరుతున్నారు. ఇది అభ్యర్థన మాత్రమే కాదు, రాజ్యాంగం కల్పించిన హక్కు.

పెట్టుబడులకూ, అభివృద్ధికీ వ్యతిరేకం కాదు ఈ మాటలు. అభివృద్ధి అనేది ఒక వర్గానికి వరంగా, మరొక వర్గానికి శాపంగా మారినప్పుడు అది అభివృద్ధి అనిపించుకోదు. ఫార్మా పరిశ్రమలు తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు దోహదపడవచ్చు, కానీ ఆ దోహదం స్థానిక ప్రజల రక్తం మీద నిర్మితమైతే దాని విలువ ఏమిటి? పరిశ్రమలు నిబంధనలు పాటించేలా చూడడం, కాలుష్య నియంత్రణ యంత్రాంగాన్ని నిజాయితీగా అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత. ఆ బాధ్యత నుండి తప్పించుకోవడానికి ఏ వాదమూ సమర్థనీయం కాదు.

తెలంగాణ ప్రజలు ఒక ప్రత్యేక రాష్ట్రం కోసం ఆశలతో పోరాడారు. ఆ ఆశలు నీళ్ళలో కలిసిపోతున్నాయా అని నేడు వారే ప్రశ్నిస్తున్నారు. పాలకులు ఇప్పటికైనా మేల్కొని, పోలేపల్లి ప్రజల గొంతులు వినాలి. కాలుష్య కర్మాగారాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలి. లేదంటే చరిత్ర ఈ పాపాన్ని ఎన్నటికీ మన్నించదు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా..

# సామాజిక ఉద్యమాల చరిత్రను గుర్తు చేసుకుందామా?



తెలంగాణ మలిదశ ఉద్యమ చరిత్రను "ఒకసారి గుర్తు చేసుకుందామా!!" అని వెనక్కి తిరిగి చూస్తే... అది కేవలం రాజకీయ నాయకుల పిలుపులతోనే సాగలేదు. కోట్లాది మంది ప్రజల శ్రమశక్తి, ఉద్యోగ, కార్మిక లోకం చేసిన అపూర్వ త్యాగాల కలబోత అది. 1969 నాటి తొలిదశ ఉద్యమ అనుభవాలను గుండెల్లో నింపుకుని, మలిదశ ఉద్యమాన్ని క్లైమాక్స్‌కు తీసుకెళ్లిన చారిత్రాత్మక ఘట్టం "సకల జనుల సమ్మె". 2011 సెప్టెంబర్ 13న ప్రారంభమై 42 రోజుల పాటు సాగి, దేశ చరిత్రలోనే రికార్డు సృష్టించిన ఈ మహా సమ్మెలో ఆర్టీసీ, విద్యుత్, సింగరేణి కార్మికులు, ఉపాధ్యాయులు మరియు ప్రభుత్వ ఉద్యోగులు పోషించిన పాత్ర అద్వితీయం.

**1. ఉద్యమ వైతాళికులు - మేధోపరమైన, వ్యూహాత్మక నాయకత్వం**

ఈ మహా ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన మహనీయులను. మనం ఎప్పటికీ మరువలేము.

**ఆచార్య జయశంకర్ సార్ సిద్ధాంత స్ఫూర్తి:**
తెలంగాణ జాతి పిత ప్రొఫెసర్ జయశంకర్ సార్ "తెలంగాణ వస్తేనే మన నిధులు, నియామకాలు, నీళ్లు మనకు దక్కుతాయి" అని ఉద్యోగ, కార్మిక సంఘాలను నిరంతరం చైతన్యపరిచారు. సమ్మె ప్రారంభానికి కొద్ది నెలల ముందే, 2011 జూన్ 21న జయశంకర్ సార్ కన్నుమూసినప్పటికీ, ఆయన ఇచ్చిన సిద్ధాంత స్ఫూర్తితోనే ఉద్యోగ లోకం పెన్నులు పక్కన పెట్టి రోడ్లపైకి వచ్చింది.

**కేశవరావు జాదవ్ నిరంతర స్ఫూర్తి:**
1969 ఉద్యమం నుండి మలిదశ ఉద్యమం వరకు అలుపెరగని పోరాటం చేసిన సిద్ధాంతకర్త కేశవరావు జాదవ్. ఆయన సమ్మె కాలంలో ఎక్కడా హింస చెలరేగకుండా శాంతియుత మార్గంలో నడిపించడంలో కీలక పాత్ర పోషించారు.

**వి. ప్రకాష్ ప్రసంగాల చైతన్యం:**
తెలంగాణ ఉద్యమ చరిత్రపై, నీటి కేటాయింపులపై అపారమైన పట్టున్న వి. ప్రకాష్ గారు ఉద్యోగ, కార్మిక సభల్లో తన ప్రసంగాల ద్వారా వలస పాలను ఎండగట్టారు. సకల జనుల సమ్మె సమయంలో జేఏసీ ప్రతినిధిగా కార్మికులను ఏకం చేయడంలో ఆయన కృషి అమోఘం.

**2. రవాణా రంగాన్ని స్తంభింపజేసిన ఆర్టీసీ కార్మికులు**

రవాణా వ్యవస్థ ఆగిపోతే సమాజం స్తంభిస్తుందని నిరూపించారు ఆర్టీసీ కార్మికులు.

**2011 సెప్టెంబర్ 19 నుండి:**
ఆర్టీసీ కార్మికులు సమ్మెలోకి దిగడంతో తెలంగాణ పరిధిలోని సుమారు 10,000 పైగా బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. దాదాపు 50 వేల మందికి పైగా కార్మికులు రోడ్లపైకి వచ్చారు.

**డిపోల ముట్టడి - వంటా వార్పు:** ప్రతి బస్ డిపో ముందు కార్మికులు తమ కుటుంబాలతో సహా కూర్చుని వంటా వార్పు కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్థిక నష్టాన్ని లెక్కచేయకుండా దసరా పండుగ పూట కూడా బస్సు చక్రం తిరగనివ్వలేదు.

**3. దేశాన్నే చీకట్లోకి నెట్టిన సింగరేణి బొగ్గు గని కార్మికులు**

తెలంగాణ ఉద్యమానికి ఆర్థిక మరియు వ్యూహాత్మక బలాన్ని ఇచ్చిన శ్రామిక శక్తి సింగరేణి కార్మికులు.

**2011 సెప్టెంబర్ 13 నుండి:**
సకల జనుల సమ్మెను సింగరేణి కార్మికులే మొదటగా ప్రారంభించారు. 60 వేల మందికి పైగా భూగర్భ, ఓపెన్ కాస్ట్ గని కార్మికులు పాల్గొనడంతో రోజువారీ బొగ్గు ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది.

**జాతీయ స్థాయిలో సెగ:**
సింగరేణి బొగ్గు కొరత వల్ల దేశవ్యాప్తంగా విద్యుత్ సంక్షోభం తలెత్తడంతో, అప్పటి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ సమస్య తీవ్రతను గుర్తించక తప్పలేదు.

**4. పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన విద్యుత్ ఉద్యోగులు**

విద్యుత్ రంగానికి చెందిన ఇంజనీర్లు, కార్మికులు చూపిన చొరవ అత్యంత సాహసోపేతమైనది.

**ఎస్మా చట్టాన్ని ధిక్కరించి:**
ప్రభుత్వం అత్యవసర సేవల చట్టం (ESMA) ప్రయోగించినా విద్యుత్ ఉద్యోగులు లొంగలేదు. పాల్వంచ (KTPS), రామగుండం కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. "చీకటినైనా భరిస్తాం కానీ, ఆంధ్ర పాలకుల కింద బానిసత్వాన్ని భరించం" అని ప్రకటించి పాలకుల గుండెల్లో వణుకు పుట్టించారు.

**5. అణచివేతపై తిరుగుబాటు - 'నో వర్క్, నో పే' (GO 177) ధిక్కరణ**

సమ్మె కాలంలో అప్పటి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం ఉద్యమాన్ని అణచడానికి అన్ని అస్త్రాలను ప్రయోగించింది.

**జీవో 177 అస్త్రం:** ఉద్యోగులను భయపెట్టడానికి ప్రభుత్వం "నో వర్క్, నో పే" (No Work, No Pay) నిబంధన విధిస్తూ జీవో నెంబర్ 177 ని తీసుకువచ్చింది. నెలల తరబడి జీతాలు రాకపోయినా, పండగ పూట ఇళ్లల్లో తిండి లేకపోయినా "సమరమే మా మార్గం" అని ఉద్యోగులు ఆ జీవోను బూడిదలో పోసిన పన్నీరు చేశారు.

2011 అక్టోబర్ 2 – గాంధీ జయంతి: అక్టోబర్ 2న మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని తెలంగాణవ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు శాంతియుత 'సత్యాగ్రహం ' దీక్షలు చేపట్టారు. ప్రభుత్వ నిర్బంధాన్ని గాంధేయ మార్గంలో తిప్పికొట్టారు.

**6. సమ్మె కాలంలో చారిత్రాత్మక రవాణా దిగ్బంధనాలు**

సకల జనుల సమ్మె కాలంలో జేఏసీ పిలుపుతో దేశాన్ని కదిలించిన నిరసన రూపాలు జరిగాయి

2011 సెప్టెంబర్ 24, 25 – మొదటి విడత రైల్ రోకో: తెలంగాణ వ్యాప్తంగా రెండు రోజుల పాటు రైళ్ల రాకపోకలను కార్మికులు, ప్రజలు రైలు పట్టాలపై వంటా-వార్పు చేస్తూ పూర్తిగా నిలిపివేశారు

2011 అక్టోబర్ 14 – సడక్ బంద్: హైదరాబాద్–బెంగళూరు జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర ప్రజలు, ఉద్యోగులు బైఠాయించి రవాణాన్ని స్తంభింపజేశారు

2011 అక్టోబర్ 15, 16, 17 – మూడు రోజుల రైల్ రోకో: సమ్మె ఉధృతిని పెంచుతూ జేఏసీ అక్టోబర్ 15 నుండి మూడు రోజుల పాటు రైల్ రోకో నిర్వహించింది. దక్షిణ భారతదేశానికి రైల్వే అనుసంధానం పూర్తిగా కట్ అయిపోయింది.

42 రోజుల సుదీర్ఘ సమ్మె తర్వాత, ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని 2011 అక్టోబర్ 24న జేఏసీ వ్యూహాత్మకంగా సమ్మెను విరమించింది. కానీ, ఈ సమ్మె సృష్టించిన ఒత్తిడి వల్లే, కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో తెలంగాణ బిల్లు పెట్టడానికి అవసరమైన ప్రక్రియను వేగవంతం చేసింది. 2014 జూన్ 2న సిద్ధించిన తెలంగాణ రాష్ట్రానికి పునాది రాళ్లు ఈ రంగాల శ్రామికులు, మేధావులు చిందించిన చెమట చుక్కలే.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

## ఒంటరితనం!



సైన్స్ టెక్నాలజీ
దూరాలు చెరిపి
దేశాలు దగ్గరై
ప్రపంచం ఒక్కటై!
వ్యాపారాలతో
దేశాలే మార్కెట్లై
క్షణాల్లో ప్రపంచాన్ని
చుట్టివస్తున్నాం!
సాంకేతికాభివృద్ధితో
ప్రపంచ మానవుడు
తయారయ్యాడు!
కులమతాలూ
మాయం!
వివాహాలు విందులు
పండగలు పబ్బాలు..
అది ఇది ఏదైనా
డబ్బుంటే చాలు!
వ్యవహారాలు
వస్తు సామాగ్రి
విద్య వైద్యం కూడా
అంతా ఆన్ లైన్!
మాయగా లేదూ..!
ఒకప్పుడు మాయే!
ఇప్పుడు మాత్రం
ఒక వాస్తవ దృశ్యం!
ఈ దృశ్యం వెనుక
కుటుంబసంబంధాల
అదృశ్యీకరణం!అన్నీ
వ్యాపారబంధాలే !
ప్రేమానురాగాలు
అక్క చెల్లి అన్న
తమ్ముడు..పిలుపుల
అనుభూతుల్లేవు!
ఏం జరిగింది?
దూరాలు దగ్గరై
దగ్గర దూరమై
వింత ప్రవర్తనలు!
సాంకేతికంగా దగ్గరై
రక్తబంధాలు దూరమై
అంతా కృత్రిమత్వం!
మనుషుల్లో దూరం!
అపార్థాలవలనా?
ఆర్థిక ప్రభావమా?
సుఖ జీవనమా?
ఏవి మార్చాయి?
సౌకర్యాలు పెరిగి
సంప్రదాయాలు తరిగి
కుట్రలు కుయుక్తులు
అహంభావాలమనిషి!
ఇలా ఏదో లోపం!
ప్రశాంతంగా లేదు!
కరోనావంటి వైరస్ లు
కొత్త కొత్త రోగాలు!
కన్నబిడ్డలకు దూరం
గుండెలనిండా భారం
సెల్ఫోన్ తోనే బంధం
అంతా ఒంటరితనం!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# రాజ్యాంగంపై కాషాయ నీడ

భారత రాజ్యాంగం ఈ దేశాన్ని కేవలం ఒక భూభాగంగా కాదు, అనేక భాషలు, మతాలు, సంస్కృతులు, సంప్రదాయాల సజీవ సమ్మేళనంగా ఊహించింది. స్వాతంత్ర్య పోరాటం నుంచి వచ్చిన నాయకత్వం "భిన్నత్వంలో ఏకత్వం" అనే భావనను దేశ నిర్మాణానికి పునాది చేసింది. కానీ గత 12 ఏళ్ళుగా దేశ రాజకీయాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలు చూస్తే, ఆ రాజ్యాంగ స్వప్నాన్ని క్రమంగా కుదించే ప్రయత్నం, రాజ్యాంగాన్ని పూర్తిగా రద్దు చేయకుండానే, రాజ్యాంగ సవరణల పేరుతో బీజేపీకి పార్లమెంటులో సంపూర్ణ మెజారిటీ ఉంది కనుక ప్రతిపక్షాల అభ్యంతరాలు లెక్క చేయకుండా, చర్చలు లేకుండానే రాజ్యాంగ లక్ష్యాలు బలహీన పరిచే ఏక పక్ష నియంతృత్వ పాలన జరుగుతోందనే ఆందోళన పెరుగుతోంది. "న్యూ ఇండియా", "వికసిత్ భారత్", "సాంస్కృతిక జాతీయత" వంటి ఆకర్షణీయ నినాదాల వెనుక, ఒకే మతం, ఒకే సంస్కృతి, ఒకే రాజకీయ భావజాలాన్ని దేశంపై రుద్దే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది.

భారతీయ జనతా పార్టీ (బీజేపీ), రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) రాజకీయ ప్రాజెక్టు కేవలం ఎన్నికల విజయాలకు మాత్రమే పరిమితం కాదు. అది భారత రాజ్యాంగం నిర్మించిన లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థను క్రమంగా "హిందూ జాతీయ రాష్ట్రం" వైపు మళ్ళించే ప్రయత్నంగా కనిపిస్తోంది. ఈ మార్పు ఒక్కరోజులో జరగలేదు. దశాబ్దాలుగా సాగుతున్న భావజాల ప్రచారం, గత చరిత్రను పునర్వ్యాఖ్యానం, మత ఆధారిత రాజకీయ సమీకరణ, మీడియా నియంత్రణ, రాజ్యాంగ సంస్థల బలహీనీకరణ–ఇవన్నీ కలిపి నేటి పరిస్థితిని తీసుకొచ్చాయి.

రాజ్యాంగం ప్రతి పౌరుడిని సమానుడిగా గుర్తిస్తే, హిందుత్వ రాజకీయాలు పౌరులను ముందుగా మత గుర్తింపుల ఆధారంగా విభజిస్తున్నాయి. "ఎవరు నిజమైన దేశభక్తులు?", "ఎవరు దేశద్రోహులు?" అనే ప్రమాదకర ప్రశ్నలను సమాజంలో నాటుతున్నాయి. ముఖ్యంగా ముస్లింలను, క్రైస్తవులను శాశ్వత అనుమానితులుగా చిత్రీకరించే రాజకీయ ప్రచారం తీవ్రంగా పెరిగింది. గోరక్షణ పేరుతో లించింగ్‌లు, "లవ్ జిహాద్" ఆరోపణలు, బుల్‌డోజర్ రాజకీయాలు, మత ప్రదర్శనల సమయంలో రెచ్చగొట్టే నినాదాలు...ఇవి అన్నీ సమాజంలో భయాన్ని, విభజనను పెంచాయి. 2024లో విడుదలైన పలు అంతర్జాతీయ నివేదికలు కూడా భారతదేశంలో మైనారిటీలపై ద్వేష ప్రసంగాలు, మతపరమైన ఉద్రిక్తతలు ఘోరంగా పెరిగినట్లు ప్రస్తావించాయి.

ప్రజాస్వామ్యంలో మీడియా ప్రజల తరఫున ప్రశ్నించాలి. కానీ ప్రస్తుతం పెద్ద మీడియా సంస్థలలో అధిక భాగం అధికారానికి ప్రచార యంత్రాంగంగా మారిపోయిందనే విమర్శ బలంగా వినిపిస్తోంది. నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతు సమస్యలు, విద్యా-ఆరోగ్య సంక్షోభం వంటి అంశాల కంటే మత ఉద్రిక్తతలు, జాతీయతా భావోద్వేగాలు రెచ్చగొట్టే విధంగా, ప్రతిపక్షాలపై దాడులకే ప్రాధాన్యం పెరిగింది. 2025 వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్‌లో భారతదేశం 157వ స్థానంలో ఉండటం యాదృచ్ఛికం కాదు. ఇది మీడియా స్వేచ్ఛ పరిస్థితిపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది.

స్వతంత్ర సంస్థల బలహీనీకరణ కూడా ఆందోళనకర అంశం. ఎన్నికల కమిషన్, దర్యాప్తు సంస్థ, గవర్నర్ వ్యవస్థ, రాజ్యసభ చైర్మన్ పదవి, పార్లమెంట్ లో చర్చలు జరగకుండా స్పీకర్ కూడా అధికార పార్టీ ప్రతినిధిగా వ్యవహరించే పరిస్థితి. స్పీకర్ , రాజ్యసభ చైర్మన్ పై విపక్షాలు అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టే పరిస్థితి. ఇవన్నీ, క్రమంగా కార్యనిర్వాహక అధికారానికి అనుకూలంగా మారుతున్నాయనే విమర్శ ఉంది. పార్లమెంట్‌లో కీలక చట్టాలు సరైన చర్చ లేకుండానే ఆమోదం పొందడం, ప్రతిపక్ష సభ్యుల సస్పెన్షన్‌లు, దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై వినియోగించి వారిని లోబర్చుకోవటండం, మూకుమ్మడిగా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సాహించటం, లొంగని వారిపై దర్యాప్తు సంస్థలతో దాడులు చేయించి, అక్రమ కేసుల్లో ఇరికించి వేధింపులకు గురి చేయటం, కొందరిని ఏళ్ళ తరబడి జేళ్ళలో మగ్గేలా ఊపా చట్టం ప్రయోగించటం బీజేపీకి ఆనవాయితీగా వస్తుంది. ఇలా బీజేపీ ప్రజాస్వామ్య సమతౌల్యాన్ని దెబ్బతీస్తోంది. "ఎలక్టోరల్ బాండ్స్" వ్యవహారం ద్వారా రాజకీయ నిధుల గోప్యత పెరగడం, కార్పొరేట్-రాజకీయ సంబంధాలపై అనుమానాలు మరింత బలపడ్డాయి. సుప్రీంకోర్టు కూడా ఎలెక్టోరల్ బాండ్లు ద్వారా అధికార పార్టీకి ఎక్కువ చేకూరింది.

ఇంకా ప్రమాదకరమైన విషయం ఏమిటంటే, రాజ్యాంగ విలువల స్థానంలో "భక్తి రాజకీయాలు" రావడం. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం దేశద్రోహంగా చూపించే సంస్కృతి పెరుగుతోంది. విశ్వవిద్యాలయాల్లో విమర్శాత్మక ఆలోచనను అణచివేయడం, విద్యార్థి ఉద్యమాలపై కేసులు పెట్టడం, చరిత్ర పుస్తకాల్లో మార్పులు చేయడం, శాస్త్రీయ దృక్పథం కంటే పురాణ రాజకీయాలను ప్రోత్సహించడం. ఇవి అన్నీ ఒక కొత్త భావజాల నియంత్రణకు సంకేతాలు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం దేశంలో ద్వేష నేరాల నమోదు, సామాజిక ఘర్షణల కేసులు పెరుగుతున్నాయనే అంశాన్ని పలు హక్కుల సంస్థలు ప్రస్తావిస్తున్నాయి. అంతర్జాతీయ పత్రికలు, మీడియా కూడా ఈ విషయం పై అనేక సార్లు వ్యాఖ్యానించాయి. ఆర్థిక రంగంలో కూడా "వికాసం" అనే ప్రచారం వెనుక తీవ్రమైన అసమానతలు పెరుగుతున్నాయి. ఒకవైపు ప్రపంచంలోనే అత్యంత ధనికుల జాబితాలో భారత కార్పొరేట్ వర్గాలు వేగంగా ఎదుగుతుం డగా, మరోవైపు నిరుద్యోగం యువతను తీవ్ర నిరాశలోకి నెట్టింది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) గణాంకాల ప్రకారం యువ నిరుద్యోగం ఇంకా తీవ్రమైన సమస్యగానే ఉంది. వ్యవసాయ సంక్షోభం, చిన్న వ్యాపారాల క్షీణత, ప్రైవేటీకరణ వేగం సామాన్య వర్గాల జీవనాన్ని మరింత అస్థిరం చేశాయి. అయినప్పటికీ, మత-జాతీయతా ప్రచారం ఈ ఆర్థిక ప్రశ్నలను వెనక్కి నెట్టింది. ఆరెస్సెస్ భావజాలం భారతదేశాన్ని ఒక సాంస్కృతిక ఏకరూపత వైపు తీసుకెళ్లాలని చూస్తోంది. కానీ భారతదేశం అసలు బలం దాని వైవిధ్యం. తమిళుడు, తెలుగు వాడు, బెంగాలీ, కాశ్మీరీ, ఆదివాసి, దళితుడు, ముస్లిం, సిక్కు, క్రైస్తవుడు...అందరూ సమానంగా ఈ దేశ యజమానులనే భావన రాజ్యాంగ ఆత్మ. ఒకే మతం ఆధారంగా జాతీయతను నిర్వచించే ప్రయత్నం దేశ సమగ్రతకే ప్రమాదకరం. ఇది కేవలం ఒక పార్టీపై విమర్శ కాదు. ఇది భారత ప్రజాస్వామ్య భవిష్యత్తు పై ఉన్న ఆందోళన. ఎందుకంటే ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికలతో పూర్తికాదు. స్వేచ్ఛా మీడియా, స్వతంత్ర సంస్థలు, భిన్నాభిప్రాయాల గౌరవం, మైనారిటీల భద్రత, రాజ్యాంగ నైతికత... ఇవన్నీ కలిసి ప్రజాస్వామ్యానికి ప్రాణం పోస్తాయి. ఇవి బలహీనపడితే పేరుకే ఎన్నికలు క్రమంగా జరుగుతున్నా ప్రజా స్వామ్య ఆత్మ ఖాళీ అవుతుంది. భారతదేశం నేడు ఒక కీలక మలుపు వద్ద నిలిచింది. రాజ్యాంగం చూపించిన సమానత్వ మార్గమా? లేక మత ఆధారిత ఆధిపత్య రాజకీయాల మార్గమా? అన్న ప్రశ్న దేశం ముందుంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడేది కేవలం కోర్టులు, చట్టాలు మాత్రమే కావు. ప్రజల అప్రమత్తత, ప్రశ్నించే ధైర్యం, భిన్నత్వాన్ని గౌరవించే సంస్కృతి కూడా అంతే ముఖ్యం. లేకపోతే "న్యూ ఇండియా" అనే నినాదం వెనుక రాజ్యాంగ భారతదేశం నెమ్మదిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.
9849328496.

# తెగిన జ్ఞాపకాలు

ఆయన ఒక ప్రకృతి ప్రేమికుడు. సౌందర్యారాధకుడు. విశేషించి గొప్ప కళాకారుడు. సౌజన్యం సౌందర్యాలను శ్వాసించిన సహృదయుడు. చిత్రలేఖనం, శిల్పం, సంగీతం, నాట్యం, కవిత్వం అన్నవి లలిత కళలు. వీటి ద్వారా మనిషి ఆనందాన్ని పొందుతాడు. అలాంటి లలిత కళల్ని జీవన పర్యంతం అభిమానించి ఆరాధించి ఉపాసించిన తాత్వికుడే సంజీవ్ దేవ్. తేదీ 3.7.1914న ఒక సంపన్న జమీందారు కుటుంబంలో జన్మించాడు. విజయవాడ తెనాలికి మధ్య ఉన్న తుమ్మపూడి ఆయన స్వగ్రామం. అందుకే ఆయన తుమ్మపూడి సంజీవదేవ్ గా ప్రసిద్ధికి ఎక్కారు. మూడేళ్ల వయసులోనే తల్లి, 12 ఏళ్ల వయసులో చెల్లి, పదహారేళ్ళ వయసులో తనను అల్లారుముద్దుగా పెంచిన అమ్మమ్మ కాలం చేయడంతో ఇటు కోనాయపాలెం లోనూ అటు తుమ్మపూడి లోను ఎక్కువగా కాలువ ఒడ్డున, అలాగే అక్కడి తోటల్లో అక్కడి ప్రకృతి పరిసరాల్లో స్వేచ్ఛగా పెరిగాడు. దాంతో సహజంగానే సున్నిత హృదయుడైన సంజీవ్ దేవ్ పై ఆ ప్రభావం జీవితాంతం కనబడుతుంది. మనిషి తనలోకి చూసుకోవడానికి ఏకాంతం బాగా ఉపయోగపడుతుంది అనుకున్నాడు. ఇంటి వద్ద కొంతకాలం, పాఠశాలలో కొంతకాలం ఆయన విద్యాభ్యాసం జరిగింది. స్వయంగా ప్రతిభావంతుడైన సంజీవ్ స్వయంకృషితో ఇంగ్లీషు, ఉర్దూ, హిందీ, బెంగాలీ భాషలను నేర్చుకున్నాడు. ప్రధానోపాధ్యాయులు వెంకటాచారి ఆయనకు వర్డ్స్ వర్త్, ఠాగూర్ లను పరిచయం చేయటంతో పాటు, బంధువుల ఇంట్లోనే గ్రంథాలయం ఉండడం వలన అక్కడికి వచ్చే వివిధ పత్రికలలోని చిత్రాలను, వ్యాసాలను క్షుణ్ణంగా చదివి తన పరిజ్ఞానాన్ని పెంచుకున్నాడు. పెదనాయనతో అడయార్లో జరిగే దివ్యజ్ఞాన మహాసభలకు హాజరై అనీ బిసెంట్, జిడ్డు కృష్ణమూర్తిల ప్రసంగాలను విని ఎంతో ఉత్తేజితుడయ్యాడు. మనుషులంతా బయటికి ఒకే ప్రపంచంలో నివసిస్తున్నా లోపల మళ్లీ ఎవరి స్వతంత్ర ప్రపంచంలో వారే నివసిస్తారని గ్రహించాడు. ప్రముఖ తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి గారి గురించి రాస్తూ ఆయన ఒక గొప్ప జీవన శిల్పి అని అభివర్ణించారు. రామకృష్ణ మిషన్ వారు ప్రకటించే ప్రబుద్ధ భారత్, అలాగే స్వామి రామతీర్థ రచనలతో క్రమంగా పరిచయం ఏర్పడి ఆ ప్రభావంతో 16 ఏళ్ల వయసులోనే ఇంట్లో ఎవరికి చెప్పకుండా హిమాలయాల సందర్శనకు వెళ్లాడు.

దేవేంద్ర నాథ్ ఠాగూర్ ఆత్మకథ, రామ్ నరేష్ త్రిపాఠి రచించిన మిలన్, ప్రేమ్ చంద్ నవలలు, బెంగాలీకి చెందిన బిచిత్ర, బంగశ్రీ, శిల్పి పత్రికలలో చిత్రకళకు సంబంధించి సాహిత్యానికి సంబంధించి వచ్చే వ్యాసాలు ఆయనలో కవిత్వం పట్ల చిత్రకళ పట్ల విపరీతంగా ఆసక్తిని పెంచాయి. హిమాలయాలకు వెళ్లే మార్గ మధ్యలో లక్నోలో ఆగి అక్కడున్న ప్రముఖ కథా రచయిత ప్రేమ్ చంద్ ను కలిసి ఆయన సాహిత్యాన్ని చదివానని చెప్పడంతో ఆయన ఎంతో సంతోషించాడట. అప్పట్లో ప్రేమ్ చంద్ "మాధురి" అని ఒక పత్రిక నడుపుతుండేవారు ఈ సందర్భంగా కేవలం "సాహిత్య జీవిగా మన దేశంలో జీవించటం కష్టం"అని ప్రేమ్ చెప్పిన మాటలు నాడే కాదు నేటికీ ప్రాసంగికతను కలిగి ఉన్నాయి. అక్కడినుండి హిమాలయ సానువుల్లోని అల్మోరాకు వెళ్ళాడు. అక్కడి అనుభవాన్ని చెబుతూ"ఏ వస్తువును ముట్టుకున్న మంచు గడ్డను తాకినట్లుగానే ఉండేదని, అక్కడ నుంచి 40 మైళ్ళ దూరంలో ఉన్న మాయావతికి వెళ్లాలంటే గుర్రాల పైనను, కంచర గాడి దల పైనను వెళ్లాల్సిందేనని చెబుతూ, ఈ ప్రయాణం శరీరానికి అంత సుఖంగా లేకపోయినా హృదయానికి ఉల్లాసంగా ఉందని చెప్పారు. ప్రబుద్ధ భారత్ సంపాదకులు పవిత్రానందంతో కలిసి అక్కడి పరిసరాల్లో




సంచరిస్తున్నప్పుడు,"ఆ హిమాలయ సంధ్యలో, ఆ ఎత్తున కూర్చుని క్రమేనా పొగ మంచుతో కప్పబడుతూ వస్తున్న ఆ దూరపు రహస్యమయా ప్రకృతిని ఏదో కనిపించని రూప లావణ్యం, ఏదో వినిపించని శబ్ద మాధుర్యం వినిపిస్తూ అనిర్వచనీయ ఆనందాన్ని కలిగించేదని" పారవశ్యంతో చెప్పారు. అదే సందర్భంలో అక్కడ డాక్టర్ కమలానంద దగ్గర కూర్చున్నప్పుడు ఆయన దగ్గరకు వచ్చిపోయే రోగులను చూచి అక్కడి సామాజిక పరిస్థితులను గురించి రాస్తూ "ఈ హిమాలయ ప్రకృతిలో ఎంత సౌందర్యం ఉందో ఇక్కడి ప్రజల జీవితాలలో అంత దారిద్ర్యం, వ్యాధులు, నిరక్షరాస్యత, దుర్ వ్యసనాలు, ఉన్నాయని" రాశారు. అలాగే అస్కోటా ప్రాంతంలో నివసించే అడవి మనుషులను "రాజీలు" అంటారని చెబుతూ వారు అక్కడ దొరికే కందమూలాలను, జంతువులను వేటాడుతూ తింటారని చూడటానికి మొరటుగా కనిపించే వాళ్ళు అందమైన కొయ్య కూజాలను తయారు చేసి వాటిని గ్రామాలలోకి తెచ్చి ఒక్కో ఇంటి వాకిలి ముందు ఒక్కో పాత్రను ఉంచగా ఇంటి యజమానులు ఆ కూజా ని తీసుకొని వారు పెట్టిన ఖాళీ పాత్రలో ధాన్యం పోస్తారని, అలా వస్తు మార్పిడి పద్ధతి ద్వారా ఉపాధి పొందుతారని చెప్పాడు. లక్నో ప్రభుత్వ లలిత కళల విద్యాలయానికి ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్న అసిత్ కుమార్ హాల్దార్ తో పరిచయం అతడు రవీంద్రనాథ్ ఠాగూర్ కు సమీప బంధువు కావడంతో వారి మధ్య ఏర్పడిన పరిచయం స్నేహంగా మారి అది సంజీవదేవుకు రవీంద్రునితో పరిచయం కావడానికి కారణమైంది. ఈ సందర్భంగా రవీంద్రుడు రాసిన,"సీమారో మాజె"అనే కవితను సంజీవ్ దేవ్ వినిపించగా ఆయన ఒక వంగేతరుని నోటి వెంట తన కవితలను విని ఆనందించి ప్రశంసించారని రాసారు. ఈ సందర్భంగా ఆయన,"కవిగా జీవించగలిగితే చాలదు. మనిషిగా జీవించగలిగితేనే కవిగా జీవించినట్లు" అని చెప్పిన మాటలు సార్వకాలిక సత్యాలు. దీనిని బట్టి సమాజంలో కవులకు, రచయితలకు గురుతరమైన బాధ్యత ఉందని ఆయన పరోక్షంగా గుర్తు చేశాడు. బెంగాలీలో దిలీప్ కుమార్ రాయ్ రచించిన "అనామి" పుస్తకం తనపై ఎంతో ప్రభావం చూపిందని, తెలుగులో కళ-విజ్ఞానము అనేది తన తొలి వ్యాసమని చెబుతూ హంగేరియన్ చిత్రకారిణులైన సాస్ బ్రన్నర్, ఎలిజబెత్ బ్రన్నర్ తల్లి కూతుర్లు రచించిన మిస్టిక్ ఇండియా, ఆర్ట్ అండ్ మెడిటేషన్ అనే రెండు చిత్రాల సంపుటాలను తెప్పించుకొని సంజీవ్ దేవ్ ఎంతో ఆసక్తితో చదివాడు. పుట్టపర్తి శ్రీనివాసాచారి గారితో ఏర్పడిన పరిచయం కారణంగా సంజీవ్ దేవ్ తుమ్మపూడి నుంచి బెజవాడకు వెళ్లడం అక్కడి సభల్లో పాల్గొనడం జరిగేది. ఈ సందర్భంలోనే ఆయనకు అడివి బాపిరాజుతో పరిచయం కలిగింది. సంగీతంలో స్వర పరిజ్ఞానం కలిగిన ఆయన కొంతకాలం వయొలిన్ పై పిళ్ళారీ గీతాల వరకు వాయించడం నేర్చుకున్నాడు. 1944 లో విజయవాడలో జరిగిన రైతు సభలలో పాల్గొనడానికి వచ్చిన రాహుల్ సాంకృత్యాయన్ సంజీవ్ దేవ్ ఇంట్లో వారం రోజుల పాటు ఉండి అమరావతి, నాగార్జున కొండలను దర్శించారు. ఈ సందర్భంగా రాహుల్ గురించి చెబుతూ ప్రధానంగా ఆయన రచయిత అని, ఆయన కలానికున్న వేగం ఆయన నాలుకకు లేదని , కాగా తెలుగు చదవడం తెలుసునని చెప్పారు. లలిత కళల ప్రాధాన్యం గురించి తెలుపుతూ "ఆలోచించే వారికి సంగీతము, సాహిత్యము, చిత్రకళో ఏదో ఒకదానితో సంబంధం ఉండాలి.

నికోలస్ రోరిక్ రష్యా కు చెందిన వాడైనా ఆసియాలో పురాతత్వ అన్వేషణకై వచ్చి ఇక్కడి కులూ లోయలోనే స్థిరపడ్డారు. సుమారు ఆయన 5 వేల చిత్రాలు గీసి ఉంటాడని అందులో హిమాలయాలనే వస్తువుగా తీసుకొని 1000 వరకు చిత్రాలు గీశాడు అన్నారు. ఆయనతో సంజీవ్ దేవ్ కు మంచి రాకపోకలు ఉండేవి. రోరిక్ కళకు, విజ్ఞానానికి, ధర్మానికి చిహ్నాలుగా రూపొందించిన శాంతి పతాకం యుద్ధంలో శత్రు దేశాలు ఆ జాతి సంస్కృతి నాగరికతలకు ప్రతీకలైన మ్యూజియాల పైన కళాఖండాలపైన దాడులు చేయకుండా ఉండేందుకు ప్రతీకగా ఎగురవేసేవారు. స్వాతంత్రాన్ని గురించి రాస్తూ ఆయన "చచ్చి అయినా స్వాతంత్ర్యాన్ని కాపాడాలి కానీ బ్రతికి అయినా బానిసత్వంలో ఉండరాదు అన్నారు"

గ్రంథం చివరలో సంజీవదేవ్ తో సాన్నిహిత్యం కలిగిన యడ్లపల్లి వెంకటేశ్వరరావు గారు సంజీవ్ దేవ్ గురించి రాస్తూ "మొదట్లో నేను ఆయనను ఒక అయస్కాంతం అనుకునేవాడిని చివరకు తెలిసింది ఆయన ఒక పరుస వేది అని వ్యాఖ్యానించారు. అలాగే వేదాంతం సత్యనారాయణ గారి అధ్యక్షతన జరిగిన సభలో " నాట్యం కదిలే శిల్పం, శిల్పం కదలని నాట్యం" అని అభివర్ణించినట్లు తెలిపారు. సంజీవ్ దేవ్ గారి తెగిన జ్ఞాపకాలను చదువుతున్నప్పుడు పాఠకులు ఎన్నో ఆసక్తికరమైన విషయాలతో పాటు, అవి చదువుతున్న కొద్దీ ఉత్కంఠను మాత్రమే కాక, మనకు పరిజ్ఞానాన్ని పెంపొందిస్తాయి. ఆయన ఆదాయంలో ఎక్కువ భాగం ఆయన రాసే లేఖలకు, తెప్పించుకునే పుస్తకాలకే ఖర్చయ్యేదని రాశారు. కళా రంగానికి ఆయన చేసిన సేవలను గుర్తించి 1982లో ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు ఆయనకు గౌరవ డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేశారు. తెగిన జ్ఞాపకాలు, స్మృతిబింబాలు, గతంలోకి మొదలైనవన్నీ ఆయన జీవన తత్వాన్ని వెల్లడిస్తాయి. సంజీవ్ దేవ్ లేఖలు సాహిత్య చరిత్రలో ప్రత్యేకతను పొందాయి.

ఇలా జీవితాన్ని కళా రంగానికే అంకితం చేసి, ప్రకృతి ఒడి తుమ్మపూడి లోనే జీవితాన్ని గడిపిన సంజీవ్ దేవ్ తేదీ 25.8.1999న అస్తమించారు.

తెలుగువారి భాగ్యరేఖ సంజీవ్ దేవ్ అంటే అతిశయోక్తి కాదు.



డాక్టర్ శంకరమంచి
శ్యాంప్రసాద్
99 891 48 305

## వీవోఏలకు ప్రభుత్వ ఉద్యోగ భద్రత కల్పించాలి



**చేవెళ్ల, మే 31 (జనంసాక్షి) :** వీవోఏల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వివోఏల సంఘం మండల అధ్యక్షురాలు కవిత, ప్రధాన కార్యదర్శి ప్రమీల, మండల సలహాదారుడు చంద్రశేఖర్, కోశాధికారి జ్యోతి డిమాం డ్ చేశారు. వీవోఏల సమ్మెలో భాగంగా ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలోని మహిళ సమాఖ్య భవనం ముందు 15వ రోజు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీవోఏల న్యాయమైన డిమాం డ్లను పరిష్కరించాలని గత 15 రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్న ప్రభుత్వం స్పందించక పోవడం చాలా భాధకరమన్నారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు తీసుకెళ్లడంతో వీవోఏలు పాత్ర కీలమని ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. ఇప్పటికైనా సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. నిత్యం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వం వీవోఏలకు ప్రతి నెల రూ.20 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పద్మ, అప్రాబేగం, సుశీల, మంజుల, మాధవి, హేమలత, లలిత, సుజాత, కవిత, స్వప్న, శిరీష, జంగయ్య, అమృత, నిర్మల, అనిత, కవిత తదితరులు ఉన్నారు.

# మహనీయుల పోరాటాలు ఆదర్శం

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, ఎమ్మెల్యే కాలే యాదయ్య

చేవెళ్ల, మే 31 (జనంసాక్షి) : సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత మందకృష్ణ మాదిగ ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. చేవెళ్ల మండల పరిధి ఆలూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ , రామ్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడిన ఆయన, గతంలో దళితులు అనేక రకాల వివక్షలకు గురయ్యారని, విద్యకు దూరమయ్యారని అన్నారు. అలాంటి పరిస్థితుల్లో జ్యోతిరావు పూలే దంపతులు విద్యా విప్లవానికి నాంది పలికి అణగారిన వర్గాలకు చదువును అందుబాటులోకి తెచ్చారని గుర్తు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం కారణంగానే నేడు దళితులు విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో అవకాశాలు పొందుతున్నారని తెలిపారు. గ్రామస్థాయి ప్రజాప్రతినిధుల నుంచి శాసన సభ్యులు, మంత్రుల వరకు ఎదిగే అవకాశం రాజ్యాంగం కల్పించిందన్నారు. బాబు జగ్జీవన్ రామ్ దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన నాయకుడని, కేంద్ర మంత్రిగా దేశ నిర్మాణంలో విశేష సేవలు అందించారని కొనియాడారు. మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టినప్పుడే వారికి నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం భిక్షతోనే ఈ స్థాయిలో ఉన్నామని అన్నారు. రాజ్యాంగం లేకుంటే దళితులు బతులు మరోలా ఉండేవాన్నారు. జ్యోతిరావు పూలే తన భర్య మహిళలకు చదువు నేర్పించేందుకు పాఠశాలలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అంబేద్కర్ సబండ వర్గాలకు న్యాయం చేశారనాన్నారు. ఎస్సీ వర్గంలో 59 కులాలు ఉన్నాయన్నారు. మలాలు, మాదిగలు వేరుకాదని అన్నదమ్ముల మాదిరిగా కలిసి ఉండాలన్నారు. ఆలూరు గ్రామం అభివృద్ధికి సహకరిస్తానాన్నారు. ఈ కార్యక్రమంలో గాయకులు ఏపూరి సోమన్న, గ్రామ సర్పంచ్ కౌలంపేట భాగ్య శేఖర్ గౌడ్, ఉప సర్పంచ్ మనీషానవనీత గౌడ్, మాజీ సర్పంచ్ విజయలక్ష్మీనర్సింలు, బీఆర్ఎస్ మండల యూత్ మాజీ అధ్యక్షుడు శేఖర్, వార్డు సభ్యులు శ్రీకాంత్, నరేందర్, ఐశ్వర్య, వసంత, రాజు, యాదమ్మ, రాజు, కళావతి, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మహేందర్, కార్యవర్గ సభ్యులు శంకరయ్య, అశోక్, స్వామి, సుదర్శన్, నర్సింలు, పెష్కరి రాజు, సత్తయ్య, విజయ్ కుమార్, కుమార్, ఆనందం, రామచంద్రయ్య, నవీన్, రుక్కయ్య, అనంత రాములు, మహేందర్, ఎమ్మార్పీఎస్ నాయకులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# మహిళా రిజర్వేషన్‌లు అమలవుతాయా..?

- విశ్రాంత న్యాయమూర్తి జి. రాధారాణి

**ముషీరాబాద్, మే 31 (జనం సాక్షి) :** పార్లమెంట్, శాసనసభలలో 33% మహిళా రిజర్వేషన్లు 2029 ఎన్నికల నాటికైనా అమలవుతాయా? అని తెలంగాణా హై కోర్టు విశ్రాంత న్యాయమూర్తి, వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్ జస్టిస్ రాధారాణి ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివార హైదరాబాదు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయవాది జి విద్యాసాగర్ అధ్యక్షతన రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో జరిగిన సెమినార్ లో ప్రసంగిస్తూ అనుమానం వ్యక్తం చేసారు. ప్రపంచ దేశాలలో 1920 నాటికే చట్ట సభలలో మహిళలకై రిజర్వేషన్లు ఇచ్చారని, రువాండా, కాంగో లాంటి దేశాలలో 60% పైగా మహిళలు చట్టసభలలో ఉన్నారని అన్నారు. యూనియన్ దేశాలలో 25% పైగా ఉన్నారని తెలియజేశారు. మనదేశంలో స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని దశాబ్దాలైనా మహిళా ప్రాతినిధ్యం 14% దాటకపోవటం విచారించదగ్గ విషయమని అన్నారు. 1991 లో స్థానిక సంస్థల ఎన్నికలలో మహిళలకు 33% రిజర్వేషన్ల బిల్లు పెరిగింది, అయినా పురుషాధిక్య సమాజంలో మహిళల అధికారాలను పురుషులే ఉపయోగించుకున్నారని, కానీ కొంతమంది మహిళలు




సామాజిక అభివృద్ధిలో ఎంతో కృషి చేశారని తెలియజేశారు. పార్లమెంట్, రాష్ట్రాల శాసన సభలలో 33% రిజర్వేషన్లు ఇవ్వటం ద్వారా తమ అధికారాలు పోతాయని పురుషాధిక్య రాజకీయ పార్టీలు భావిస్తున్నాయని, అందుకనే 2023లో చట్టమయినప్పటికీ దీనిని అమలు చేయకుండా నియోజక వర్గాల పునర్విభజన జనాభా గణనలకు ముడిపెట్టడం భావ్యం కాదని తెలియజేసారు. చట్ట సభలు నిర్ణయించాల్సింది డిలిమిటేషన్ ప్రక్రియను పార్లమెంట్ నిర్ధారించాల్సి ఉండగా, కమిటీని వేయడం ద్వారా దాన్ని శాసన నిర్వాహకులకు వదిలివేయడం మంచిదికాదని అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. దీనిపై కూడా కోర్టులకు వెళ్ళే అవకాశం ఉందని, దాని ద్వారా మహిళా రిజర్వేషన్లు ఇంకా ఆలస్యం అయ్యే అవకాశం ఉందని తెలియజేసారు. అత్యవసర పరిస్థితుల సమయంలో జనాభా నియంత్రణకి కృషి చేసిన దక్షిణాధి రాష్ట్రాలకు అన్యాయం జరిగి, ఉత్తరాది రాష్ట్రాలకు లాభం జరిగే అవకాశం ఉందని, అధికారం ఒక ప్రాంతానికే పరిమితం ఉందని జరుగుతున్న ప్రచారాల ములంగా విభజన వాదాలు ఉందని తెలియజేసారు. నిధులు ప్రజలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు పోయి, తక్కువ జనాభా ఉన్న ప్రాంతాలు నష్టపోయే అవకాశం ఉందని, కావున జనగణన, డీలిమిటేషన్‌కు సంబంధం లేకుండా ప్రస్తుతం ఉన్న 543 స్థానాలలో 33% మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని అన్నారు. మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ... రాజ్యాంగం, చట్టాల గురించి, రాజకీయాల గురించి మహిళలు తెలుసుకుని, అవగాహన ఏర్పాటు చేసుకుని ఉద్యమాలు చేస్తేనే మహిళలు తమ హక్కు 33% మహిళా రిజర్వేషన్ సాధించుకుంటారని తెలియ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె ఉమామహేశ్వరరావు, డీఏఎస్వీ ప్రసాద్, కామేష్‌బాబు, వీరయ్య, నాగలక్ష్మి, ఇందిర, డీజీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## కమ్మెట గ్రామంలో ఘనంగా బురుమైసమ్మ బోనాలు



**చేవెళ్ల, మే 31 (జనంసాక్షి) :** చేవెళ్ల మండలంలోని కమ్మెట గ్రామంలో బుర్జు మైసమ్మ తల్లి జాతర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు అమ్మవారికి బోనం సమర్పించారు. బోనాలు ఊరేగింపు సందర్భంగా పోతురాజుల విన్యాసం, శివసత్తుల పునాకాలతో గ్రామం మారుమోగింది. గ్రామస్తులు అందరు అమ్మవారికి నేవేథ్యం సమర్పించి తమ మొక్కులు మొక్కున్నారు. ఈ వేడుల్లో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే, సబితారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పి. కృష్ణారెడ్డిలు పాల్గొని గ్రామంలో బురుమైసమ్మ తల్లిని దర్శించుకున్నారు. ప్రతి ఒక్కరూ దైవచింతన కల్గిఉండాలని వారు సూచించారు. ఈ కార్యక్రమ0లో గ్రామ సర్పంచ్ ఎం. పద్మమ్మ, ఉప సర్పంచ్ విష్ణువర్ధన్ గౌడ్, మాజీ సర్పంచ్లు పట్లోళ్ల హన్మంత్, తులసీరాజు, పెంటయ్య, రాంచంద్రయ్య, వార్డు సభ్యులు దశరథ్, నర్సింలు, పాండు, వెంకటేశ్, బాలకృష్ణ, శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీలు జంగయ్య, నర్సింహారెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు ప్రభాకర్, సీనియర్ నాయకులు మల్లారెడ్డి, సతీష్ గౌడ్, మాధవగౌడ్, సురేందర్ గౌడ్, ఆంజనేయులు, జంగయ్య, కిష్టా రెడ్డి, గోనే కరుణాకర్ రెడ్డి, గ్రామస్తులు, మహిళలు తదితరులు ఉన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే..

**శంకర్‌పల్లి, మే 31 (జనం సాక్షి) :** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విద్యాసంస్థలు, ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల పేర్కొన్నారు.రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలం మోకిలా గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన (ఎక్సలెన్స్ గ్రూప్ వారి ఆధ్వర్యంలో) క్వాంటమ్ స్కూల్ ను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ..అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటుచేసిన పాఠశాల ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయడం సంతోషకరమని పేర్కొన్నారు.ఆధునిక మౌలిక సదుపాయాలు



సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన బోధన విధానాలు విద్యార్థుల సమగ్ర వికాసానికి అవసరమైన అత్యుత్తమ వాతావరణాన్ని ఈ పాఠశాల అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.ప్రపంచ స్థాయి విద్యను అందిస్తూ విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో క్వాంటియం ఇంటర్నేషనల్ స్కూల్ ముందుంటుందని పేర్కొన్నారు. మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు సంస్కృతి సంప్రదాయాలతో కూడిన విద్యా విధానం అందించే విధంగా పాఠశాలలకు కృషి చేయాలని సూచించారు. మొబైల్ ఫోన్లు కంప్యూటర్ల కే పరిమితం కాకుండా సామాజిక అంశాల పట్ల కూడా వారికి అవగాహన కలిగించే ఆత్మస్థైర్యాన్ని కలిగించే విధంగా బోధన సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోకిల గ్రామ సర్పంచ్ చిట్టెంపల్లి శేఖర్,మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణ, నిజాంబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య,ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, ఎమ్మెల్సీ కొమురయ్య చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం,పాఠశాల డైరెక్టర్లు ప్రిన్సిపల్ యాజమాన్యం విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పేకాట ఆడుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసిన పోలీస్‌లు

- జూదరులపై ఉక్కపాదం మోపుతాం చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్

**చేవెళ్ల, మే 31 (జనంసాక్షి) :** పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను ఎస్వోటీ పోలీస్లు పట్టుకున్న సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కందవాడ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీస్లు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని కందవాడ గ్రామం పరిధిలో ఉన్న ఓ ఫామ్హస్లో పేకాట ఆడుతున్న విషయం విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్వోటీ పోలీస్ లు ఫామస్కు చేరుకుని పేకాట ఆడుతున్న ముగ్గురిని పోలీస్లు అదుపులోకి తీసుకున్నారు. వీరివద్ద గల రూ.2044/- నగదు తోపాటు కారు, రెండు బైక్ లను సీజ్ చేసి చేవెళ్ల పోలీస్ స్టేషన్కు అప్పగించారు. పేకాట ఆడుతూ పట్టుబడిన ముగ్గురిలో ఒకరైనా కావలి మహిపాల్ దేవాదయ శాఖ ఉద్యోగి ఇతను శంషాబాద్ మండలంలోని గాన్స్ వాన్ గూడ మైసమ్మ దేవాలయంలో క్యాషియర్గా పనిచేస్తున్నాడు. మరో ఇద్దరు పలుగుట్ట గ్రామానికి చెందిన మంగలి వెంకటేశ్, కందవాడ గ్రామానికి చెందిన బండ ఎవాన్లు గాపోలీస్ లు గుర్తించారు. ఈ మేరకు వీరిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భూపాల్ శ్రీధర్ స్పష్టం చేశారు. పేకాట, క్రికెట్ బెట్టింగ్ లకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. జూదరులపై ఉక్కపాదం మోపుతాం చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ పేకాట, బెట్టింగ్, ఆన్ లైన్ గేమింగ్, చిన్నపిల్లల, బాలికల అక్రమ రవాణ చట్టరిత్య నేరమని, ముఖ్యంగా పేకాట, క్రికెట్ బెట్టింగ్. ఆన్ లైన్ గెమింగ్ కు యువత బానిస కావటం శోచనీయమని, యువత, విద్యార్థులు భవిష్యత్ జీవితం పక్కదారి పడుతుందని, జూదంలో డబ్బులు పొగట్టుకుని అప్పులపాలు అవుతున్నారు. అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. జూదరులపై ఉక్కపాదం మోపుతామని, చట్టానికి వ్యతిరేఖంగా ప్రవర్థిస్తే ఎంతటివారైన క్షమించేదిలేదని తెలిపారు. పేకాట, క్రికెట్ బెట్టింగ్ పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని సీఐ భూపాల్ శ్రీధర్ వెల్లడించారు.



## ఐకెపి సెంటర్‌లలో పర్యవేక్షకుల మార్పిడి తప్పక జరగాలి

- సెంటర్లలో పర్యవేక్షకుల ఆగని ఆగడాలు
- సెంటర్లలో దూకుడు ప్రదర్శిస్తున్న పర్యవేక్షకులు
- రైతుల జేబులను కొల్లగొడుతున్నారని ఆరోపణ
- క్షేత్రస్థాయిలో అధికారుల తనిఖీలు తప్పకుండా అవసరమే..?
- ప్రత్యేక దృష్టిని సారించలేకపోతున్న స్థానిక నాయకులు

**మనోహరాబాద్, మే 31 (జనంసాక్షి) :** మెదక్ జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల వద్ద ప్రతి సీజన్లో ఐకెపి సెంటర్‌లలో పర్యవేక్షకుల మార్పిడి తప్పకుండా జరగాలి అనేది రైతుల ఆవేదన కొనుగోలు కేంద్రాల్లో పర్యవేక్షకుల అధికారుల మార్పిడి జరగాలంటే జిల్లాకు చెందిన జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ జిల్లా సహకార అధికారులకు మండల పరిధిలో తాసిల్దార్‌కి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలి ధాన్యం కొనుగోలు సెంటర్లలో పర్యవేక్షకుల ఆగని ఆగడాలు నిర్లక్ష్య ధోరణి సెంటర్లలో రెండు సంవత్సరాలు పనిచేసిన పర్యవేక్షకులు రైతుల జేబులలో కొల్లగొడుతున్నారని ఆరోపణ పర్యవేక్షకుల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు అవకతవకలకు పాల్పడుతున్నట్లు స్పష్టమైన ఆధారాలతో సహా వివరణలతో కూడా ఆర్జిని స్థానిక అధికారులకు అందించాలి క్షేత్రస్థాయిలో



కొనుగోలు కేంద్రాల వద్ద అధికారుల తనిఖీలు ఎప్పటికప్పుడు తప్పకుండా అవసరమేనని రైతులు ఆరోపిస్తున్నారు స్థానిక నాయకులు ఐకెపి సెంటర్ల వద్ద రైతుల యొక్క ధాన్యం కొనుగోలు ఎలా జరుగుతుందో ఆరా తీయాల్సిన నాయకులు ప్రత్యేక దృష్టి పెట్టకపోవడం రైతులు ఆందోళనకు భావోద్వేగానికి లోనఅవుతున్నారు రైతుల ధాన్యం కొనుగోలు సమస్య పట్ల ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా వ్యవహరిస్తున్న తీరు ఇకనైనా సకాలంలో కొనుగోలు సమస్యను తీర్చాలని రైతులు అధికారులను కోరారు.

## ఆర్సీసీ పైప్‌లైన్ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



**మల్కాజిగిరి, మే 31 (జనంసాక్షి) :** గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఉత్తమ్ నగర్ కాలనీలో 66 లక్షల రూపాయలతో నిర్మించనున్న ఆర్సీసీ పైప్ లైన్ నిర్మాణ పనులను డివిజన్ మాజీ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలోని అన్ని డివిజన్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో సర్కిల్ ఏఈ దివ్య జ్యోతి ,మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, జేఏసీ వెంకన్న, రాము యాదవ్ ,బైరు అనిల్,కాటం రాజు,సిద్ధి రములు, నాగేష్ గౌడ్,నరహరి,చిట్టీ బాబు,మర్రి శ్రీనివాస్,నందు,హాబీబ్ వెంకటేష్, భాను,శెంకర్,ప్రసాద్,ప్రసాద్, బెనర్జీ,సాయికుమార్,రాగవేంద్ర రావు, నందకుమార్ ,శ్రీకాంత్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ యూనియన్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

- భవన నిర్మాణ కార్మికుల నిరసన, ధర్నా
- బోడుప్పల్ భవన నిర్మాణ కార్మిక సంఘం చైర్మన్, నత్తి మైసయ్య

**బోడుప్పల్, మే 31 (జనంసాక్షి) :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 380వ ఆదివారం జ్ఞానమాల సమర్పించి భారత రాజ్యాంగ నిర్మాణం కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా బోడుప్పల్ భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు వెంకిర్యాల లక్ష్మీ నరసయ్య ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించారు. అనంతరం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి కృష్ణ, ఇతర అసోసియేషన్ సభ్యులు తాపీ మేస్త్రి యూనియన్ సభ్యులను దళారులు అని, బ్రోకర్లు అని, ఇంటి యజమానుల వద్ద అధిక డబ్బులు వసూలు చేసి మోసం చేస్తారని చిత్త వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ బోడుప్పల్ అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి రోడ్డుపై బైఠాయించి నిరసన ధర్నా



నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకిర్యాల లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ కలిసిమెలిసి ఉండాల్సిన వారు తాపీ మేస్త్రీలపై అనుచిత వ్యాఖ్యలు చేసి వారి మనోభావాలను తీవ్రంగా పెద్ద తీసారని, తాపీ మేస్త్రి లేకుండా ఇంటి నిర్మాణం కొనసాగదని, తక్షణమే సెంట్రింగ్ యూనియన్ సభ్యులు తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం బోడుప్పల్ భవన నిర్మాణ కార్మిక సంఘం చైర్మన్, అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య మాట్లాడుతూ పాలు నీళ్లల కలిసి పని చేయాల్సిన వారు, ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదమని, తాపీ మేస్త్రి లేనిది సెంట్రింగ్ వర్క్ ఉండదని, ఇంటి యజమానితో తాపీ మేస్త్రికే ఎక్కువ అనుబంధం ఉంటుంది తప్ప సెంట్రింగ్ కాంట్రాక్టర్లకు ఇంటి యజమానులకు ఎలాంటి సంబంధం ఉండదని, తక్షణమే సెంట్రింగ్ యూనియన్ సభ్యులు క్షమాపణలు చెబుతూ కరపత్రాలు విడుదల చేయాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా తాపీ మేస్త్రీలు నిరసన కార్యక్రమాలు చేస్తారని హెచ్చరిస్తూ, అనుష్క వ్యాఖ్యలు చేసిన సెంట్రింగ్ యూనియన్ సభ్యుల పైన కఠిన చర్యలు తీసుకోవాలని మేడిపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తామని నత్తి మైసయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్య, రాపోలు శ్రీరాములు, గరుగుల యాకయ్య, చిల్ల అంజయ్య, యేసు రాజు, బోడుప్పల్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు నిడుమనూరు బ్రహ్మయ్య, కోశాధికారి నాగిని శ్రీను, కార్యవర్గ సభ్యులు జడ శ్రీనివాస్, బండారి కురుమయ్య, రామకృష్ణ, గుంజి శ్రీనివాస్, నిడమనూరు సుబ్బయ్య, కుంచాల శ్రీనివాస్, నిడమనూరు సుబ్బారావు, వై గోపి, ఏ బాల కుమార్, సాయి , జి కొండయ్య, రాము, శ్రీను, బాల మధు, జి లక్ష్మీనారాయణ , తదితరులు పాల్గొన్నారు.

# మహిళాభ్యున్నతే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం

**వనపర్తి బ్యూరో, మే 31 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోని మహిళాల అభ్యున్నతే పరమావధిగా నేడు కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పెబ్బేరు మండల కేంద్రంలోని సహారా ఫంక్షన్లో ఏర్పాటు చేసిన చీరల పంపిణీ కార్యక్రమానికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి , జిల్లా అధ్యక్షులు శివసేనరెడ్డి హాజరై మాట్లాడారు గత నియంత ప్రభుత్వ అవినీతి అక్రమాలను ఎండగట్టి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టిన ప్రజలకు సేవ చేసేందుకే తాను ఎల్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి గారు ప్రమాణం స్వీకారం చేసిన వెంటనే మొదటి సంతకం ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణం ఫైల్ పైనే సంతకం చేశారని ఎమ్మెల్యే చెప్పారు. కేవలం వనపర్తి నియోజకవర్గంకు సంబంధించి ఇప్పటివరకు 30 కోట్ల 29 లక్షల రూపాయలను ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించిందని ఆయన తెలిపారు.రేషన్ కార్డులు లేక అవస్థలు ఎదుర్కొంటున్న ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఇంటికి రేషన్ కార్డులను అందజేస్తుందని కేవలం వనపర్తి నియోజకవర్గంలో 37,500 కొత్త రేషన్ కార్డులను ప్రజలకు అందజేసినట్లు ఎమ్మెల్యే



వివరించారు.రేషన్ కార్డులు అందుకున్న ప్రతి ఒక్కరికి దేశంలోనే ఎక్కడా లేని విధంగా సన్న బియ్యాన్ని అందిస్తున్న ప్రభుత్వం కేవలం కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన అన్నారు.గత ప్రభుత్వం పంపిన చేసిన బతుకమ్మ చీరలను మహిళలు ఏ ఒక్కరు ధరించలేదని కేవలం అవి వ్యవసాయ పొలాల్లో అడవి పందులు రాకుండా ఉండేందుకు కట్టుకునేందుకే పనికి వచ్చాయని ఆయన అన్నారు.నేడు కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఇందిరమ్మ చీరలు నాణ్యవంతంగా ఉండడంతో మహిళలు సంతోషంగా ధరించి వస్తున్నారన్నారు. 200 రూపాయల ఉచిత కరెంటు ఇచ్చి నిరుపేదలకు కరెంటు కష్టాలు దూరం చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు.మహిళలకు వడ్డీ లేని రుణాలు, అమ్మ ఆదర్శ పాఠశాలలకు చైర్మన్లుగా, ఆర్టీసీ బస్సులకు ఓనర్లుగా, సోలార్ ప్లాంట్లకు ఓనర్లుగా, ఎన్నో రకాలుగా మహిళలను చైతన్యవంతం చేస్తూ వారి ఆర్థిక పురోభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సూపర్ మార్కెట్లు రైస్ మిల్లులు గోదాముల సైతం మహిళల నిర్వహణతో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.నేడు మహిళల గురించి నాడు ఏ ఒక్కరికి మంత్రి పదవి ఇవ్వలేదని ఇంట్లో కూతుర్ని ఇబ్బందులు పెట్టేవారు రాష్ట్రంలోని మహిళలను ఏ విధంగా మంచిగా చూస్తారని ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను చూసి కళ్ళు మండుతున్నాయని కుళ్ళుకొని చేస్తున్నారని అలాంటివారికి అభివృద్ధి సంక్షేమ ఫలాలే బుద్ధి చెబుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, స్థానిక కౌన్సిలర్లు మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు, ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, పెబ్బేరు మండల అధ్యక్షుడు రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, నాయకులు కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో ప్రభుత్వం విఫలం



**చేర్యాల, మే 31 (జనంసాక్షి) :** చేర్యాల మండలం నాగపూరి గ్రామంలో ధాన్యం సేకరణలో అనేక ఇబ్బందులు జరుగుతున్నాయని, తరుగు పేరుతో రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బందుల గురి చేస్తున్నారని ఐకేపి దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగపూరి సర్పంచ్ సంతోషి, మాజీ ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తెలిపిన ప్రకారం కాకుండా రైస్ మిల్లర్లు ఒక బస్తాకి 42 1/2 కిలోలు నుంచి 44 కిలోలు కంటా చేసి పంపితేనే అన్లోడ్ చేసుకుంటామని మిల్లర్లు రైతులను ఐకేపి నిర్వాహకులను బెదిరిస్తున్నారు. ఐకెపి ప్రారంభించి ఇప్పటికీ 45 రోజులు పూర్తయినా ధాన్యం సేకరణలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఒక పక్క కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నప్పటికీ రైస్ మిల్లర్ల లో మాత్రం మార్పు రావడం లేదంటే ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి స్పష్టంగా కనబడుతుంది. వర్షాకాలం సమీపిస్తున్నందున తేమశాతంతో సంబంధం లేకుండా తడిసిన ప్రతి గింజ ప్రభుత్వం కనీస మద్దతు ధరకు కొనాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ ప్రభుత్వంలో ఇటువంటి పరిస్థితులు ఉండేవి కావని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సందీప్, బాబు, వెంకటేశం, దేవేందర్ రెడ్డి, స్వామి, కరుణాకర్, సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

## కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి పట్టు కొమ్మలు



**వనపర్తి బ్యూరో, మే 31 (జనంసాక్షి) :** సంస్థాగత బలోపేతానికి, నాయకత్వ సామర్థ్యాల పెంపు, బూతు స్థాయి నుండి పార్టీని ప్రతిష్ట చేయడమే జిల్లా మండల కమిటీ ఎజెండా అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేన రెడ్డి అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ రివ్యూ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే మేఘా రెడ్డి తో కలిసి శివసేన రెడ్డి హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శివసేన రెడ్డి మాట్లాడుతూ పార్టీ పటిష్టత కోసం ఐక్యతగా పనిచేద్దాం అని పిలుపునిచ్చారు.గతంలో ఉన్న మండల కమిటీలకు , ప్రస్తుత నూతనంగా ఎన్నుకున్న మండల కమిటీలకు వ్యత్యాసాలు చాలా ఉంటాయని కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. గ్రామాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో వెళ్లాలని, సంస్థాగత , గ్రామ కమిటీలు, బూత్ కమిటీల్లో కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. పార్టీకి నిబద్ధతగా పనిచేసే వారికే మొదటి ప్రాధాన్యత ఉంటుందని, కొత్తగా ఎన్నుకున్న మండల అధ్యక్షులు కార్యవర్గానికి కీలకంగా బాధ్యతలు పనిచేయాల్సి ఉంటుందన్నారు. అంతకు ముందుకు కొత్తగా నియమించిన పట్టణ మండల కమిటీ సభ్యులను సన్మానించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, కొత్తగా ఎన్నికైన పట్టణ మరియు మండల అధ్యక్షులు పలువురు పాల్గొన్నారు.

# దొడ్డిదారిన ఉద్యోగుల వేతనం నుండి 1.5 శాతం మినహాయింపు దారుణం

- ఆరోగ్య పథకాన్ని ఎ ఆసుపత్రిలో అమలు చేస్తున్నారనే స్పష్టత లేదు
- మినహాయించిన వేతనాన్ని వెంటనే ఉద్యోగుల అకౌంట్‌లో జమ చేయాలి
- టీపీటీఎఫ్ సంఘం డిమాండ్

**సంగారెడ్డి, మే 31 (జనం సాక్షి) :** ప్రభుత్వం దొడ్డిదారిన ఉద్యోగుల వేతనం నుండి 1.5 శాతం మినహాయింపు చేయడం దారుణమని టిపిటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం మండిపడింది. ఆదివారం సంగారెడ్డిలో టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.సోమ శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.లక్ష్మయ్య యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు నాసెర్ పటేల్ తో కలిసి సంఘం నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల మే నెల వేతనం నుండి ఈ హెచ్ ఎస్ కోసం 1.5శాతం వేతనాన్ని బలవంతంగా మినహాయింపు చేయడాన్ని టిపిటిఎఫ్ సంగారెడ్డి జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ప్రభుత్వం ఎంప్లాయిస్ ఆరోగ్య పథకం కోసం ఉద్యోగుల మే నెల వేతనం



నుండి ఒకటి పాయింట్ ఐదు శాతం మినహాయిస్తూ పేస్లిప్స్ జనరేట్ చేశారన్నారు. ఆరోగ్య పథకానికి సంబంధించి విధివిధానాలు రూపొందించకుండా, కనీసం డ్రాయింగ్ అధికారులకు సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వం దొడ్డిదారిన ఉద్యోగుల వేతనం నుండి 1.5 శాతం మినహాయింపు చేయడాన్ని టిపిటిఎఫ్ సంగారెడ్డి జిల్లా శాఖ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ఏ హాస్పిటల్స్ లో ఈ ఆరోగ్య పథకాన్ని అమలు చేస్తున్నారనే స్పష్టత లేదు , భార్యాభర్తలు ఉద్యోగులైన సందర్భాలలో, తల్లిదండ్రులు ఉద్యోగులైన సందర్భాల్లో, వేతన మినహాయింపులు ఏ విధంగా చేస్తారనే నిబంధనలు రూపొందించకుండానే ప్రతి ఉద్యోగి నుండి మినహాయింపు చేశారనీ ఆవేదన వ్యక్తం చేశారు ఇది ఏకపక్ష నిర్ణయంగా దుర్మార్గమైన చర్యగా భావిస్తున్నామని వారన్నారు. హెల్త్ కార్డులు జారీ చేయకుండా, టీచర్ల సమ్మతి తీసుకోకుండా కనీసం టీజీఈ జేఏసీ నాయకుల దృష్టికి తేకుండా ఏకపక్షంగా మినహాయించిన 1.5 శాతం వేతనాన్నీ ఉద్యోగుల ఎకౌంటుకు వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ప్రభుత్వ అసంబద్ధ విధానాల పైన టిపిటిఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిపిటిఎఫ్ నాయకులు జనార్దన్ రెడ్డి, సిహెచ్.విజయ భాస్కర్, రాష్ట్ర కౌన్సిలర్ జీవన్ రావు, జిల్లా కార్యదర్శులు అశోక్, జగన్నాథం, మేకల శ్రీనివాస్, సంజీవ్ కుమార్ గౌడ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల ఉక్కుపాదం



**బెజ్జంకి, మే 31 (జనం సాక్షి) :** మండల పరిధిలోని దేవక్కపల్లి బస్ స్టేజ్ సమీపంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక వాహన తనిఖీలలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న అశోక్ లేలాండ్ టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.రేణికుంట గ్రామ పరిధిలోని మొయ్యతుమ్మెద వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా టిప్పర్‌లో తరలిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లాకు చెందిన హరి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని,అక్రమంగా తరలిస్తున్న ఇసుకతో పాటు టిప్పర్‌ను స్వాధీనం చేసుకునీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.అక్రమ ఇసుక తవ్వకాలు,రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని,చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ.తోట తిరుపతి హెచ్చరించారు.

# మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం



**సదాశివపేట, మే 31 (జనం సాక్షి) :** మహిళా సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ దేయమని మున్సిపల్ వైస్ చైర్మన్ రేణుక చిరంజీవి అన్నారు. ఇందిరమ్మ చీరలు పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సదాశివపేట పట్టణంలో మూడవ వార్డులో మహిళలకు మున్సిపల్ వైర్ చైర్మన్ రేణుక చిరంజీవి చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ మాట్లాడుతూ మహిళలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో మహిళలకు అవకాశాలు కల్పిస్తుందని అన్నారు. అంతకుముందు ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న చీరలు కట్టుకొని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రేణుక చిరంజీవి. ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు,వార్డు మహిళలు పాల్గొన్నారు.

## ఐటిసి సంస్థ నేతృత్వంలో చెరువు సుందరీకరణ



**మనోహరాబాద్, మే 31 (జనంసాక్షి) :** మనోహరాబాద్ మండల పరిధిలోని కొండాపూర్ గ్రామంలో ఐటిసి ఆధ్వర్యంలో చెరువు సుందరీకరణలో భాగంగా చెరువు కట్ట బలపరుచుట పూడికలు తీయుట ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పరచడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ రాము యాదవ్, ఐటీసీ బృందం సర్పంచ్ మాట్లాడుతూ కొండాపూర్ గ్రామ సుందరీకరణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నందుకు ఐటీసీ సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ మాట్లాడుతూ ఐటిసి సంస్థ స్థానిక భాగస్వామ్యంతో చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టిన సంస్థ యజమానియానికి ఐటిసి బంగారు భవిష్యత్తు నినాదంతో గతంలో కూడా ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టింది. చెరువుల కట్టల సుందరీకరణ పూడిక పనుల ద్వారా చెరువుల నిల్వ సామర్థ్యస్థాయి పెరుగుతుంది కట్టల పటిష్టత చెరువు కట్టలను బలోపితం చేయడం వరదలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు పర్యావరణ పరిరక్షణ నీటి సంరక్షణలో భాగంగా కాలుష్యాన్ని అరికట్టడానికి జీవ శుద్ధికరణ పద్ధతులను ఉపయోగిస్తారు కట్టల మీద మరి చుట్టుపక్కల పచ్చదనంతో ఉండేలా చూడటం వర్షపు నీరు భూమిలోకి ఇంకెలా ఇంకుడు గుంతలు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం స్థానిక రైతులతో చెరువుల పరిరక్షణకు బలోపేతం చేయడం పర్యావరణ పరిరక్షణ పెంపు లక్ష్యంగా ఐటీసీ సంస్థ చెరువుల పునరుద్ధరణ పనులను కార్పొరేట్ సామాజిక బాధ్యతగా సంస్థ కృషి చేస్తుంది ఐ టి సి సంస్థ గ్రామాల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తుంది ఈ కార్యక్రమంలో ఐటీసీ సంస్థ బృందం మరియు వార్డు మెంబర్లు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నీటి సమస్యను తీర్చిన కౌన్సిలర్

**చేర్యాల, మే 31 (జనంసాక్షి) :** చేర్యాల పట్టణంలోని 8వ వార్డు శ్రీరామ నగర్ కాలనీలో కాలనీవాసులు నీటి సమస్య తో ఇబ్బంది పడుతున్న విషయం గమనించిన కౌన్సిలర్ బుదారి సురేష్ బోర్ వేయించి ఆదివారం రోజు మోటార్ బిగించి నీటిని కాలనివాసులకు అందుబాటులోకి తెచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బీరెడ్డి ఇన్నా రెడ్డి, పాము శ్రీనివాస్, పింజరి చందర్, మధు ,భాస్కర్ కాలనీవాసులు పాల్గొన్నారు.



# రైతులు పంట అవశేషాలను కాల్చొద్దు

**జడ్చర్ల, మే 31 (జనంసాక్షి) :** వ్యవసాయ రంగంలో పర్యావరణ పరిరక్షణ, భూసార రక్షణే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఒక కీలక నిర్ణయాన్ని తీసుకుంది. పంట కోతల అనంతరం పొలాల్లో మిగిలిపోయే పంట అవశేషాలను తగులబెట్టే సాంప్రదాయ పద్ధతికి రైతులు స్వస్తి పలకాలని ప్రభుత్వం గట్టిగా పిలుపునిచ్చింది. ఈ నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా పొలాల్లో పంట వ్యర్థాలకు నిప్పు పెట్టినట్లయితే, అట్టి వారిపై రూ. 5వేల నుండి గరిష్టంగా రూ. 25వేల వరకు భారీ జరిమానా విధించనున్నట్లు వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. పంట అవశేషాలను కాల్చడం వల్ల వాతావరణానికే కాకుండా, స్వయంగా రైతులకు మరియు వారి భూములకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో జడ్చర్ల పరిసర ప్రాంతాల రైతులకు విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేసింది. పంట అవశేషాలను కాల్చడం వల్ల పొలాల్లో భారీగా పొగ విడుదలై గాలి కాలుష్యం విపరీతంగా పెరుగుతుంది. అంతేకాకుండా, మంటల తీవ్రత వల్ల నేలలోని సహజ రసాయన సమతుల్యత దెబ్బతిని భూసారం క్షీణిస్తుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూమిలో ఉండి పంటకు ఎంతో మేలు చేసే ఉపయోగకరమైన



స్నేహపూర్వక సూక్ష్మజీవులు ఈ వేడికి పూర్తిగా నశించిపోతాయి. దట్టమైన పొగ కారణంగా చుట్టుపక్కల ప్రజలకు తీవ్రమైన శ్వాసకోస ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. రోడ్లపై వెళ్లే వాహనదారులకు ఈ పొగ అడ్డుగా మారి చూపు ఆనక ప్రమాదాలు జరిగే అవకాశం కూడా పొంచి ఉంది. వీటన్నింటికీ మించి వాతావరణంలోకి కార్బన్ డయాక్సైడ్, మీథేన్ వంటి ప్రమాదకరమైన వాయువులు విడుదలై పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తాయి. ఇలాంటి నష్టాలను నివారించడానికి రైతులు ప్రత్యామ్నాయ ఆధునిక పద్ధతులను పాటించాలని ప్రభుత్వం సూచిస్తోంది. పంట కోత తర్వాత మిగిలిన వ్యర్థాలను కాల్చకుండా, ఆధునిక విత్తనాలు నాటే యంత్రం సహాయంతో నేరుగా నేలలోనే కలిపి దున్నుకోవచ్చు. లేదా రొటేవేటర్ మరియు మల్చర్ వంటి ఆధునిక యంత్రాలను ఉపయోగించి వ్యర్థాలను చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించి భూమిలో కలియదున్నడం వల్ల అవి సులభంగా కుళ్ళిపోతాయి. పొలాల్లో మిగిలిన ఎండుగడ్డిని సేకరించి పశువులకు పౌష్టిక మేతగా కూడా ఉపయోగించు కోవచ్చు. ఈ పంట అవశేషాలను ఒకచోట చేర్చి అద్భుతమైన సేంద్రీయ కంపోస్ట్ ఎరువుగా మార్చుకోవడం వల్ల భూమి మరింత సారవంతం కావడమే కాకుండా, పంట దిగుబడి కూడా అధికంగా వస్తుందని అధికారులు వివరిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రస్తుతం గ్రామగ్రామాన పర్యటిస్తూ, రైతులను ఒకచోట చేర్చి ఈ ఆధునిక యంత్రాల వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శనలు ఇస్తూ అవగాహన కల్పిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పంట వ్యర్థాలను సేంద్రీయ ఎరువుగా మార్చుకోవడం వల్ల రసాయన ఎరువుల ఖర్చు తగ్గడమే కాక, దీర్ఘకాలంలో భూమి జీవకళతో ఉంటుందని అధికారులు చెబుతున్నారు. "పంట అవశేషాలను కాల్చవద్దు - ప్రకృతిని కాపాడండి" అనే నినాదంతో భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతీ ఒక్కరైతు బాధ్యతగా అవగాహనతో వ్యవహరించాలని తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ శాఖ కోరింది.

## రసమయి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

- బీఆర్ఎస్ నాయకుల వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం



**బెజ్జంకి, మే 31 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొంకటి రాములు ఆధ్వర్యంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డా.రసమయి బాలకిషన్ మీరు ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు కాంగ్రెస్ కార్యకర్తలపై చేసిన వ్యాఖ్యలను మేము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రసమయి బాలకిషన్ రైతుల సమస్యలను రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకుంటూ ప్రజల్లో తన ఉనికిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.కాంగ్రెస్ నాయకుడు బోనగం రమేష్ మాట్లాడుతూ రసమయి వ్యాఖ్యలకు మద్దతు ఇస్తున్న బీఆర్ఎస్ నాయకుల తీరును మండల ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని గుర్తించాలని,కాంగ్రెస్ కార్యకర్తలను బెదిరిస్తే తగిన విధంగా ప్రతిస్పందిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు కర్రవుల సందీప్,వార్డు సభ్యులు ఎలిగే సతీష్,ఇష్కిల్ల ఐలయ్య,అడుకాని నర్సింగరావు,అయిలేని మహేందర్ రెడ్డి,రొడ్డ మల్లేశం,పుర్మ నారాయణ రెడ్డి,గుబిరే చంద్రం,లింగాల సారయ్య,బొర్ర చందు తదితరులు పాల్గొన్నారు.

# ఎండల తీవ్రతకు బ్రేక్

- నిర్మల్‌లో ఈదురు గాలులతో చల్లని వాతావరణం
- మేఘావృతమైన ఆకాశం.. విద్యుత్ సరఫరాపై తాత్కాలిక ప్రభావం



**నిర్మల్ బ్యూరో, మే 31 (జనం సాక్షి):** కొన్ని రోజులుగా భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న నిర్మల్ పట్టణ ప్రజలకు ఆదివారం సాయంత్రం ప్రకృతి కాస్త ఊరటనిచ్చింది. మధ్యాహ్నం వరకు అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు సాయంత్రం వేళ ఒక్కసారిగా మారిన వాతావరణంతో ఉపశమనం పొందారు. సాయంత్రం సమయంలో ఉన్నట్టుండి ఆకాశం మేఘావృతమై, పట్టణ వ్యాప్తంగా భారీ ఈదురు గాలులు వీచాయి. దీంతో వాతావరణంలో చల్లదనం నెలకొని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. రోడ్లపై ప్రయాణిస్తున్న వాహనదారులు, వ్యాపారులు, చిన్నారులు, వృద్ధులు కొంత ఉపశమనం పొందినట్లు తెలిపారు. కొద్దిసేపట్లోనే వాతావరణంలో గణనీయమైన మార్పు చోటుచేసుకోవడంతో ఎండ తీవ్రత తగ్గింది. అయితే ఈదురు గాలుల ప్రభావంతో చెట్ల కొమ్మలు విరిగి పడే అవకాశం ఉండటంతో పాటు విద్యుత్ లైన్లకు నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. విద్యుత్ శాఖ అధికారులు పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో కొన్ని ప్రాంతాల్లో కొంతసేపు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఈదురు గాలుల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.. ఎండల తీవ్రత మధ్య ఒక్కసారిగా ఏర్పడిన ఈ చల్లని వాతావరణం నిర్మల్ వాసులకు కొంత ఉపశమనాన్ని అందించింది.

# రైతు కష్టం పశువుల పాలు

- రైతుకు విడవని దుఃఖం.. నిండని కడుపు
- వడ్లు తరలించాలని రైతుల ఆవేదన



**కాటారం మే 31 (జనం సాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల పరిధిలోని దేవరంపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పట్టపగలే పశువులు మేస్తున్నాయి. ఆరు కాలం కష్టం చేసి పండించిన పంట పశువుల పాలు అవుతుందని రైతు కంటతడి పెడుతున్నాడు. ఎందుకో గాని రైతు కష్టం నష్టాలకు భరించి వచ్చి పంటకు పెట్టబడి పెట్టి ధాన్యం వచ్చినంక చివరికి అమ్ముకోవడానికి కూడా నానా తండాలు పడుతుంటే రైతు కుటుంబం ఆవేదన గురవుతుంది. లారీల కొరత వలన ధాన్యం కొనుగోలు సెంటర్లు ఉన్నాయి. నెలపాటు నిల్వ ఉంటున్నాయి. ఈమధ్య ప్రభుత్వం స్పందించినప్పటికీ ధాన్యం తరలింపులో అమాలి కొరత లారీల కారణంగా ధాన్యం నిలవ ఉంటున్నది. వర్షాకాలం వడగండ్ల వాన మొదలైనప్పటికీ కళ్ళల్లో కనీసం 50% వరి ధాన్యం తరలిపోలేదు. రైతు పంట నమ్మి వ్యవసాయ రుణాలు కడదామని ఎంతో ఆశతో ఉన్న కూడా ఫలితం లేకుంటే పోయింది. లారీలకు బదులు ట్రాక్టర్ల యందు తరలిస్తే కిరాయిస్తామని చెప్తున్నప్పటికీ హమాలి కొరత తీవ్రంగా వేధిస్తుంది. కాటారం సబ్ డివిజన్ పరిధిలోని మహదేపూర్, కాటారం, మల్హార్ మండలాల్లో ధాన్యం అధికంగా ఉంది. కొయ్యూరు వలంకుంట, తాడిచర్ల, కొండం పేట వరి ధాన్యం అధికంగా ఉంది. కాటారం మండలంలోని గ్రామాల్లో గంగారం, దేవరంపల్లి, దామరకుంట గ్రామంలో వరి పంట ఎక్కువ పండి కళ్ళలో ఎక్కువగానే ఉంది. కళ్ళం నిర్వాకులు కనీసం పశువుల కోసం కావలిగా ఉండకపోవడం రైతు దుఃఖాన్ని వెలకట్టలేక బాధపడుతున్నారు. పాపం రైతు పండించిన పంట కండ్ల ముందే పశువు లు మెరిసిపోతా ఉంటే ఏం చేయాలో తోచక ఏడుస్తా ఉన్నాడు. కళ్ళ నిర్వాహకులకు కమిషన్ వస్తున్నప్పటికీ ఏదో ఒక వ్యక్తిని బలంగా కావలించాల్సిన అవసరం ఉంది. కానీ పట్టింపు లేకపోవడంతో పశువుల పాలవుతుంది. మే 30 దాటి వర్షం ఉన్న వడ్లు మాత్రం పూర్తి దశలో తరలింపు కావని రైతులు బాధపడుతున్నారు. ఏది ఏమైనా ప్రభుత్వం స్పందించి త్వరగా ధాన్యం పంపేట్లు చూడాలని రైతులకు కోరుతున్నారు.

# కాళేశ్వరానికి పోటెత్తిన భక్తులు

- ఒక్కరోజే సుమారు 3 లక్షల మంది రాక
- ఆలయ చైర్మన్ మోహన్ శర్మ



**కాళేశ్వరం, జూన్ 01 (జనం సాక్షి) :** సరస్వతి అంత్య పుష్కరాల 11వ రోజు కాళేశ్వరం భక్తజన సందోహంతో కిక్కిరిసి పోయింది. ఒక్కరోజే సుమారు 3 లక్షల మంది భక్తులు కాళేశ్వరం చేరుకుని సరస్వతి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి దర్శనం చేసుకున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ శర్మ తెలిపారు. భక్తుల భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు, సిబ్బంది, వివిధ శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. స్నాన ఘాట్లు, తాగునీరు, వైద్య సేవలు, పారిశుధ్య నిర్వహణ, ప్రత్యేక క్యూలైన్లు, భద్రతా ఏర్పాట్లను అందుబాటులో ఉంచి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పుష్కరాల 11వ రోజు కావడంతో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారని చెప్పారు. భక్తులు ప్రశాంతంగా పుణ్యస్నానాలు చేసి స్వామివారి దర్శనం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు మోహన్ శర్మ వెల్లడించారు. పుష్కరాల చివరి రోజు సోమవారం కావడంతో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని, దాదాపు 10 లక్షల మంది వరకు భక్తులు వచ్చే అవకాశముందని ఆయన తెలిపారు. అందుకు అనుగుణంగా అదనపు సిబ్బంది, ప్రత్యేక క్యూలైన్లు, తాగునీరు, పారిశుధ్య, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. చివరి రోజు వచ్చే ప్రతి భక్తుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పుణ్యస్నానం చేసి స్వామివారి దర్శనం చేసుకునేలా అన్ని చర్యలు తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు. భక్తుల సేవే మా లక్ష్యం చివరి రోజు వచ్చే ప్రతి భక్తుడికి మెరుగైన సౌకర్యాలు అందిస్తాం అని చైర్మన్ మోహన్ శర్మ తెలిపారు.

## వడ్ల బస్తాలకు నిప్పంటించి రోడ్డుపై రైతుల ధర్నా



**పాలకుర్తి, మే 31(జనంసాక్షి) :** మండలంలోని ఈరవెన్నులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆదివారం రైతులు వరి ధాన్యానికి నిప్పంటించి ధర్నా చేశారు. నెల రోజులుగా కొనుగోళ్లు లేక, లారీలు రాకపోవడంతో రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే బస్తాలకు నిప్పటించి నిరసన తెలిపారు. అనంతరం రైతులు మాట్లాడుతూ గత నెల రోజులకు పైగా గ్రామ లో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసిన అధికారులు గన్నీ బ్యాగులను రైతులకు ఇవ్వడంలేదని ఆరోపించారు. అదే విధంగా లారీలు రావడం లేదని, ధాన్యం కొనుగోల్లు చేయకపో వడంతో వర్షాలు కురిస్తే తీవ్ర నష్టం జరుగుతుందని తేల్చి చెప్పినప్పటికీ అధికారులకు పట్టింపులేదని వా పోయారు. ఈ నెల రోజుల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అవేదన వ్యక్తం చేశారు. గన్నీ బస్తాల కొరతతో ధాన్యం నిల్వల పేరుకుపో యాయని, కొనుగోలు ప్రక్రియలో జాప్యం జరుగు తుందని ఆందోళన చెందిన రైతులు వడ్ల బస్తాలకు నిప్పటించి ధర్నా చేశారు. వెంటనే అధికారులు ఈరవెన్నులో గన్నీ బ్యాగులు ఇచ్చి, ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# 'రుద్రమ' బ్రాండ్‌కు దేశవ్యాప్త గుర్తింపు తీసుకురావాలి

- ల్యాదల్లలో 'రుద్రమ' బ్రాండ్‌తో తెలంగాణ మహిళా ఆత్మగౌరవానికి కొత్త అధ్యాయం
- స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ మినీ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ ప్రారంభం
- పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి




**హనుమకొండ ప్రతినిధి, మే 31 (జనంసాక్షి) :** ఆదివారం దామెర మండలం ల్యాదేళ్ల గ్రామంలో మహిళా శక్తి వారోత్సవాల సందర్భంగా పరకాల స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ మినీ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ ప్రారంభోత్సవం మరియు ఎస్ హెచ్ జి వివో, వర్క్ షెడ్, జీ ఎం డైరీ మరియు సమావేశ మందిరము భవనములకు వీ హబ్ సీఈవో సీతా పల్లాచోల్ల తో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం మహిళా సమైక్య సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ల్యాదల్లలో రుద్రమ బ్రాండ్ తో తెలంగాణ మహిళా ఆత్మగౌరవం పేరుతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పరకాల స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ మినీ మ్యాను ఫ్యాక్చరింగ్ హబ్ ను ప్రారంభించుకోవడం గర్వకారణంగా ఉంది అన్నారు. ఈ ల్యాదల్లలో డైరీ ఎప్పుడు ఎప్పుడు ప్రారంభిస్తామనీ ఎదురు చూసిన రోజు ఈ రోజు నెరవేరింది. "రుద్రమ బ్రాండ్"తెలంగాణ మహిళల ఆర్థిక స్వాలంబన ఆత్మగౌరవం పెంచుతుంది. ల్యాదల్ల గ్రామంలో మహిళల కోసం ప్రత్యేకంగా స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ మినీ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ ఏర్పాటు చేయబడింది. స్థానిక యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం మరియు వీ-హబ్ ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేస్తున్నదని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడం మరియు స్థానికంగా చిన్న తరహా తయారీ యూనిట్లలో ఉపాధి అవకాశాలు కల్పించడం ముఖ్య ఉద్దేశం అన్నారు. నాణ్యతతో కూడిన ఉత్పత్తులను తయారుచేసి రుద్రమ బ్రాండుకు దేశవ్యాప్తంగా పేరు తెచ్చేలా మహిళలు తేవాలని మా నమ్మకాన్ని నిలబెట్టాలని అన్నారు. మహిళా సోదరిమణులలో కమిట్ మెంట్ తో పనిచేసే శక్తి ఉన్నదని అన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా వీరోచితం పోరాడిన రాణి రుద్రమ చరిత్రను తిరగరాసేలా ఇక్కడ తయారు చేసే ఉత్పత్తులకు రుద్రమ పేరు పెట్టడం మంచి పరిణామం అని అన్నారు. అభివృద్ధికి కావలసిన సౌకర్యాలు తాను కల్పిస్తానని మీరు మార్కెటింగ్ పెరిగేలా కృషి చేయాలని మహిళల ఆర్థిక కృషి చేయాలని వీ హబ్ నిర్వాహకులను కోరారు. నిజాయితీ నిబద్ధత పెట్టుబడిగా పరకాల ఇందిరా మహిళ పాల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య లిమిటెడ్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిఆర్డిఓ మేన శ్రీను సంబంధిత అధికారులు మహిళలు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# జనగణన హెచ్‌ఎల్‌ఓ లోపాల సవరణ

- ఇందిరమ్మ ఇండ్ల మహా గృహప్రవేశాలను అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులకు దిశానిర్దేశం



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** జనగణన హెచ్.ఎల్.ఓ డేటాలోని లోపాల సవరణతో పాటు, ఇందిరమ్మ ఇండ్ల మహా గృహప్రవేశాల కార్యక్రమాలను అత్యంత ప్రాధాన్యతతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. ఆదివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి సంబంధిత జిల్లా, మండల, మున్సిపల్ అధికారులకు ఆయన గూగుల్ మీట్ ద్వారా సుదీర్ఘ సమీక్షా సమావేశాన్ని నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనాభా గణనకు సంబంధించిన హెచ్.ఎల్.ఓ డేటాలో ఉన్న అన్ని రకాల అసంబద్ధతలను, లోపాలను క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా తక్షణమే సరిచేయాలని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో మాస్టర్ ట్రైనర్లు, సూపర్వైజర్లు, చార్జ్ అధికారులు, వార్డు అధికారులు పూర్తి సమన్వయంతో వ్యవహరించి తప్పుల్లేని డేటాను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి, 'మహా గృహప్రవేశం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గృహనిర్మాణ శాఖకు చెందిన డీఈలు, ఏఈలు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనుల ప్రగతిని పర్యవేక్షించాలని, అధికారులు తమకు కేటాయించిన విధుల్లో ఎలాంటి అలసత్వాన్ని ప్రదర్శించకుండా వంద శాతం లక్ష్యాలను సాధించాలని హెచ్చరించారు. ఈ వర్చువల్ సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి స్రవంతి, జిల్లా పరిషత్ సీఈఓ రవి, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, హౌసింగ్ పీడీ శంకర్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఎంపీడీఓలు, చార్జ్ అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సూపర్వైజర్లు, మాస్టర్ ట్రైనర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి పోలీస్ యాక్ట్ అమలు

- నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల



**నిర్మల్, మే31 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లాలో నేటి నుంచి జూన్ 30 వరకు 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని ఆదివారం ఒక ప్రకటన లో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల తెలిపారు. ఈ కాలంలో పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు, ధర్నాలు, ప్రజా సమావేశాలు నిర్వహించడం నిషేధం. కత్తులు, కర్రలు, జెండా కర్రలు, పేలుడు పదార్థాలు వంటి ఆయుధాల వినియోగం, లౌడ్‌స్పీకర్లు, డీజేలు వాడకంపై కూడా నిషేధం విధించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

## నిద్రిస్తున్న మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ




**తాండూర్, మే 31( జనం సాక్షి) :** తాండూర్ మండలంలోని అచలాపూర్లో శనివారం అర్ధరాత్రి ఓ మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు చోరీకి గురైంది. ఎస్సై ప్రసాద్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళ రాత్రి భోజనం ముగించుకుని ఇంటి బయట మంచంపై నిద్రించారు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడును తెంపుకొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# అంత్యపుష్కరాలను ఏటీఎంగా మార్చుకున్న దుద్దిళ్ల కుటుంబం

- పుష్కర ఏర్పాట్లకు కేటాయించిన రూ.30కోట్లను మింగేసిండ్లు
- గోదావరి పుష్కరాల్లోనైనా దోపిడి లేకుండా ఈ ప్రాంత ప్రతిష్ట పెంచాలే
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్




**కాళేశ్వరం (జనంసాక్షి) :** అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నమని చెప్పుకునే సరస్వతీ అంత్య పుష్కరాలు దుద్దిళ్ల కుటుంబానికి ఏటీఎంగా ఉపయోగపడుతున్నాయని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. మహదేవ్ పూర్ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం క్షేత్రంలో సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ -శైలజ దంపతులు పుష్కర స్నానం ఆచరించి శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వర క్షేత్రంలో నిర్వహించిన ఆది పుష్కరాల్లో ఏ దోరణి అవలంబించారో అదే దోరణి అంత్యపుష్కరాల్లో అవలంబించారని అన్నారు. ఆది పుష్కరాల్లో ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు ఖర్చు చేసిన దానిని ఆర్‌టీఐ ద్వారా ఎంత ఖర్చు చేసిండ్లు దేనికి ఖర్చు చేసిండ్లని అడిగితే కనీసం లెక్కలు చూపించడం లేదని, దేవాదాయ శాఖ ఎంత డబ్బు వెచ్చిందని అడిగితే చూపించకుండా సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ ఉన్నాయని వివరాలు చెప్పకూడదం టున్నారన్నారు. ఆలయ ఆస్తులు ఎన్ని ఉన్నయి డబ్బులు ఎంత ఉందన్నది చెప్పకూడదని సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌లో ఉంది కానీ చేసిన ఖర్చు చెప్పకూడదని ఎక్కడ లేదన్నారు. ఆడిట్ లేని డబ్బును ఎక్కువగా నొక్కేయవచ్చన్నదే వారి ఆలోచన అని ఆయన అన్నారు. ఈనాడు మంత్రి సతీమణి శైలజారామయ్యర్ దేవాదాయ శాఖ కమీషనర్‌గా ఉండి ఇక్కడ డబ్బు ఏవిధంగా నొక్కెయాలనే ఆలోచనలో ఉన్నట్లుగా కనబడుతుందన్నారు. అంత్య పుష్కరాల్లో విఐపీలకు కల్పించిన సౌకర్యాలు సామాన్యులకు కల్పించలేదని, తెప్పోత్సవం, హారతీ కార్యక్రమాలు చేస్తున్నారని, అయితే ఎవరైనా విఐపీ వస్తున్నారంటే సామాన్యులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. వీఐపీలపై చూపించిన శ్రద్ధ సామాన్యులకు చూపించకపోవడం వల్ల ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారని, మొదటి రోజే మంథని బస్ స్టాండ్ లో హైదరాబాద్‌నుంచి వచ్చిన భక్తులకు బస్‌సౌకర్యాలు లేక ఇబ్బంది పడ్డారని ఆయన గుర్తు చేశారు. భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా నోట్లు దండుకోవడానికే కార్యక్రమాలు చేస్తున్నారని, సాయంత్రం వేళలో లైటింగ్ పెట్టి షోపుటప్‌లు చేస్తున్నారని, ఇప్పటి వరకు సరస్వతీ అమ్మవారిపై మండపం పూర్తి చేయలేదని, రోడ్లు పనులు కాలేదన్నారు. భార్యాభర్తలు కాళేశ్వరంను ఏటీఎంలా మార్చుకుని వేల కోట్లు ఇక్కడే సంపాదించుకుంటున్నారని, ఓట్లు వస్తే నోట్ల సంచుల కోసం అనేక రకాల దోపిడీలు చేస్తున్నారని ఆరోపించారు. 40ఏండ్లు దుద్దిళ్ల కుటుంబానికి అధికారం ఇచ్చామని, ఆలయాలను అభివృద్ధి చేయాల్సిన కులంలో పుట్టిన మీరు ఆలయాలను నిర్వీర్యం చేయడం దౌర్భగ్యమన్నారు.

# గడువులోగా ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద..
- పంట అవశేషాల కాల్చివేతపై రైతులకు అవగాహన కల్పించాలి..



**వరంగల్ ప్రతినిధి /ఖానాపురం, మే 31(జనంసాక్షి):** నైరుతి రుతుపవనాల రాక నేపథ్యంలో రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని గడువులోగా పూర్తిగా సేకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. ఆదివారం ఖానాపూర్ మండలంలోని మనుబోతుల తండా, పెద్దమ్మగడ్డ తండా, ఖానాపూర్ మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణ పురోగతి, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు, హమాలీల అందుబాటు తదితర అంశాలపై ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులతో మాట్లాడిన కలెక్టర్, ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. హమాలీల కొరత ఉందని రైతులు చెప్పడంతో కొనుగోలు పూర్తయిన కేంద్రాల నుంచి హమాలీలను అవసరమైన కేంద్రాలకు తరలించి సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రైతులకు పంట అవశేషాల కాల్చివేత వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలను వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం తగ్గిపోవడంతో పాటు నేలలోని సూక్ష్మ జీవులు నశించి భూమి సారవంతత దెబ్బతింటుందని తెలిపారు. దీని ప్రభావం భవిష్యత్తులో పంట దిగుబడులపై పడుతుందని, రైతులు పంట అవశేషాలను కాల్చకుండా ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. ఖానాపూర్ మండలంలోని శ్రీనివాసరావు రైస్ మిల్, సాయి కృష్ణ రైస్ మిల్, గోపీకృష్ణ ఆగ్రో ఏజెన్సీలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ధాన్యం బస్తాల నాణ్యత, బరువు, రికార్డులు, రసీదులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా తూకాలు సక్రమంగా నిర్వహించాలని, ధాన్యం స్వీకరణలో పారదర్శకత పాటించాలని మిల్లర్లకు సూచించారు. రైతుల ప్రయోజనాలకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. ఈ సందర్శనలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, నర్సంపేట ఆర్డిఓ ఉమారాణి, సంబంధిత శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.



## సమీకృత జిల్లా కార్యాలయం పనులు త్వరగా పూర్తి చేయాలి..

**వరంగల్ ఈస్ట్, మే 31 (జనం సాక్షి) :** ఆదివారం ఉదయం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ' ఓ సిటీ లో నిర్మాణం లో ఉన్నా జిల్లా సమీకృత కార్యాలయ సముదాయాన్ని సందర్శించారు. ఈ సందర్శనకు వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్ ,సంబంధిత అధికారులు ,కాంట్రాక్టర్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు. అనంతరం సంబంధిత అధికారులను మరియు కాంట్రాక్టర్లను నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని, త్వరలో అందుబాటులోకి రానున్న సమీకృత జిల్లా కలెక్టరేట్ సముదాయాన్ని మొక్కలు మరియు కొన్ని అందమైన చెట్లును నాటడం ద్వారా ఇంకా సుందరీకరణగా తీర్చిదిద్దాలన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
01 జూన్ 2026

# కొండాపురం - పొన్నెకల్లు రోడ్డు పనులకు శంకుస్థాపన

- సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ప్రజా ప్రభుత్వం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ఖమ్మం రూరల్, మే 31 : (జనం సాక్షి) :** ప్రజల ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని ముందుకు సాగుతోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలం కొండాపురం గ్రామంలో రూ.5.20 కోట్ల వ్యయంతో పొన్నెకల్లు నుండి కొండాపురం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ లతో కలిసి ఆయన ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు.

**ఆర్థిక ఇబ్బందులున్నా హామీల అమలు**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం ఎక్కడా వెనుకడుగు వేయడం లేదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూనే, రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన రహదారుల నిర్మాణం ద్వారా ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఎంతో ఉపయోగపడుతుందని, కొండాపురం--పొన్నెకల్లు రోడ్డు పూర్తయితే ఈ ప్రాంత రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

**రూ.21 వేల కోట్ల రైతు రుణమాఫీ**

రైతును రాజు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల మేర (రెండు లక్షల రూపాయల వరకు) రైతు రుణమాఫీ చేశామని మంత్రి వివరించారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి బాధ్యత ముగించుకుంటే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అన్ని రకాల పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేస్తోందని చెప్పారు. సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ కూడా అందజేస్తున్నామని తెలిపారు.

**జూన్ ఒకటి నుంచే ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత**

పేదలకు పక్కా గృహాలు అందించే ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడత మంజూరు ప్రక్రియ జూన్ 1 (సోమవారం) నుంచే ప్రారంభం కానుందని మంత్రి వెల్లడించారు. ఈ విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేయనున్నట్లు, ప్రతి నియోజకవర్గానికి 2 వేల ఇళ్లను కేటాయిస్తామని చెప్పారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి నాలుగు విడతల్లో రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇప్పటికే మంజూరైన 4.50 లక్షల ఇళ్లకు సంబంధించి ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నట్లు తెలిపారు.

**రెండేళ్లలో 72 వేల మందికి ఉద్యోగాలు**

ప్రభుత్వం ఏర్పడిన తొలి రెండేళ్లలోనే 72 వేల మంది నిరుద్యోగ యువతకు నియామక పత్రాలు అందించామని మంత్రి తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డుల జారీ, రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మువ్వా విజయ్ బాబు, ఆర్‌డీఓ శ్రీనివాస్,జిల్లా మహిళా నాయకురాలు బేబీ మద్దినేని స్వర్ణ కుమారి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోట వీరభద్రం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఆత్మ రక్షణకు ఆడపిల్లలు కరాటే నేర్చుకోవాలి

- ఎమ్మెల్యే బత్తుల



**మిర్యాలగూడ, మే 31 (జనంసాక్షి) :** ఆత్మరక్షణకు ఆడపిల్లలు కరాటే నేర్చుకోవలిసిన అవసరం ఉన్నదని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం నాడు పట్టణం లోని తెలంగాణ అమరవీరుల స్మారక స్తూపం వద్ద ఖరాటే మాస్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థుల కు నిర్వహించిన ఉచిత కరాటే శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిధి గా పాల్గొనడం జరిగింది. ఆ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కరాటే ఒక యుద్ధ కళ మాత్రమే కాదని విద్యార్థులలో శారీరక దారుఢ్యాన్ని, క్రమశిక్షణ ను పెంపొందిస్తుంది అన్నారు.నేటి తరం పిల్లలు సెల్ ఫోన్ లకు, టీవీ లకు పరిమితం కాకుండా మానసిక ఉల్లాసాన్ని కలిగించే క్రీడల పై ఆసక్తి పెంపొందించు కోవాలని, జాతీయ అంతర్ జాతీయ స్థాయిలలో రాణించాలని అన్నారు.వేసవి సెలవుల్లో పిల్లలు తమ సమయాన్ని వృధా చేసుకోకుండా వారికి సేవ దృక్పథం తో ఉచిత ఖరాటే ను నేర్పిస్తున్న మాస్టర్ రామకృష్ణ ని ఈ సందర్భంగా అభినందించారు.శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థుల కు బెల్టులు, అధికారిక పత్రాలను అందించారు. ఈ కార్యక్రమం లో కరాటే అసోసియేషన్ ప్రతినిధులు,విద్యార్థుల తల్లిదండ్రులు మరియు స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## నల్లగొండ డీఎస్పీ, టూ టౌన్ సీఐ కార్యాలయాలపై ఎస్పీ ఆకస్మిక తనిఖీ




**నల్లగొండ ప్రతినిధి, మే 31 (జనం సాక్షి) :** జిల్లా పోలీసు శాఖలో పరిపాలనా పనితీరు, కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ఆదివారం నల్లగొండ డీఎస్పీ కార్యాలయం, టూ టౌన్ సీఐ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా గ్రేవ్ కేసుల క్రైమ్ ఫైల్స్, పెండింగ్ కేసుల రికార్డులు, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా దర్యాప్తు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.హత్యలు, దోపిడీలు, మహిళలు, చిన్నారులపై నేరాలు, సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల పురోగతిని సమీక్షించిన ఎస్పీ, పెండింగ్ కేసులను వేగంగా ఛేదించాలని సూచించారు. ప్రతి కేసులో పటిష్టమైన ఆధారాలను సేకరించి నిందితులకు చట్టపరమైన శిక్షలు పడేలా దర్యాప్తు నాణ్యత ఉండాలని స్పష్టం చేశారు.సీసీటీఎన్ఎస్ నమోదు విధానం, డిజిటల్ రికార్డుల నిర్వహణ, కోర్టు డిస్పోజల్ కేసుల ఫాలోఅప్, వారెంట్ల అమలు తదితర అంశాలపై కూడా సమీక్ష నిర్వహించారు.శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని, ప్రతి అధికారి ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు.ఈ తనిఖీల్లో డీఎస్పీ శివరాం రెడ్డి, టూ టౌన్ సీఐ రాఘవరావు తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంఘించిన ఆహార వ్యాపారులకు 7.91 లక్షల జరిమానా

**నల్లగొండ ప్రతినిధి, మే 31 (జనం సాక్షి) :** నల్లగొండ జిల్లాలో ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహార పదార్థాలు అందేలా ఫుడ్ సేఫ్టీ అధికారులు ఇటీవల కాలంలో మరింత చురుకుగా వ్యవహరిస్తున్నారు. ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం-2006 నిబంధనలను కచ్చితంగా అమలు చేయడంలో భాగంగా జిల్లాలోని వివిధ ఆహార వ్యాపార సంస్థలపై విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ ఉల్లంఘనలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆహార భద్రతా నిబంధనలను ఉల్లంఘించిన రిటైల్ దుకాణాలు, హోటళ్లు, కిరాణా షాపులు, తయారీ యూనిట్లు, పాల సేకరణ కేంద్రాలు (మిల్క్ సెంటర్లు), బేకరీలకు సంబంధించిన మొత్తం 20 అడ్జుడికేషన్ కేసులను విచారించిన అనంతరం నల్గొండ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె. శ్రీనివాస్ రూ.7,91,000 జరిమానా విధించారు.జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో ఆహార భద్రతా ప్రమాణాలకు విరుద్ధంగా వ్యవహరించిన వ్యాపారులను గుర్తించిన అధికారులు, సంబంధిత ఆధారాలతో కేసులు నమోదు చేసి అడ్జుడికేటింగ్ అధికారికి సమర్పించారు. అనంతరం జరిగిన విచారణలో కేసుల తీవ్రతను పరిశీలించి జరిమానాలు విధించినట్లు అధికారులు తెలిపారు.విచారణ సందర్భంగా సహాయ ఆహార నియంత్రణ అధికారి వి. జ్యోతిర్మయి, జిల్లా ఆహార భద్రతాధికారి ఎన్. శివశంకర్ రెడ్డి హాజరై కేసులకు సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించారు. ఆహార వ్యాపార సంస్థలు నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సిన అవసరాన్ని వారు వివరించారు.ఈ సందర్భంగా సహాయ ఆహార నియంత్రణ అధికారి వి. జ్యోతిర్మయి మాట్లాడుతూ, వినియోగదారులకు నాణ్యమైన మరియు సురక్షితమైన ఆహార పదార్థాలను అందించడం ప్రతి ఆహార వ్యాపార సంస్థ సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. వ్యాపారులు తమ వ్యాపార స్వరూపానికి అనుగుణంగా తప్పనిసరిగా ఫుడ్ లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ పొందాలని, పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలని, నాణ్యత లేని లేదా గడువు ముగిసిన ఆహార పదార్థాల విక్రయాన్ని పూర్తిగా నివారించాలని సూచించారు.జిల్లాలో ఫుడ్ సేఫ్టీ అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తుండటం గమనార్హం. ముఖ్యంగా హోటళ్లు, బేకరీలు, స్వీట్స్ తయారీ కేంద్రాలు, పాల ఉత్పత్తుల విక్రయ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఆహార నాణ్యతను పర్యవేక్షిస్తున్నారు. నిబంధనలు



పాటించని వ్యాపారులపై కేసులు నమోదు చేయడమే కాకుండా జరిమానాలు విధించడం ద్వారా ఇతరులకు కూడా హెచ్చరికగా నిలుస్తున్నాయి.ప్రజారోగ్యానికి హాని కలిగించే విధంగా వ్యవహరించే వారిపై భవిష్యత్తులో కూడా చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు. వినియోగదారుల ఆరోగ్య రక్షణే లక్ష్యంగా ఫుడ్ సేఫ్టీ విభాగం మరింత కఠినంగా వ్యవహరిస్తోందని తెలిపారు.

# తెలుగు జాతి ఆత్మగౌరవం ఎన్టీఆర్

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ఖమ్మం కార్పొరేషన్, మే 31 (జనం సాక్షి) :** తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహానేత నందమూరి తారక రామారావు అని, ఆయన చూపిన సేవా స్ఫూర్తితో సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఎన్టీఆర్ 103వ జయంతి సందర్భంగా కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో ఖమ్మంలోని స్వర్ణభారతి కమ్మవారి కళ్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి హాజరైన మంత్రి మాట్లాడుతూ, ఎన్టీఆర్ ఒక వ్యక్తి కాదని, తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత అని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఆయన అమలు చేసిన పథకాలు నేటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని, సామాజిక బాధ్యతతో కమ్మ మహాజన సంఘం చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని మంత్రి తెలిపారు. ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజానికి మరింత మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ శిబిరంలో కాన్సర్, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, చర్మవ్యాధులు, నేత్ర, స్త్రీరోగ, శిశు, ఈఎన్టీ, యూరాలజీ, న్యూరో తదితర విభాగాలకు చెందిన ప్రముఖ వైద్యులు సేవలు అందించారు. అలాగే రక్తపరీక్షలు, షుగర్, బీపీ, ఈసీజీ, ఎక్స్‌రే, మామోగ్రామ్ తదితర వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. మహిళలకు కాన్సర్ నిర్ధారణ పరీక్షల కోసం అత్యంత విలువైన వాహనాలను, పరికరాలను సంఘం సభ్యులు బత్తినేని ప్రకాష్ సమకూర్చారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. శిబిరం విజయవంతం కావడంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఖమ్మం శాఖ, కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్, వైద్యులు, దాతలు, స్వచ్ఛంద సేవకులు అందించిన సహకారం ప్రశంసనీయమని మంత్రి అన్నారు. కార్యక్రమం నిర్వహించిన కమ్మ మహాజన సంఘం ప్రతినిధులను మంత్రి అభినందించగా, శిబిరం విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా ఛైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మాజీ మేయర్ నీరజ, తుమ్మల యుగంధర్ కమ్మ మహాజన సంఘం అధ్యక్షుడు కొల్లు రఘు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి చావా రాము, ఉపాధ్యక్షురాలు కర్నాటి రమాదేవి, సహాయ కార్యదర్శి వజ్జా శ్రీనివాసరావు, కోశాధికారి తుళ్లూరి నిర్మలకుమారి, కార్యవర్గ సభ్యులు మోతుకూరి సత్యనారాయణ, నల్లమల ఆనంద్, మేదరమెట్ల స్వరూపరాణి, డాక్టర్ పోతినేని భూమేశ్వరరావు, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, కోలేటి నవీన్, నంబూరి ప్రసాద్, తాళ్లూరి మురళీకృష్ణ, బండి రవికుమార్, బతినేని ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# కాలేజ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- మంత్రి వెంకట్ రెడ్డి



**కనగల్లు, మే 31 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో ఆరు కోట్ల రూపాయల నిధులతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు భవనముల ఉ సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం జూనియర్ కళాశాల పనులను మంత్రి కల్యతిరిగి ఒక్కొక్కటిగా క్షుణ్ణంగా పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మంత్రి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతపేద విద్యార్థులకు విద్యను అందుబాటులో కి తేవడమే కాకుండా వారికి సరైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి కోట్ల రూపాయలు ఖర్చు చేసి అదునాతనమైన భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య కు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని గుర్తు చేస్తూ ఈ సంవత్సరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజన సౌకర్యాన్ని అమలు చేసి విద్యార్థులకు అందజేస్తామని స్పష్టం చేశారు. కళాశాల భవనం పూర్తి కావడానికి ఇంకా ఎంత సమయం పడుతుంది అధికారులను, గుత్తేదారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం శనివారం ప్రమాదవశాత్తు ఇసుక దిబ్బ కూలి చనిపోయిన కనగల్లు వా సి పాలకూరి సునీత పార్థివ దేహాన్ని సందర్శించి ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చి 50 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏ.వేద రక్షిత, ఆర్టిఏ జిల్లా సభ్యులు కె రాజిరెడ్డి, డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, ఎక్స్ జెడ్ పి టి సి లు నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, సిహెచ్ వెంకటేశం, సర్పంచులు నర్సింగ్ మురళీధర్ గౌడ్, ఓర్సు పెంటయ్య, పోష మల్ల సురేష్, వంపునాగమణి జానయ్య, ఎస్ఐ రాజీవ్ రెడ్డి, మాజీ సర్పంచులు నర్సింగ్ కృష్ణయ్య, బోగారి రాంబాబు, ఎండి హఫీజ్, ఎండి జియాఉద్దీన్, పందుల రాజా, మండలి చంద్రయ్య, మహేశ్వరం రమేష్, రమేష్, విద్యాశాఖ ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

## ట్రిబుల్ ఐటికి ఎంపికైన ముగ్గురు నూతనకల్ విద్యార్థులు





**నూతనకల్, మే 31 (జనంసాక్షి) :** శనివారం రాత్రి విడుదల చేసిన ట్రిబుల్ ఐటీ ఫలితాలలో మండలం లోని ముగ్గురు విద్యార్థినులు ట్రిబుల్ ఐటీకి ఎంపికయ్యారు మండల కేంద్రంలోని పీఎం శ్రీ ఉన్నత పాఠశాల నూతనకల్ విద్యార్థిని ఎస్ వర్షిత బాసర ట్రిబుల్ ఐటీ కి,నాగార్జున ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని నోముల శ్రీనిత ట్రిబుల్ ఐటీ ఫలితాల్లో మహబూబ్ నగర్ ట్రిబుల్ ఐటీ కి, పెదనేమిల ఉన్నత పాఠశాలకు చెందిన ఊరుకొండ పల్లవి బాసర ట్రిబుల్ ఐటీ కి ఎంపికైనట్లు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాములు నాయక్, శివయ్య, నాగార్జున ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ మారగాని వెంకట్ గౌడ్ ఆదివారం తెలిపారు ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు విద్యార్థుల తల్లిదండ్రులు ఇంతటి విజయాన్ని సాధించడానికి కావలసిన విజ్ఞానాన్ని అందించిన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు శనివారం విడుదల చేసిన ట్రిబుల్ ఐటీ కి ఈ విద్యార్థులు ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేయడంతో పాటు స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# చిరుమర్తిలో రోడ్డు విస్తరణ అరాచకం

- నోటీసులు లేవు పరిహారం మాట లేదు
- రాత్రికి రాత్రే ఇండ్లపై మార్కింగ్‌లు
- బైపాస్ రోడ్డు ఉండగా గ్రామం మధ్యలో ఎందుకు..?
- పేదల ఆవేదన పట్టని పాలకులు

**మాడ్గులపల్లి, మే 31 (జనం సాక్షి) :** నిలువ నీడ లేని నిరుపేదల ఇండ్లను ముందస్తు సమాచారం, ఎలాంటి ప్రభుత్వ నష్టపరిహారం లేకుండా కూల్చివేయాలని చూడటం అరాచకమని, అధికారుల నిరంకుశ వైఖరిని సహించేది లేదని చిరుమర్తి గ్రామ ప్రజలు హెచ్చరించారు మాడ్గులపల్లి నుండి గోరింకలపల్లి అడ్డదారి వరకు నిర్మిస్తున్న రెండు వరుసల రహదారి విస్తరణ పనుల పేరిట చిరుమర్తి గ్రామంలో ఇండ్లను ధ్వంసం చేసేందుకు అధికారులు, కాంట్రాక్టర్ వేసిన మార్కింగ్‌లపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు అధికారుల, కాంట్రాక్టర్ తీరుకు నిరసనగా గ్రామస్తులంతా ఏకమై గ్రామపంచాయతీ దగ్గర శనివారం ఉమ్మడి ఆందోళనకు దిగారు

ఈ సందర్భంగా బాధితులు, గ్రామ పెద్దలు మాట్లాడుతూ దశాబ్దాలుగా ఇరుకైన స్థలాల్లో ఇండ్లు కట్టుకుని జీవిస్తున్న తమకు, ఈ ఇండ్లు తప్ప వేరే ఆధారం లేదన్నారు చట్టప్రకారం ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, నష్టపరిహారం ఊసే ఎత్తకుండా రాత్రికి రాత్రే ఇండ్లపై మార్కింగ్‌లు (గుర్తులు) వేసి వెళ్లడం పేద ప్రజల పొట్టకొట్టడమేనని మండిపడ్డారు గతంలో ఇదే రహదారిని ఆర్ అండ్ బి శాఖ వారు 24 ఫీట్ల నుండి 12 ఫీట్లకు కుదించి, కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించారని గుర్తు చేశారు ఆ రోడ్డు వేసి కనీసం నాలుగు సంవత్సరాలు కూడా పూర్తి కాకముందే, మళ్లీ ఇండ్లను కూల్చి కొత్త రోడ్డు వేయాలనుకోవడం వెనుక ఏ శక్తుల స్వార్థం దాగి ఉందని గ్రామస్తులు నిలదీశారు ప్రభుత్వ ధనాన్ని ఇలా వృధా చేయడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు.

**బైపాస్ ఉండగా పేదలను రోడ్డున పడేస్తారా..?**

చిరుమర్తి గ్రామానికి ఇప్పటికే స్పష్టమైన బైపాస్ రోడ్డు అందుబాటులో ఉందని, గ్రామాభివృద్ధిని నిజంగా కాంక్షిస్తే ఆ బైపాస్ మార్గం ద్వారానే రహదారిని విస్తరించాలని డిమాండ్ చేశారు అలా కాకుండా పంతాలకు పోయి గ్రామం మధ్యలో



ఉన్న ఇండ్లను కూల్చాలని చూస్తే సహించేది లేదన్నారు ఒకవేళ ఇండ్లు తొలగించాల్సి వస్తే, చట్ట ప్రకారం ప్రభుత్వ నష్టపరిహారాన్ని పూర్తి స్థాయిలో చెల్లించిన తర్వాతే రోడ్డు పనులు తాకనిస్తామని స్పష్టం చేశారు ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బైపాస్ రోడ్డు ద్వారా పనులు జరపాలని, లేనిపక్షంలో బాధితులందరినీ సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు చేపడుతామని చిరుమర్తి గ్రామ ప్రజలు హెచ్చరించారు.




# స్వల్పకాలిక లక్ష్యాలకు డెట్ ఫండ్లు ఉత్తమం

- ఆర్‌బీఐ వడ్డీ రేట్లు పెంచకపోవచ్చు
- మిరే అసెట్ ఫిక్స్‌డ్ ఇన్‌కం హెడ్ బసంత్ బాఫ్నా



**న్యూఢిల్లీ:**ప్రపంచవ్యాప్త భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణ భయాలు మన స్టాక్‌మార్కెట్లనూ వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈక్విటీతో పాటు స్థిరాదాయ పథకాల ద్వారా సరైన వైవిధ్యాన్ని పాటించాలని, మిరే అసెట్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ ఫిక్స్‌డ్ ఇన్‌కం హెడ్ బసంత్ బాఫ్నా సూచించారు. పెట్టుబడులను కాపాడుకుంటూ, ఆర్థిక లక్ష్యాలను సాధించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేయాలని 'ఈనాడు' ఇంటర్వ్యూలో సూచించారు. ఆ వివరాలివీ.. గత డిసెంబరుకు 6.8% వద్ద ఉన్న బాండ్ల రాబడులు, మార్చి నెలాఖరుకు 7.3-7.4 శాతానికి చేరుకున్నాయి. ప్రస్తుతం ఏడాది విభాగంలో రాబడి 7.8-7.9% స్థాయికి చేరింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణ భయాల వల్ల పెట్టుబడిదారులు నగదు లేదా షార్ట్ టర్మ్ పెట్టుబడులపై ఆసక్తి చూపడమే దీనికి కారణం. కార్పొరేట్ సంస్థలకు మార్కెట్ కంటే తక్కువ వడ్డీకే రుణాలిచ్చిన బ్యాంకుల వద్ద అదనపు నగదు కరిగిపోయింది.ఎల్- నినో ప్రభావం వల్ల పప్పుధాన్యాలు, కూరగాయల ధరలు పెరిగే అవకాశం ఉన్నా.. గోధుమలు, బియ్యం ఉత్పత్తిలో గత 10 ఏళ్లుగా మన దేశం మిగులు సాధించింది. చమురు ధరల పెరుగుదల, ప్రతికూల రుతుపవనాల వల్ల ద్రవ్యోల్బణంపై 40-50 బేసిస్ పాయింట్ల ప్రభావం పడినా, అది సుమారు 5.5-5.6 శాతంగా ఉంటుంది. ఇది ఆర్‌బీఐ నిర్దేశించిన పరిమితికి లోబడే ఉన్నందున వడ్డీ రేట్లను పెంచకపోవచ్చు. వడ్డీ రేట్లను పెంచే బదులు, ప్రవాస భారతీయుల పథకాల ద్వారా విదేశీ నిధులను సమీకరించడం వంటి ప్రత్యామ్నాయాలను ఆర్‌బీఐ అన్వేషించాలి.అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే, మన దేశ వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉండటం వల్ల సిద్ధాంతపరంగా రూపాయి విలువలో పతనం సహజం. మన ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువ కాబట్టి, ఎప్పుడూ కరెన్సీ లోటు ఉంటుంది. దీన్ని భర్తీ చేయడానికి అవసరమైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐ), విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు (ఎఫ్‌పీఐ) ఆశించిన స్థాయిలో రావడం లేదు. భవిష్యత్తులో విదేశీ పెట్టుబడిదారుల బాండ్లపై విత్‌హోల్డింగ్ పన్ను తగ్గించడం లేదా బ్లూమ్‌బర్గ్ బార్క్‌లేస్ గ్లోబల్ ఇండెక్స్‌లో మన దేశాన్ని చేర్చడం వంటివి జరిగితే విదేశీ నిధులు తిరిగి మన దేశంలోకి వచ్చే అవకాశం ఉంది.పెట్టుబడిదారులు తమ ఆర్థిక లక్ష్యాలు, సమయాన్ని బట్టి పథకాలను ఎంచుకోవాలి. మీ జీతం బ్యాంకు ఖాతాలో ఉంటే పెద్దగా వడ్డీ రాదు, కానీ అదే డబ్బును 15 రోజుల పాటు లిక్విడ్ ఫండ్లలో పెడితే 6.5% వడ్డీ పొందొచ్చు. మీరు మూడు నెలల తర్వాత విహార యాత్రకు వెళ్లాలనుకున్నారు.. లేదా 7-8 నెలల తర్వాత బీమా ప్రీమియంలాంటివి చెల్లించాలి.. ఇలాంటప్పుడు ఆ మొత్తాలను ఆ వ్యవధికి సరిపోయే డెట్ ఫండ్లలో మదుపు చేసుకోవచ్చు. దీని ద్వారా సుమారు 7.5% రాబడి పొందొచ్చు. ఎఫ్‌డీలను మధ్యలో తీసుకుంటే అపరాధ రుసుము చెల్లించాలి. లిక్విడ్ ఫండ్లలో ఇలాంటి ఇబ్బంది ఉండదు. కావాల్సినప్పుడు డబ్బు వెనక్కి తీసుకోవచ్చు. మీ ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా, ఎంత చిన్న మొత్తమైనా వీటిలో మదుపు చేసుకోవచ్చు. స్థిరాదాయ పథకాలైన డెట్ ఫండ్లపై అవగాహన పెరగాల్సి ఉంది. చాలా మంది 11-13% రాబడి ఆశించి ఈక్విటీలను ఎంచుకుంటున్నారు. పిల్లల పెళ్లి లేదా చదువు కోసం 20 ఏళ్ల దీర్ఘకాలిక లక్ష్యంతో పెట్టుబడి పెడితే, భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధితో పాటు, ఈక్విటీ ఫండ్లలో 12 - 15% రాబడి ఇవ్వగలవు. కానీ, స్వల్పకాలిక అవసరాలకు ఈక్విటీల్లో మదుపు చేస్తే, మార్కెట్ హెచ్చుతగ్గుల్లో నష్టాలు రావచ్చు.

## చమురు ధరలు దిగొచ్చాయ్.. డీజిల్ ధరలనూ తగ్గించండి

ప్రభుత్వానికి ఏఐఎంటీసీ విజ్ఞప్తి



**దిల్లీ:** అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినందున డీజిల్ ధరలను తగ్గించాలని, తద్వారా దేశీయ రవాణా రంగానికి ఉపశమనం కల్పించాలని ప్రధాని మోదీకి ఆల్ ఇండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ (ఏఐఎంటీసీ) విజ్ఞప్తి చేసింది. అధిక ఇంధన ధరల కారణంగా దేశవ్యాప్తంగా తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని ఏఐఎంటీసీ జాతీయ అధ్యక్షుడు హరీశ్ సబర్వాల్ తెలిపారు. వాణిజ్య వాహనాల నిర్వహణ వ్యయంలో దాదాపు 60 శాతం వరకు డీజిల్‌దే ఉంటుండటం వల్ల, అధిక ఇంధన ధరల కారణంగా ట్రక్కులు, చిన్న వాణిజ్య వాహనాల యజమానులు, డ్రైవర్లు, వారి కుటుంబాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతోందని తెలిపారు. ఇంధన ధరలు పెరగడం వల్ల రవాణా వ్యయాలు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకూ దారితీస్తోందన్నారు.

## ఫిన్‌టెక్ రంగంలోకి ఎల్‌ఐసీ

సీఈఓ దొరైస్వామి

దిల్లీ: ప్రభుత్వరంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఫిన్‌టెక్ రంగంలోకి ప్రవేశించాలనుకుంటోంది. డిజిటల్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో వ్యూహాత్మక పెట్టుబడులు లేదా ఆర్గానిక్ మార్గంలో ఫిన్‌టెక్ విభాగాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు కంపెనీ సీఈఓ, ఎండీ ఆర్ దొరైస్వామి తెలిపారు. ఆధునిక అవసరాలను తీర్చడానికి, నూతన ఆవిష్కరణల కోసం అటు ఫిన్‌టెక్, ఇటు ఇన్సూరెన్స్‌టెక్ కంపెనీలతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశలపై మాట్లాడారు.కేవలం బీమా వ్యాపారమే కాకుండా దేశంలోనే అతిపెద్ద ఆర్థిక సంస్థగా ఎల్‌ఐసీ ఉందని, అనేక పెద్ద పెద్ద కంపెనీల్లో ఇప్పటికే పెట్టుబడులు పెట్టిందన్నారు. పాలసీదారులకు మెరుగైన ప్రతిఫలం అందించేందుకు ప్రత్యేకమైన సంస్థల్లో వ్యూహాత్మక పెట్టుబడులకూ ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. డిజిటల్ టెక్నాలజీని ఎల్‌ఐసీ వేగంగా అందిపుచ్చుకుంటోందని చెప్పారు. తమ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా సొంతంగానే తమ బిజినెస్ అప్లికేషన్లను తయారు చేసుకుంటున్నామని వెల్లడించారు. అదే సమయంలో కొత్త కొత్త ప్లాట్‌ఫామ్‌లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం ఇతర ఐటీ సర్వీస్ ప్రొవైడర్లతోనూ కలిసి పనిచేస్తున్నామని చెప్పారు. ఫిన్‌టెక్ రంగంలో పోటీలో నిలదొక్కుకోవాలంటే ఐటీ అప్లికేషన్‌లను ఆధునికీకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎల్‌ఐసీలో తదుపరి వాటాల విక్రయంపై ప్రశ్నించగా.. పబ్లిక్ షేర్‌హోల్డింగ్ పరిమితిని పెంచేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని చెప్పారు.

## చిన్న స్మార్ట్‌ఫోన్ కోసం చూస్తున్నారా?

## బెస్ట్ ఆప్షన్లు ఇవే..



**న్యూఢిల్లీ:**స్మార్ట్‌ఫోన్ వినియోగదారుల అభిరుచులు మారుతున్నాయి. పెద్ద పెద్ద ఫోన్ల కంటే చేతిలో సులువుగా ఇమిడిపోయే కాంపాక్ట్ ఫోన్ల వైపు మొగ్గు చూపుతున్నారు చిన్న డిస్‌ప్లే, పాకెట్‌లో ఇట్టే ఇమిడిపోయేలా, చేత్తో పట్టుకునేటప్పుడు సౌకర్యవంతంగా ఉండే స్మార్ట్‌ఫోన్‌ను కోరుకుంటున్నారు. వినియోగ దారుల అభిరుచిని పసిగట్టిన కొన్ని కంపెనీలు ఈ మధ్య కాలంలో చిన్న సైజు ఫోన్లను విడుదల చేస్తున్నాయి. వీటి డిస్‌ప్లే కేవలం 6.3 అంగుళాలు లేదా అంతకన్నా తక్కువగానే ఉంటోంది. అలా మార్కెట్‌లో అందుబాటులో ఉన్న బుల్లిఫోన్‌ల సంగతులు ఇప్పుడు చూద్దాం..

**యాపిల్:** యాపిల్ నుంచి వస్తున్న అతి చిన్న ఫోన్ 17వ. ఇది కేవలం 6.1 అంగుళాల సూపర్ రెటీనా ఎక్స్‌డీఆర్ డిస్‌ప్లేతో వస్తోంది. ఏ19 చిప్‌తో పనిచేస్తుంది. 48 ఎంపీ ప్రధాన కెమెరా+ 12 ఎంపీ ఫ్రంట్ కెమెరాతో వస్తున్న ఈ ఫోన్.. 256జీబీ వేరియంట్ ధర రూ.64,900, 512జీబీ వేరియంట్ ధర రూ.84,900.

వివో: నుంచి ఇటీవల కాలంలో లాంచ్ అయిన కాంపాక్ట్ ఫోన్ ఎతిలనీ చీ300 ఈఇ. ఇందులో 6.31 అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లే ఉంది. ఆక్టాకోర్ స్నాప్‌డ్రాగన్ 8 జెన్ 5 ప్రాసెసర్, 50 ఎంపీ ప్రధాన కెమెరా+ 50 ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా+ 8ఎంపీ అల్ట్రావైడ్ కెమెరా+ 50 ఎంపీ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. 6500ఎంఏహెచ్ బ్యాటరీ కలిగిన ఈ ఫోన్ ధర రూ.79,999 నుంచి ప్రారంభమవుతుంది.

ఐఫోన్: ఐఫోన్ నుంచి ఉన్న మరో ఆప్షన్ ఐఫోన్ 17. ఇది 6.3 అంగుళాల సూపర్ రెటీనా ఎక్స్‌డీఆర్ డిస్‌ప్లేతో వస్తోంది. యాపిల్ ఏ19 చిప్‌సెట్ ఉంది. 48 ఎంపీ ప్రధాన కెమెరా+ 40 ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా+ 18ఎంపీ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. 256ఉః వేరియంట్ ధర రూ.82,900, 512జీబీ వేరియంట్ ధర రూ.1,02,900. కాస్త బడ్జెట్ ఎక్కువ పెట్టగలిగిన వారు దీన్ని పరిశీలించొచ్చు.

గూగుల్ పిక్సెల్: గూగుల్ పిక్సెల్ ప్రియుల కోసం గూగుల్ పిక్సెల్ 9జీ అందుబాటులో ఉంది. ఇది 6.3 అంగుళాల డిస్‌ప్లే, టెన్సర్ జీ4 ప్రాసెసర్‌తో వస్తోంది. 48 ఎంపీ ప్రధాన కెమెరా+ 13 ఎంపీ అల్ట్రావైడ్ కెమెరా+13 ఎంపీ ఫ్రంట్ కెమెరా ఉంది. 5,100ఎంఫ్త్ర బ్యాటరీ, 23చి వైర్డ్ ఫాస్ట్ ఛార్జింగ్ ఇచ్చారు. వేరియంట్ ధర రూ.49,999. రూ.50 వేల బడ్జెట్‌లో కాంపాక్ట్ ఫోన్ కోరుకునే వారికి బెస్ట్ ఆప్షన్.ఒప్పో: ఒప్పో నుంచి రెనో సిరీస్‌లో ఖీవనినీ 15 ఖతీనీ ఓతినితి 5ఉ అందుబాటులో ఉంది. 6.32 అంగుళాల 1.5ఐ ఎల్‌టీపీఎస్ అమోలెడ్ డిస్‌ప్లే, మీడియాటెక్ డైమెన్సిటీ 8450 ప్రాసెసర్. 200ఎంపీ ప్రధాన కెమెరా+ 50 ఎంపీ అల్ట్రావైడ్ కెమెరా+ 50ఎంపీ పెరిస్కోప్ కెమెరా+ 50 ఎంపీ సెల్ఫీ కెమెరా ఉన్నాయి. 6,200ఎంఫ్త్ర బ్యాటరీ, 80చి వైర్డ్ ఛార్జింగ్ సదుపాయం కలిగిన ఈ ఫోన్ 12ఉః + 256జీబీ వేరియంట్ ధర రూ.59,999.

## వినియోగ గిరాకీకి సవాళ్లు ఎదురు కావొచ్చు!

ఆర్థిక శాఖ నెలవారీ నివేదిక

దిల్లీ: సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, ఆర్థిక కార్యకలాపాలు మందగించే అవకాశం ఉందని అంచనాలు వస్తున్న నేపథ్యంలో, వచ్చే నెలల్లో వినియోగ గిరాకీకి సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని ఆర్థిక మంత్రిత్వ శాఖ శనివారం ఒక నివేదికలో తెలిపింది. దేశీయ మౌలిక అంశాలు స్థూలంగా చెక్కుచెదరకుండా ఉన్నాయని, తయారీ, సేవల రంగాల పీఎంఐలు వృద్ధి దశలో ఉన్నాయని వెల్లడించింది. కార్మిక విపణి స్థిరంగా ఉందని, బయటి అవాంతరాల నుంచి విదేశీ మారకపు నిల్వలు గణనీయమైన రక్షణను అందిస్తున్నాయని తాజా నెలవారీ ఆర్థిక సమీక్షలో మంత్రిత్వ శాఖ వివరించింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు ప్రారంభమైనప్పటి నుంచి అంతర్జాతీయ వాతావరణం సవాలుగా మారిందని తెలిపింది. పెరిగిన ముడి చమురు ధరలు, కఠినమవుతున్న ఆర్థిక పరిస్థితులు, ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో బలహీన పడుతున్న వృద్ధి వేగం వంటి ప్రతికూలతల నుంచి భారత్ పూర్తిగా బయటపడలేదని పేర్కొంది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,43,950 | ₹ 1,57,040 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,95,000

# చైనాపై అమెరికా మెత్తబడిందా?

### షాంగ్రిలా సదస్సులో బాణీ మార్చిన అగ్ర దేశ రక్షణ మంత్రి హెగ్సెత్



**సింగపూర్:** పసిఫిక్ ప్రాంతంలోని తమ భాగస్వామ్య దేశాల భద్రతకు అమెరికా కట్టుబడి ఉందని సింగపూర్‌లో జరిగిన షాంగ్రిలా సదస్సులో అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ఉద్ఘాటించారు. గతేడాది సదస్సులో చైనా తన సైనిక దళాలను మరింత బలోపేతం చేసుకోవడంవల్ల ఎదురవుతున్న ముప్పుల గురించి, తైవాన్‌పట్ల డ్రాగన్ దూకుడు గురించి మాట్లాడి ఆయన బీజింగ్ ఆగ్రహానికి గురయ్యారు. అయితే ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బీజింగ్‌లో చైనా అధినేత షీ జిన్‌పింగ్‌తో సమావేశమైన తరవాత హెగ్సెత్ బాణీ కొంత మారింది. చైనాను ముప్పుగా అభివర్ణిస్తూ గతంలో చేసిన వ్యాఖ్యల తీవ్రతను ఈసారి తగ్గించారు. సింగపూర్‌లో షాంగ్రిలా సదస్సులో ఆయన మాట్లాడుతూ.. పసిఫిక్ ప్రాంతం అమెరికా భద్రత, శ్రేయస్సులకు కీలకమైనదని, ఇక్కడ శాశ్వతంగా సానుకూల బలాబలాల సమతుల్యతను సాధించడానికి అమెరికా కట్టుబడి ఉందని తెలిపారు. ఇండో-పసిఫిక్‌ను చైనా శాసించకుండా చూసుకోవడం ఇప్పటికీ అమెరికా ప్రాధాన్యత అని తెలిపారు. ఈ సదస్సుకు హాజరైన అమెరికా ప్రతినిధి బృందంలో సభ్యురాలైన ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీ సెనేటర్ టామీ డక్‌వర్త్, ట్రంప్ ప్రభుత్వం చైనాతో 'అతి సాన్నిహిత్యం' ప్రదర్శిస్తోందని ఆరోపించారు. 'ఇండో-పసిఫిక్ భద్రతకు అమెరికా నిబద్ధతను పణంగా పెట్టి, ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో ప్రారంభించిన యుద్ధాలవైపు ట్రంప్ సర్కారు మళ్లుతోందని ఆందోళన చెందుతున్నా' అని ఆమె వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ వల్ల భారత్-పాకిస్థాన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతను ఉపశమింపజేసి, రెండు దేశాల మధ్య శాంతిని నెలకొల్పడానికి తమ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తోడ్పడ్డారని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేర్కొన్నారు. అదే సమయంలో ఇండో-పసిఫిక్ వ్యూహంలో అమెరికాకు భారత్ కీలక భాగస్వామి అని ఉద్ఘాటించారు. భారతదేశ సైనిక, పారిశ్రామిక సామర్థ్యాలు పెరుగుతున్నాయని అన్నారు. భారతదేశం తన సాయుధ దళాలను ఆధునికీకరిస్తోందని, హిందూ మహాసముద్ర ప్రాంతంలో బలాబలాల సమతుల్యతను కాపాడటానికి తోడ్పడుతోందని ఆయన చెప్పారు. భారత్‌తో కలసి ఉమ్మడిగా ఆయుధోత్పత్తి సాగించడానికి కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. చైనా సహా ఏ దేశమూ ఇండో-పసిఫిక్ లో ఆధిపత్యం చలాయించకుండా చూడటమే తమ ఇండో-పసిఫిక్ వ్యూహమని వివరించారు. అదే సమయంలో, చైనా సైనికంగా బలోపేతం కావడంపై ఆందోళనలు ఉన్నప్పటికీ, బీజింగ్‌తో తాము ఘర్షణ కోరుకోవడం లేదని హెగ్సెత్ చెప్పారు.

# కృత్రిమ మేధతో కలిసి పనిచేయడం నేర్చుకోవాలి

- సంప్రదాయ కోడింగ్ శకం ముగిసినట్లే
- గూగుల్ మాజీ సీఈఓ ఎరిక్ షమిట్



**న్యూఢిల్లీ:**'సాఫ్ట్‌వేర్ అంటే కోడింగ్ బాగా వచ్చి ఉండాలి' అన్నది నిన్నటి మాట. ప్రోగ్రామర్లు కుస్తీలు పడి కోడ్ లైన్ రాసే యుగం ఇక అంతరించినట్లేనని గూగుల్ మాజీ సీఈఓ ఎరిక్ షమిట్ అభిప్రాయపడ్డారు. సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేసే విషయంలో కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత వేగంగా మార్పులు తీసుకొస్తోందని వివరించారు. స్పెషల్ కాంపిటీటివ్ స్టడీస్ ప్రాజెక్ట్ పంచుకున్న ఒక షార్ట్ వీడియోలో ఎరిక్ పలు అంశాలపై ఏమన్నారంటే..ఐటీ ఇంజినీర్లు ఇంకా పాత పద్ధతుల్లో కోడింగ్ చేయడాన్ని ఆపేయాలి. ఎందుకంటే ఏఐ సిస్టమ్స్ సొంతంగా కోడ్‌ను సృష్టించే సామర్థ్యాన్ని పెంచుకుంటున్నాయి. ప్రోగ్రామర్లు ఇక ఏఐ టూల్స్‌కు మార్గనిర్దేశం ఇస్తూ, పర్యవేక్షించే దిశగా అడుగులు వేయాలి. ప్రతి ఇన్‌స్ట్రక్షన్‌ను సొంతంగా, మాన్యువల్‌గా రాయడం ఆపేయాలి. గతేడాది చివరి నుంచి చాలా మంది అగ్రగామి ఇంజినీర్లు తమ కోడింగ్‌లో చాలా భాగాన్ని సొంతంగా రాయడం ఆపేశారు. ఏం కావాలో ఏఐ టూల్స్‌కు వివరిస్తే, సాఫ్ట్‌వేర్‌లో చాలా భాగాన్ని మనుషుల కంటే వేగంగా సిద్ధం చేస్తున్నాయి. 50 ఏళ్ల పాటు ప్రోగ్రామింగ్‌లోనే గడిపిన నాకు, ఈ వేగవంతమైన మార్పులు కొద్ది పాటి శోకాన్ని కలిగిస్తున్నాయి. మేనేజర్లు ఇక తమ బృందాన్ని 'ఆరు నెలల కిందట చేసినట్లు కోడింగ్ ఇంకా ఎందుకు రాస్తున్నార'ని అడగాల్సిన తరుణం ఆసన్నమైంది. ఇపుడు డెవలపర్లు కేవలం పర్యవేక్షించడం, టెస్టింగ్ చేయడం, ఏఐ అందించిన అవుట్‌పుట్‌ను మరింత రిఫైనింగ్ చేయడం వంటివాటిపై దృష్టి పెట్టాలి. అంతే కానీ మొదటి నుంచీ సాఫ్ట్‌వేర్ మొత్తాన్నీ రాసుకుంటూ పోకూడదు. ఏఐ వ్యవస్థలను అర్థం చేసుకుని, సరైన ప్రశ్నలు అడగడం కూడా నేర్చుకోవాలి. ఇదే భవిష్యత్ ప్రోగ్రామింగ్‌కు కీలక నైపుణ్యంగా మారనుంది. పరిశ్రమల్లో వేగంగా మార్పులుఏఐ రాకతో సాఫ్ట్‌వేర్ ఉత్పాదకత పెరగనుంది. దీని వల్ల వ్యక్తులు అత్యంత అద్భుతమైన అప్లికేషన్లను సృష్టించే అవకాశం వస్తోంది. అంతక్రితం మొత్తం ఇంజినీర్ల బృందం ఎక్కువ సమయం పాటు కష్టపడితే కానీ అప్లికేషన్ల సృష్టి జరిగేది కాదు. ఏఐ వల్ల ప్రోగ్రామింగ్ ఉద్యోగాలు పూర్తిగా పోవు. ఏఐతో కలిసే సాఫ్ట్‌వేర్ డెవలపర్లు పనిచేయాల్సి ఉంటుంది.

## పాత ఆభరణాలిచ్చి కొత్తవి తీసుకుందాం

### పసిడి కొనుగోలుదార్లలో మారుతున్న ధోరణి

**న్యూఢిల్లీ:**పసిడి ధర అధిక స్థాయిల్లో కొనసాగుతుండటంతో కొత్త ఆభరణాలు కొనేందుకు పూర్తి మొత్తాన్ని వెచ్చించడానికి బదులు.. పాత వాటినే మార్చేసి, ఆ వచ్చిన డబ్బులకు మరికొంత కలిపి కొత్తవి తీసుకుందామనే ధోరణి ఇటీవల కొనుగోలుదార్లలో పెరుగుతోంది. పాత ఆభరణాలను మార్చి కొత్తవి తీసుకోవాలనే ఆలోచన ఇప్పటిదేమీ కాదు. అయితే ప్రజల్లో నెలకొన్న కొన్ని సందేహాలు, భయాల కారణంగా పసిడి ఆభరణాల మార్పిడి విషయంలో వాళ్లు వెనకడుగు వేస్తుంటారు. పసిడి స్వచ్ఛతను సరిగ్గా నిర్ధారిస్తారా? వేరొక నగల వ్యాపారి వద్ద కొన్న ఆభరణాలకు సరైన ధర ఇస్తారా? ఏవేవో రుసుముల పేరుతో ఛార్జీలు వేసి తుది విలును తగ్గిస్తారా? అనే విషయాలపై ప్రజలు ఆందోళన చెందుతుంటారు. పాత ఆభరణాలను మార్చుకునే కుటుంబం అది నెక్లెస్ కావచ్చు లేదా ఏళ్ల పాటు దాచిపెట్టిన చిన్న, విరిగిన ముక్క కావచ్చు.. అందులోని ప్రతి గ్రాముకూ సహేతుక విలువను పొందాలనే కోరుకుంటుంది.పసిడి ధర అధిక స్థాయిల్లో కొనసాగుతున్నప్పుడు.. పాత ఆభరణాలను మార్చి కొత్తవి తీసుకోవడం మంచి ఆలోచనేనా? అంటే అవుననే అభిప్రాయం వినిపిస్తోంది. ప్రస్తుత అధిక ధరల వద్ద కొత్త డిజైన్లతో కూడిన ఆభరణాల కొనుగోలు కోసం.. పాత ఆభరణాల విలువను ఉపయోగించుకోవడానికి బంగారం మార్పిడి ప్రజలకు వీలు కల్పిస్తుంది. ఇది కొనుగోలు ఒత్తిడిని తగ్గించడంతో పాటు ఇప్పటికే ఉన్న పుత్తడి ఆస్తులను మరింత ఉపయోగకరంగా మారుస్తుంది. ఇది దేశానికి కూడా విస్తృత ప్రయోజనం చేకూరుస్తుంది. దేశం ప్రతి సంవత్సరం భారీ పరిమాణంలో బంగారాన్ని దిగుమతి చేసుకుంటున్నందున, పాత ఆభరణాలను రీసైక్లింగ్ చేయడం, మార్పిడి చేసుకోవడం ద్వారా కొత్త దిగుమతులపై ఆధారపడటం తగ్గి, విదేశీ మారక నిల్వల వాడకాన్ని తగ్గిస్తుంది. దీనివల్ల పాత ఆభరణాల మార్పిడి అనేది కొనుగోలుదార్లకు భారాన్ని తగ్గించే ఆర్థికపరమైన నిర్ణయమే కాకుండా.. భారతదేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో పాలుపంచుకోవడానికి మరింత సమర్థమైన, సుస్థిరమైన మార్గంగా కూడా మారుతోంది.

## పెట్టుబడులకు ప్రాథమిక సూత్రాలివే..




**న్యూఢిల్లీ:**చాలా మంది కొత్తగా పెట్టుబడులు పెట్టేవారు తమకు ఉన్నంతలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతుంటారు. అయితే, అన్ని పెట్టుబడులు బ్యాంకు/పోస్టాఫీసుల్లో మదుపు చేసినంత సులభం కాదు. ఎక్కువ ఆర్థిక ప్రయోజనాలు చేకూరే పెట్టుబడులకు పరిశోధన, ఓపిక, శ్రద్ధ అవసరం. తమ ఆర్థిక ప్రయాణాన్ని కొత్తగా ప్రారంభించిన నూతన పెట్టుబడిదారులు ఎక్కడ పెట్టుబడి పెట్టాలో నిర్ణయించుకోవడం కొన్నిసార్లు వారికి గందరగోళంగా ఉంటుంది. మీరు అటువంటి సందిగ్ధతను ఎదుర్కొన్నట్లయితే, పెట్టుబడులకు సంబంధించి ఈ ప్రాథమిక సూత్రాలను అవగాహన చేసుకోండి.

**తెలిసిన రంగం:**మీరు పెట్టుబడులు పెట్టేటప్పుడు మీకు బాగా తెలిసిన రంగాన్ని ఎంచుకోవడం మేలు. మీకు ఒక కంపెనీ లేదా రంగంపై అవగాహన ఉన్నప్పుడు, దానికి సంబంధించిన నష్టభయం కూడా మీకు తెలిసే ఉంటుంది. దీనివల్ల, మీరు సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోవడం సులభం అవుతుంది. ఉదాహరణకు, యుక్తవయసులో ఉన్నవారికి బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ లేదా ఐటి రంగాలపై తగిన అవగాహన ఉంటుంది. కాబట్టి, వీరు పెట్టుబడులకు ఇలాంటి రంగాలను ఎంచుకోవడం మంచిదే, సురక్షితం కూడా. అలా కాకుండా, కనీస అవగాహన లేకుండా ఎవరో చెప్పారనో, సోషల్ మీడియా ప్రకటనలు చూసో డెరివేటివ్‌లు లేదా క్రిప్టోకరెన్సీలు వంటి సంక్లిష్టమైన రంగాలలో పెట్టుబడి పెట్టడం వల్ల నష్టం గణనీయంగా ఉండొచ్చు, డబ్బు కోల్పోయే అవకాశాలు కూడా ఎక్కువ. తెలిసిన ప్రొడక్ట్ లేదా కంపెనీలో పెట్టుబడి పెట్టడం వల్ల కలిగే ప్రయోజనం ఏంటంటే, మీరు వాటికి సంబంధించిన వ్యాపార నివేదికలు, కార్యకలాపాలను సులభంగా అర్థం చేసుకోగలరు. కాబట్టి, కొత్తగా పెట్టుబడులు పెట్టేవారు బాగా తెలిసిన వాటిపై దృష్టి పెట్టండి.

**ఇండెక్స్ ఫండ్లు:**తక్కువ ఖర్చుతో కూడిన ఇండెక్స్ ఫండ్లలో పెట్టుబడి పెట్టడం మేలని ఆర్థిక నిపుణుల మాట. కొత్తగా పెట్టుబడి పెట్టేవారికి ఇది మంచి ఎంపిక. ఇవి మీ పెట్టుబడిని అనేక కంపెనీలలో విస్తరించి, నష్టభయాన్ని తగ్గిస్తాయి. అలా కాకుండా, మీరు 30-40 వేర్వేరు స్టాక్స్ కొనుగోలు చేసారనుకుందాం. మార్కెట్ పరిస్థితుల వల్ల..గందరగోళం, నష్టాలు రెండూ పెరగవచ్చు. కొత్తగా ఈక్విటీ పెట్టుబడులు ఆరంభించే వారికి నిఫ్టీ 50 లేదా సెన్సెక్స్ ఇండెక్స్ ఫండ్లు కీలకమైనవి. ఈ ఫండ్లు మార్కెట్‌లోని ప్రధాన కంపెనీలను ట్రాక్ చేస్తాయి. వీటిని మేనేజ్ చేయడానికి ఫండ్ హౌస్‌లకు తక్కువ ఖర్చవుతుంది. కాబట్టి, మీకు ఖర్చులు తగ్గి రాబడి పెరుగుతుంది. దీనికి భిన్నంగా, అనేక యాక్టివ్ మ్యూచువల్ ఫండ్లలో అధిక ఫీజులు, ఖర్చులు ఉంటాయి. ఈ ఖర్చులు దీర్ఘకాలంలో రాబడులను గణనీయంగా తగ్గిస్తాయి. దీర్ఘకాలంగా పెట్టుబడులు పెట్టే సగటు పెట్టుబడిదారులకు ఇండెక్స్ ఫండ్లు అత్యంత తెలివైన ఎంపిక.

**దీర్ఘకాలం:**మెరుగైన పెట్టుబడికి సుదీర్ఘ సమయమే కీలకం కానీ, సమయపాలన కాదు అని గుర్తుంచుకోండి. దీర్ఘకాలం పాటు పెట్టుబడిని కొనసాగిస్తే మెరుగైన రాబడి లభించే అవకాశముంటుంది. కొత్తగా పెట్టుబడి పెట్టేవారు మెరుగైన మ్యూచువల్ ఫండ్లు లేదా స్టాక్స్‌ను ఎంచుకున్నప్పుడు, వాటిని 10-15 సంవత్సరాల పాటు ఎలాంటి ఆందోళన లేకుండా కొనసాగించాలి. కాబట్టి, మదుపర్లు స్వల్పకాలిక హెచ్చుతగ్గులకు భయపడకుండా దీర్ఘకాలికంగా పెట్టుబడులు కొనసాగించడం మేలు. ఈక్విటీ మార్కెట్లో పెట్టుబడులు కనీసం 10 ఏళ్లు ఉన్నప్పుడు నష్టభయం ఉండే అవకాశం చాలా తక్కువ.

**లక్ష్యాలు, కాలపరిమితి:**మీరు పెట్టుబడులు పెట్టేటప్పుడు, ఎంత కాలం పాటు పెట్టుబడి పెడతారో జాగ్రత్తగా ఆలోచించండి. మీ లక్ష్యాలను కాలపరిమితి పరంగా వర్గీకరించండి. మీ లక్ష్యాలను స్వల్ప, మధ్యకాలిక, దీర్ఘకాలికంగా విభజించడం మేలు. మీ పెట్టుబడిని 5 లేదా పది సంవత్సరాలు, లేదా అంతకంటే ఎక్కువ కాలం పాటు ఉంచడానికి సిద్ధంగా ఉంటేనే మార్కెట్ల వైపు చూడండి. ఉదాహరణకు, పదవీ విరమణ లేదా పిల్లల విద్య, వారి వివాహం వంటి దీర్ఘకాలిక లక్ష్యాలను చేరుకోవడానికి ఈక్విటీ పెట్టుబడులు సరైనవి. అయితే, మీకు నగదు త్వరగా అవసరమయ్యే అవకాశం ఉంటే, బ్యాంకు ఎఫ్‌డీలు సరైనవి.

**సిప్:**పెట్టుబడిని మీ నెలవారీ బడ్జెట్‌లో భాగంగా పరిగణించాలి. కాబట్టి, క్రమం తప్పకుండా పెట్టుబడి పెట్టడం మంచిది. గణనీయమైన మొత్తాన్ని కూడబెట్టడానికి సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ ఒక గొప్ప ఆలోచన. ఒకేసారి పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టే వ్యక్తికి, ఆరు నెలల పాటు ప్రతి నెలా అదే మొత్తాన్ని పెట్టుబడి పెట్టే విధానంలో వ్యత్యాసం ఉంటుంది. పెట్టుబడి పెట్టిన కొన్ని రోజుల్లోనే మార్కెట్ క్రాష్ అయినప్పుడు సిప్ చేసే వ్యక్తి పెద్దగా నష్టపోడు. సిప్‌లో ప్రతి చిన్న మొత్తం కూడా దీర్ఘకాలంలో పెద్ద మొత్తంగా మారుతుంది.

**సాంకేతికత:**నేటి పెట్టుబడిదారులకు అనేక రకాల సాధనాలు, వనరులు అందుబాటులో ఉన్నాయి. బడ్జెటింగ్ యాప్‌లు, రోబో-అడ్వైజర్‌ల సాంకేతికతతో పెట్టుబడులను నిర్వహించడం సులభం అవుతుంది. ఈ ప్లాట్‌ఫాంలు వ్యక్తిగత సూచనలను అందిస్తాయి. పోర్ట్‌ఫోలియోను తిరిగి సమతుల్యం చేయడంలో సహాయపడతాయి. ఎట్టుబడులపై తగిన అనుభవం లేనప్పటికీ, పెట్టుబడి పెట్టడంపై ఆసక్తి కలిగి ఉంటే, ఈ సాధనాలు మీకు మెరుగైన అనుభవాన్ని ఇవ్వడంతో పాటు ఆర్థికపరమైన సమాచారం అందించడంలోను సహాయపడతాయి.

# గడ్డం చంద్రశేఖర్ రెడ్డిని పార్టీ నుంచి తొలగించాలి



**పార్టీ వ్యతిరేక కార్యకలాపాలపై కాంగ్రెస్ శ్రేణుల ఫిర్యాదు**

- షబ్బీర్ అలీపై వ్యాఖ్యలతో కార్యకర్తల మనోభావాలు దెబ్బతిన్నాయన్న ఆరోపణ
- డిసిప్లనరీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేత
- పార్టీ గౌరవం కోసం సస్పెన్షన్ అవసరమని డిమాండ్

**కామారెడ్డి ప్రతినిధి, మే 31 (జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, పార్టీ సీనియర్ నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్న టీపీసీసీ జనరల్ సెక్రటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డిపై తక్షణమే క్రమశిక్షణ చర్యలు తీసుకుని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ డిసిప్లనరీ కమిషన్ చైర్మన్ మల్లు రవికి హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. పార్టీ క్రమశిక్షణను పరిరక్షించాల్సిన బాధ్యత కలిగిన నాయకులు ప్రజా వేదికలపై సీనియర్ నేతలను లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా రాష్ట్ర సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీపై గడ్డం చంద్రశేఖర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని ఆరోపించారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, కామారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి దశాబ్దాలుగా సేవలందిస్తున్న నాయకుల ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా మాట్లాడటం పార్టీ క్రమశిక్షణకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రెస్‌మీట్‌లో ఆయన ఉపయోగించిన పదజాలం పార్టీ గౌరవాన్ని తగ్గించేలా ఉండటమే కాకుండా, ప్రత్యర్థి రాజకీయ పార్టీలకు లాభం చేకూర్చే విధంగా ఉందని అభిప్రాయపడ్డారు.

పార్టీలో కొనసాగుతూ పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరించడం, సీనియర్ నాయకులను బహిరంగంగా విమర్శించడం, గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించడం ద్వారా సంస్థాగతంగా కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. గతంలో కూడా పలుమార్లు క్రమశిక్షణా విరుద్ధ వ్యాఖ్యలు చేసినప్పటికీ ఎలాంటి మార్పు కనిపించలేదని, దీంతో కార్యకర్తల్లో అయోమయం నెలకొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు.

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి కూడా ఈ అంశాన్ని తీసుకెళ్లినట్లు కాంగ్రెస్ నాయకుడు ఐరేని సందీప్ తెలిపారు. పార్టీ గౌరవాన్ని, కార్యకర్తల ఆత్మవిశ్వాసాన్ని కాపాడేందుకు గడ్డం చంద్రశేఖర్ రెడ్డిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకుని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కామారెడ్డి నియోజకవర్గంలోని సీనియర్ నాయకులు, మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు మరియు పార్టీ శ్రేణుల తరపున విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. అయితే, ఫిర్యాదులో చేసిన ఇతర వ్యక్తిగత ఆరోపణలు సంబంధిత వ్యక్తుల అభిప్రాయాలు, ఆరోపణలుగానే పరిగణించాల్సి ఉంటుందని, వాటిపై అధికారికంగా నిర్ధారణ జరగాల్సి ఉందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. పార్టీ క్రమశిక్షణకు భంగం కలిగించే అంశాలపై అధిష్ఠానం సమగ్రంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు.



మర్రిగూడ మండలంలో అధికార కాంగ్రెస్ పార్టీ ముసుగులో ముగ్గురు నేతలు సాగిస్తున్న భూ దందా, దౌర్జన్యకాండ ఇప్పుడు జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. "ప్రజా సేవే పరమావధి" అని చెప్పుకునే ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేరును అడ్డం పెట్టుకొని ఈ ముగ్గురు నేతలు సాగిస్తున్న అరాచకాలు పార్టీ ప్రతిష్ఠను మంటగలుపుతున్నాయి.

# మేం ఎమ్మెల్యే మనుషులం

## ముగ్గురు కాంగ్రెస్ నేతల బరితెగింపు




- ఎమ్మెల్యే కోమటిరెడ్డి పేరును అడ్డుపెట్టుకొని భూ దందా
- వృద్ధురాలి ఉసురు పోసుకుంటున్న నేతలు
- 3.5 కోట్ల సెటిల్మెంట్‌లో సగం వాటా కోసం కక్కుర్తి
- వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకున్న వైనం

**మర్రిగూడ, మే 31 (జనం సాక్షి):** యరుగండ్లపల్లి రెవెన్యూ పరిధిలోని అజిలాపురం గ్రామంలో సర్వే నెంబర్ 303, 305లో గల 23 ఎకరాల భూమిని 80 ఏళ్ల వృద్ధురాలు రాజ్యలక్ష్మి భర్త సంపాదించిన భూమిని అమ్ముకోనివ్వకుండా ఈ నేతలు నరకం చూపిస్తున్నారు. 45 ఏళ్లు వచ్చినా పెళ్లి కాని కూతురు, ఇద్దరు మెంటల్ అవిటి కొడుకులతో ఆ తల్లి దిక్కులేని స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఏ హక్కు పత్రాలు లేని బంధువులను ఎగదోసి, "మీకు సగం వాటా ఇస్తాం" అంటూ భూమి మీదికి పంపి గొడవలు సృష్టిస్తున్నారు. అగ్రిమెంట్ చేసుకున్న వ్యక్తులను బెదిరించడం, వాహనాలు ఆపేయడం, తిరిగి వారే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం ఈ ముఠా నైజం. "అధికార పార్టీ అంటూ, చెప్పింది చెయ్యాలంటూ హుకుం" జారీ చేస్తూ పోలీస్, రెవెన్యూ అధికారులను ఈ ముగ్గురు నేతలు బెదిరిస్తున్నారు. సివిల్ మ్యాటర్‌లో తలదూర్చని డిపార్ట్‌మెంట్‌ను సైతం ఒత్తిడి చేసి కేసులు పెట్టించే దుస్థితికి తెచ్చారు. నేడు ఏకంగా అధికారులను ఫీల్డ్‌కు పంపి పనులు ఆపించే కుట్రకు తెరలేపారు. నిత్యం పోలీస్ స్టేషన్, రెవెన్యూ ఆఫీస్ చుట్టూ తిరుగుతూ "మేము ఎమ్మెల్యే మనుషులం" అని బిల్డప్ ఇస్తున్నారు.

### వృద్ధురాలు రోదన

ప్రజలే ప్రాణంగా, ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా పనిచేసే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేరును ఈ నేతలు అడ్డంగా బదునాం చేస్తున్నారు. సెటిల్మెంట్లు, దందాలు చేస్తూ "రాజన్న మనుషులం" అని చెప్పుకుంటూ పెద్దమనుషుల్లా చలామణి అవుతున్నారు. "మీ మనుషులమంటూ మమల్ని గోస పెడుతున్నారు" అంటూ ఆ 80 ఏళ్ల వృద్ధురాలు రోదిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అవిటి పిల్లలతో కాలం వెళ్లదీస్తున్న తనను కనికరించాలని, "మీ అమ్మను అనుకో ఎమ్మెల్యే గారు" అంటూ ఆ తల్లి పెట్టిన గోడు అందరినీ కంటతడి పెట్టిస్తోంది. మును గోడు ఎమ్మెల్యే రాజన్న వెంటనే జోక్యం చేసుకుని, తన పేరు చెప్పి దందాలు చేస్తున్న ఈ ముగ్గురు నేతలను కట్టడి చేయాలని, ఆ వృద్ధ కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు, సొంత పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

### వాటాలు ముందే ఫిక్స్

"ఏ పత్రం లేని వ్యక్తులకు మూడున్నర కోట్లు ఇప్పిస్తాము అన్నది మీరు కాదా? అందులో సగం వాటా కోటి యాభై లక్షలు మీరు మాట్లాడుకోలేదా?" అంటూ సొంత పార్టీ నేతలే వీరిని నిలదీస్తున్నారు. వచ్చిన దాంట్లో వాటాలు ముందే ఫిక్స్ చేసుకుని, సోషల్ మీడియా కంట్రిబ్యూటర్‌కు సైతం 10 లక్షల వాటా ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. భూమి మీదికి వెళ్లి కావాలనే దాడి డ్రామా ఆడి, "నక్సలైట్లు కొట్టారు" అని తప్పుడు ప్రచారం చేయించారు. మర్రిగూడ కాంగ్రెస్ నేతలు, మీడియా ప్రతినిధులతో ఉన్న 17 మంది వాట్సాప్ గ్రూప్‌లో అజ్ఞాత వ్యక్తిని యాడ్ చేయించి, ఫోన్ నంబర్లు షేర్ చేసి ఫేక్ న్యూస్ స్ప్రెడ్ చేయించడం వెనుక ఈ ముగ్గురి హస్తం స్పష్టంగా కనిపిస్తోంది.

# శాతవాహనలో ఘనంగా ప్రారంభమైన వ్యాయామ విద్య ప్రవేశ పరీక్షలు

- యువత క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలి - ఆచార్య బాలకృష్ణారెడ్డి
- క్రీడలతో మంచి ఉపాధి అవకాశాలు - ఆచార్య ఉమేష్ కుమార్



**కరీంనగర్ బ్యూరో, మే 31 (జనంసాక్షి) :** శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ వ్యాయామ విద్య ఉమ్మడి ప్రవేశ పరీక్షలు (పీఈసెట్) ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయ క్రీడా మైదానంలో జరిగిన ప్రారంభ కార్యక్రమానికి ఉపకులపతి ఆచార్య ఉమేష్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాయామ విద్య ప్రస్తుతం అత్యంత ప్రాధాన్యత కలిగిన కోర్సుగా మారిందన్నారు. పరిమిత సీట్ల కోసం పోటీ తీవ్రంగా ఉంటుందని, అభ్యర్థులు తమ ప్రతిభను చాటుకుని అర్హత సాధించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు విశేష ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్న ఆయన, శాతవాహన విశ్వవిద్యాలయంలో పీఈసెట్ నిర్వహించడం గర్వకారణమన్నారు. వచ్చే ఏడాదిలోగా విశ్వవిద్యాలయ క్రీడా మైదానంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయడంతో పాటు స్పోర్ట్స్ గ్యాలరీ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని వెల్లడించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య వి. బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వివిధ విశ్వవిద్యాలయాల సామర్థ్యాన్ని పరిశీలించిన అనంతరం శాతవాహన విశ్వవిద్యాలయానికి ఈ ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహణ బాధ్యతలను అప్పగించిందన్నారు. వ్యాయామ విద్య ద్వారా కోచ్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్, క్రీడాకారుడు తదితర రంగాల్లో మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని తెలిపారు. క్రీడలు కేవలం శారీరక, మానసిక ఆరోగ్యానికే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, దేహదారుఢ్యానికి దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం బెలూన్లను గాలిలోకి ఎగరవేసి పోటీలను ప్రారంభించారు. తొలి రోజు బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సుకు 713 మంది దరఖాస్తు చేసుకోగా 531 మంది హాజరయ్యారని, 181 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సుకు 285 మంది దరఖాస్తు చేసుకోగా 190 మంది పరీక్షలకు హాజరయ్యారని, 95 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పురుష అభ్యర్థులకు 100 మీటర్లు, 800 మీటర్ల పరుగు, షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్ పోటీలను నిర్వహించగా, నైపుణ్య పరీక్షల్లో బాస్కెట్‌బాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ విభాగాల్లో ప్రతిభను అంచనా వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య సతీష్‌కుమార్, ఓఎస్టీయూ ఉపకులపతి డాక్టర్ హరికాంత్, స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి డాక్టర్ నజీముద్దీన్ మునవర్, ఆచార్య ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ దీప్లా, డాక్టర్ జగన్, డాక్టర్ సుధాకర్‌రావు, ఆచార్య సునీల్‌కుమార్, ఆచార్య దిలీప్, పీడీ విజయ్‌కుమార్‌తో పాటు వివిధ విశ్వవిద్యాలయాల వ్యాయామ అధికారులు, శిక్షకులు పాల్గొన్నారు.

**గన్నేరువరం:** జడ్‌పిహెచ్‌ఎస్ గన్నేరువరానికి చెందిన ఒక్కరు, జంగపల్లికి చెందిన నలుగురు విద్యార్థినులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓ కె. రామయ్య ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యా ర్థినులు జక్కనపల్లి శ్రావ్య, సిహెచ్ వర్శిని, బి. హాసిని,వై.సాత్విక,జి. వినయ్‌లను వారు అభినందించారు.




## ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల సమస్యలు
# వెంటనే పరిష్కరించాలి: సీఐటీయూ

**కరీంనగర్ టౌన్, మే 31: ( జనం సాక్షి) :** ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు, స్వీపర్లు, వార్డ్‌బాయ్‌లు, అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌ల సమస్యలను ప్రభుత్వం, యజమానులు వెంటనే పరిష్కరించాలని, వారికి నెలకు కనీస వేతనం రూ.26,000 చెల్లించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి, ప్రైవేటు సెక్యూరిటీ గార్డ్స్ అండ్ అలైడ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పున్నం రవి డిమాండ్ చేశారు. కరీంనగర్‌లోని కోతిరాంపూర్ ముకుంద్‌లాల్ మిశ్రా భవన్‌లో ఉన్న సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రైవేటు సెక్యూరిటీ గార్డ్స్ అండ్ అలైడ్ వర్కర్స్ యూనియన్ సమావేశం నోముల జగన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన పున్నం రవి, జిల్లాలోని వాల్మార్ట్, డీమార్ట్, బ్యాంకులు, ఏటీఎంలు, షోరూములు, ఆసుపత్రులు, అపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు, స్వీపర్లు, వార్డ్‌బాయ్‌లు తీవ్ర శ్రమదోపిడీకి గురవుతున్నారని ఆరోపించారు. రోజుకు 12 నుంచి 14 గంటలపాటు పని చేయించుకుంటూ కేవలం రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు మాత్రమే వేతనాలు చెల్లిస్తున్నారని ఆయన విమర్శించారు. కార్మికుల శ్రమకు తగిన ప్రతిఫలం అందకపోవడంతో వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. సమావేశంలో పలు కీలక తీర్మానాలను ఆమోదించారు. జిల్లాలోని ఫంక్షన్ హాళ్లలో తాత్కాలికంగా విధులు నిర్వహించే సెక్యూరిటీ గార్డులకు రోజుకు 8 గంటల పనికి కనీసం రూ.800 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే అకారణంగా ఉద్యోగాల నుంచి తొలగించిన కార్మికుల స్థానాల్లో ఇతర సెక్యూరిటీ గార్డులు పని చేయవద్దని పిలుపునిచ్చారు. లైసెన్సులు లేకుండా ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలు నిర్వహిస్తున్న సంస్థలపై కార్మిక శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సమావేశం కోరింది. అదేవిధంగా సెక్యూరిటీ కార్మికులందరికీ యూనిఫాం, భద్రతా టోపీ, టార్చ్‌లైట్ వంటి అవసరమైన సామగ్రిని ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎరుమడ్ల పరుశురాం, సుంకరపల్లి ప్రవీణ్, కోదాటి కనకయ్య, గౌరు శంకర్, ఎలబోతారం చరణ్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు. సమావేశం ముగింపులో కార్మికుల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని నాయకులు పిలుపునిచ్చారు.

## డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా
# చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలి

**జూన్ 1న భారీ పాదయాత్రకు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య పిలుపు**



**ఫరూఖ్‌నగర్, మే 31 (జనంసాక్షి):** సిద్ధాపూర్‌లో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు నిరసనగా జూన్ 1న చేపట్టనున్న 'చలో కలెక్టరేట్' పాదయాత్రను విజయవంతం చేయాలని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ తరాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని చేపడుతున్న ఈ ఉద్యమానికి పార్టీలకతీతంగా ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని కోరారు.

సిద్ధాపూర్ గ్రామంలోని హనుమాన్ దేవాలయం వద్ద జూన్ 1న ఉదయం 7.30 గంటలకు పాదయాత్ర ప్రారంభమై రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వరకు కొనసాగుతుందని తెలిపారు. డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను ప్రభుత్వం పూర్తిగా ఉపసంహరించుకునే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ వల్ల పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యం, వ్యవసాయం, భూగర్భ జలాలు, పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా తీసుకునే నిర్ణయాలను సహించబోమని పేర్కొన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువత, రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని అంజయ్య యాదవ్ విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.



# కవిత సమక్షంలో తెలంగాణ రక్షణ సేనలో చేరికలు

**కరీంనగర్ టౌన్, మే 31: ( జనం సాక్షి)** కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు విద్యార్థి, యువజన, మహిళా నాయకులు తెలంగాణ రక్షణ సేనలో చేరారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. కరీంనగర్ జిల్లా బాధ్యులు గుంజపడుగు హరిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కొత్తగా పార్టీలో చేరిన నాయకులకు కవిత పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. పార్టీలో చేరిన వారిలో శాతవాహన యూనివర్సిటీ జేఏసీ అధ్యక్షుడు, టీఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా నాయకుడు చెన్నమల్ల చైతన్య, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు గుగులోతు దివ్య, చింతకుంట మాజీ వార్డ్ సభ్యుడు గుర్రం సత్యం గౌడ్, బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా నాయకుడు లింగంపల్లి శ్రీనివాస్‌తో పాటు పలువురు విద్యార్థి, యువజన, మహిళా నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు డిస్కం ఏర్పాటు చేసి, మిగతా రెండు డిస్కంలను ప్రైవేటీకరించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఉచిత విద్యుత్‌ను తొలగించి వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే యత్నం జరుగుతోందని విమర్శించారు. రైతులకు నష్టం కలిగించే రైతు డిస్కంకు విద్యుత్ నియంత్రణ సంస్థ అనుమతి ఇవ్వకూడదని ప్రజలు కోరుతున్నారని, ఒకవేళ అనుమతి ఇచ్చినా సుప్రీంకోర్టుకు వెళ్లి అయినా దానిని అడ్డుకుంటామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో అమలు చేస్తున్న విధానాలకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇస్తోందని ఆమె ఆరోపించారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఉచిత విద్య, ఉచిత వైద్యం అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు లాకావత్ రూప్ సింగ్, లింగంపల్లి నాగరాజు, మల్లారెడ్డి, బుడిగె పరశురాం గౌడ్, శ్రీనివాస్ గౌడ్, బండ అశోక్, కొండపాక రాకేష్ రెడ్డి, సబ్బు నాగరాజు, నాగునూరి రమేష్ చారి, పూజా తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం చివరి గింజ వరకు
# ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

**రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు**

**రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి**



**కమ్మర్పల్లి మే 31(జనంసాక్షి) :** వరి ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం రోజున మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ వరి కొనుగోలు పై బిజెపి బిఆర్ఎస్ పార్టీలు రాజకీయం చేస్తున్నాయని రైతులను తప్పుదోవ పట్టిస్తూ అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుండి ఇప్పటివరకు వరి కొనుగోలు విషయంలో ఎప్పుడూ కూడా ఇబ్బందులు కలగలేదని గుర్తు చేశారు. ప్రస్తుతం కొంత లారీల కొరత వలన మిల్లర్లు ఇబ్బంది పెట్టిన సందర్భంగా ఇబ్బంది అయిన మాట నిజమే కానీ ఎక్కడ రైతులకు వరి ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయమని కానీ గతంలో కేసీఆర్ చెప్పినట్టు వరి వేస్తే ఉరే అన్నట్టు మేము అలాంటి మాటలు మా ప్రభుత్వం గానీ మా ముఖ్యమంత్రి కానీ మాట్లాడిన సందర్భం లేదని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం వరి కొనుగోలు చేస్తూ ఉంటే ఎంఎసి ధర నిర్ణయిస్తుంది ధర నిర్ణయించిన కేంద్ర ప్రభుత్వానికి కొనుగోలు చేసే బాధ్యత ఎందుకు తీసుకోదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో 1,50,000 మెట్రిక్ టన్నుల వరి సేకరణ చేస్తే కేంద్ర ప్రభుత్వం కేవలం 30 వేల టన్నులు మాత్రమే మేము తిరిగి తీసుకుంటామని చెప్పిన విధానం ఏదైతే ఉందో దీనిపై మాట్లాడాల్సిన బాధ్యత ఈ రాష్ట్ర బిజెపి నాయకులకు లేదా అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోనగిరి భాస్కర్ మాజీ అధ్యక్షులు సుంకేట రవి మాజీ డిసిసి తిప్పిరెడ్డి శ్రీనివాస్ కమ్మర్పల్లి టౌన్ అధ్యక్షులు సల్లూరి గణేష్, కుకునూర్ గ్రామ సర్పంచ్ భూమారెడ్డి, పడగల గ్రామ సర్పంచ్ రాజు, అక్లూర్ సర్పంచ్ జనార్ధన్, అంక్సాపూర్ గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, నరేష్ తదితరులు పాల్గొన్నారు



# ఈ రోడ్డు పూర్తయ్యేదెన్నడో?

## కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా.. అధికారుల అలసత్వమా?

- నరకప్రాయంగా ప్రయాణం
- వాహనదారులు, ప్రజల తీవ్ర ఇబ్బందులు..
- వెంటనే పూర్తి చేయాలని డిమాండ్

### మధ్యలోనే ఆగిపోయిన ఉత్తునూర్ - వజ్జాపల్లి బీటీ రోడ్డు పనులు

**సదాశివనగర్ మే 31(జనంసాక్షి) :** దేవుడు కరుణించిన పూజారి కరుణించట్లే అన్న చందంగా తయారైంది వజ్జపల్లి - ఉత్తునూర్ బీటి రోడ్డు పరిస్థితి. ఆ రోడ్డుపై ప్రయాణించాలంటేనే వాహనదారులు, ప్రజలు గుండెచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా.. నేటికీ పూర్తికాకపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుకు కోటీ 30 లక్షల రూపాయలు నిధులు మంజూరయ్యాయి. పది నెలల క్రితం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు శిలాఫలక కొబ్బరికాయ కొట్టి రోడ్డు పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్ హడావుడిగా పనులు ప్రారంభించారు. ఎన్నో ఏళ్ల కల సాకారం అవుతున్నందుకు మురిసి పోయారు. కానీ ఉత్తునూర్ నుండి వజ్జపల్లి వరకు చేపట్టాల్సిన బీటీ (డీ) రోడ్డు పనులు పడకేయడంతో కాంట్రాక్టర్ పై స్థానికులు, ప్రయాణికులు వాహనదారులు మండి పడుతున్నారు. అసలు ఈ రోడ్డు పనులు ఎప్పుడు పూర్తవుతాయి? ఈ నరకయాతనకు ముగింపు ఎప్పుడు? అంటూ ప్రజలు పాలకులను, అధికారులను ప్రశ్నిస్తున్నారు.

**కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం!**

రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని స్థానికులు మండిపడుతున్నారు. పనులను సకాలంలో పూర్తి చేయాలనే కనీస బాధ్యత లేకుండా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని విమర్శిస్తున్నారు. మరోవైపు, కాంట్రాక్టర్ తీరును పర్యవేక్షించాల్సిన సంబంధిత శాఖ అధికారులు పూర్తిగా అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిధులు మంజూరైనా, పనులు ప్రారంభమైనా.. వాటిని సక్రమంగా పూర్తి చేయించడంలో అధికారులు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజల డిమాండ్: వెంటనే పూర్తి చేయాలి!**

ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి, తక్షణమే పెండింగ్ పనులను ప్రారంభించేలా కాంట్రాక్టర్‌పై, అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని, యుద్ధప్రాతిపదికన బీటీ రోడ్డు పూర్తిచేయాలని కోరుతున్నారు.

**మధ్యలోనే ఆగిపోయిన పనులు**

ఉత్తునూర్ - వజ్జపల్లి రోడ్డు పనులను సగం చేసి, మిగతా పనులను మధ్యలోనే వదిలేశారు. దీంతో రోడ్డు అంతా గుంతలమయంగా, కంకర తేలి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయాలపాలవుతున్నారు. రాత్రి వేళల్లో ఈ రోడ్డుపై ప్రయాణం మరింత నరకప్రాయంగా మారింది. దుమ్ము, ధూళి వల్ల స్థానికులు, వాహనదారులు శ్వాసకోస సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు.

# కరీంనగర్‌లో టెండర్ల కలకలం




## 71 పనుల సింగిల్ టెండర్లు రీకాల్

- వివాదాస్పదంగా మారిన యూఐడీఎఫ్ అభివృద్ధి పథకం.
- కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ కు ఫిర్యాదుల వెల్లువ

**కరీంనగర్ బ్యూరో, మే 31 (జనంసాక్షి) :**
కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో టెండర్ల ప్రక్రియ తీవ్ర కలకలం రేపుతోంది. వివాదాస్పదంగా మారిన యూఐడీఎఫ్ (అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్) పథకం కింద చేపట్టాల్సిన అభివృద్ధి పనుల టెండర్లను అధికారులు రద్దు చేశారు. మొత్తం 71 పనులకు సంబంధించిన సింగిల్ టెండర్ల షెడ్యూళ్లను రద్దు చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. కరీంనగర్ బల్దియా పరిధిలో దాదాపు 50 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనుల కోసం పది రోజుల క్రితం టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. నగరంలోని 66 డివిజన్ల పరిధిలో మొత్తం 87 అభివృద్ధి పనులకు గానూ ఈ ప్రక్రియ జరిగింది. అయితే, ఇందులో సుమారు 39.50 కోట్ల రూపాయల విలువైన 71 పనులకు కేవలం సింగిల్ టెండర్లు మాత్రమే వచ్చినట్లు అధికారులు గుర్తించారు. మిగతా 15 పనులకు ఒకటి కంటే ఎక్కువ మంది కాంట్రాక్టర్లు పోటీ పడగా ఒక పనికి మాత్రం ఎవరూ ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో, ఎటువంటి పోటీ లేకుండా ఏకపక్షంగా సింగిల్ టెండర్లు రావడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. వామపక్ష , ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులతో పాటు, సివిల్ కాంట్రాక్టర్ నారాయణస్వామి శనివారం మున్సిపల్ కమిషనర్‌కు దీనిపై అధికారికంగా ఫిర్యాదు చేశారు. నిబంధనల ప్రకారం మొదటిసారి టెండర్లు నిర్వహించినప్పుడు సింగిల్ టెండర్లు వస్తే పరిశీలన అనంతరం వాటిని రద్దు చేసే అధికారం నిర్వహణ అధికారి అయిన కమిషనర్‌కు ఉంటుంది. ఈ విషయంపై కమిషనర్ తీవ్రంగా పరిగణించి రద్దు చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఈ 71 పనుల సింగిల్ టెండర్లను రీకాల్ చేసినట్లు ఎస్.ఈ. రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. ఒకవైపు విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులు ఎప్పుడెప్పుడు ప్రారంభమవుతాయా అని కార్పొరేటర్లు, ప్రజలు ఎదురుచూస్తుండగా ఈ టెండర్ల రద్దుతో పనులకు బ్రేక్ పడటం స్థానికంగా నిరాశను మిగిల్చింది.

# పక్కా ప్రణాళికతో పట్టణ అభివృద్ధి

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- వేములవాడలో రోడ్డు విస్తరణ పనుల పరిశీలన
- రాజన్న ఆలయ అభివృద్ధి శరవేగం
- రూ.6.50 కోట్లతో 80 అడుగుల రోడ్డు విస్తరణ
- బ్యూటిఫికేషన్, అన్నదాన సత్రం పనులు ఊపందుకున్నాయి



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 31 (జనం సాక్షి):**
వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆదివారం బ్రిడ్జి నుంచి రాజన్న ఆలయం వరకు జరుగుతున్న రోడ్డు వెడల్పు పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, రాజన్న ఆలయ అభివృద్ధితో పాటు వేములవాడ పట్టణ అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, దేవదాయ శాఖ మంత్రి, జిల్లా మంత్రుల సహకారంతో పనులను వేగవంతం చేస్తున్నామన్నారు.
రాజన్న ఆలయంలో సుమారు రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, ఆలయం నుంచి బ్రిడ్జి వరకు 80 అడుగుల వెడల్పుతో రోడ్డు విస్తరణ చేపట్టినట్లు చెప్పారు. ఈ పనులకు సుమారు రూ.6.50 కోట్ల అంచనా వ్యయం చేస్తున్నామని, కాంట్రాక్టర్ 90 రోజుల్లో పనులు పూర్తి చేసి అప్పగిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. త్వరితగతిన తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. పట్టణ బ్యూటిఫికేషన్ పనులకు రూ.2.60 కోట్లు కేటాయించి చర్యలు తీసుకుంటున్నామని, సెంట్రల్ లైటింగ్ సిస్టం పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని ఆయన వివరించారు. వనమహోత్సవం సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణం కల్పించేలా ప్రత్యేక మొక్కలు నాటాలని నిర్ణయించామన్నారు. అన్నదాన సత్రం పనులు రూ.35 కోట్లతో కొనసాగుతున్నాయని, భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. బద్ది పోచమ్మ ఆలయం వద్ద కూడా పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఆలయ అభివృద్ధితో పాటు పట్టణ సుందరీకరణ మరియు భక్తుల మౌలిక వసతులను మరింత మెరుగుపరచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## తంగళ్ళపల్లి-ఇల్లంతకుంట తారు రోడ్డు పూర్తి చేయాలని మంత్రి సీతక్కకు వినతి

- మానకొండూర్ ఎమ్మెల్యే, సర్పంచ్‌ల ఆధ్వర్యంలో మంత్రిని కలిసిన ప్రతినిధులు
- రైతులు, విద్యార్థులు, ఉద్యోగులకు ప్రయోజనం
- మంత్రి సీతక్క సానుకూల స్పందన
- ఈఎన్సీ జోగిరెడ్డికి తక్షణం చర్యలు ఆదేశం



**ఇల్లంతకుంట, మే 31 (జనం సాక్షి):**
మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో వెల్జిపురం గ్రామ సర్పంచ్ నాయిని నవీన్ కుమార్ శనివారం రాత్రి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి దనసరి అనసూయ సీతక్కను సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తంగళ్ళపల్లి నుంచి ఇల్లంతకుంట వరకు పెండింగ్‌లో ఉన్న తారు రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రిని వినతి చేశారు. ఈ రహదారి పూర్తయితే పరిసర గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు ఎంతో ప్రయోజనం పొందుతారని వివరించారు. వినతిపై స్పందించిన మంత్రి సీతక్క సంబంధిత ఫైల్ గురించి ఈఎన్సీ జోగిరెడ్డితో మాట్లాడి, తక్షణమే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుండ వెంకటేశం, బొజ్జ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గండికోట సురేష్, నాయకులు స్వామిరెడ్డి, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.



రేయింబవళ్లు కష్టపడి పండించిన బంగారు పంట కళ్ల ముందే కుప్పలుగా నాశనమవుతోంది. వర్షం పడితే ఏమవుతుందో అని ఆందోళనతో కన్నీరు కారుస్తున్నారు అన్నదాతలు. గన్నేరువరం మండలం హన్మాజీపల్లెలో ధాన్యం కొనుగోలు సొసైటీ కేంద్రం వద్ద రైతులు రెండు నెలలుగా పడిగాపులు కాస్తున్నా, గోనె సంచుల కొరతతో వడ్లు కల్లాల్లోనే తడిసి ముద్దవుతున్నాయి. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం వల్ల అన్నం పెట్టే అన్నదాతలే ఈ ఏడాది కన్నీరు మున్నీరవుతున్న దుస్థితి ఏర్పడింది.

# గోనె సంచుల గోస

## హన్మాజీపల్లె సొసైటీ కేంద్రం వద్ద రైతుల ఆందోళన

- రెండు నెలలుగా వడ్లు కల్లాల్లోనే..
- సంచుల పంపిణీలో పక్షపాతం, లారీలు కొరత.. హమాలీలతో వివాదం
- వర్ష భయంతో బిక్కుబిక్కుమంటున్న అన్నదాతలు

**గన్నేరువరం, మే 31 (జనం సాక్షి):**
అన్నదాతలకు మళ్లీ కష్టాలు. రేయింబవళ్లు కష్టపడి పండించిన వడ్లను అమ్ముకోవాలంటే గోనె సంచుల కొరత, అధికారుల నిర్లక్ష్యం కారణంగా కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం హన్మాజీపల్లె గ్రామంలోని ధాన్యం కొనుగోలు సొసైటీ కేంద్రం వద్ద రైతులు తీవ్ర ఆందోళనకు దిగారు. వందలాది మంది రైతులు ఆదివారం కేంద్రం వద్ద గుమిగూడి అధికారులపై మండిపడ్డారు.
పంట కోతలు పూర్తయి దాదాపు రెండు నెలలు గడుస్తున్నా ఇంకా ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాలేదు. గోనె సంచుల కొరత వల్ల కల్లాల్లోనే వడ్లు కుప్పలు పేరుకుపోయాయి. ఆకాశం మేఘాలతో నిండి వర్షం పడే అవకాశం ఉండటంతో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దవుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. శనివారం సాయంత్రం 7 వేల సంచులు వచ్చినప్పటికీ, వాటిని సీరియల్ నంబర్ ప్రకారం వేచి ఉన్న రైతులకు ఇవ్వకుండా ఇతరులకు పంపిణీ చేయడంతో వివాదం చెలరేగింది. వారానికి ఒకసారి మాత్రమే సంచులు రావడం, పంపిణీలో పారదర్శకత లేకపోవడం రైతుల ఆగ్రహానికి కారణమయ్యాయి.
ఇక్కడికి ధాన్యం వచ్చి నెలలు గడుస్తున్నా తూకం వేయకపోవడం, లారీలు రాకపోవడం వల్ల వడ్లు తరలించలేకపోతున్నారని రైతులు ఆరోపించారు. సొసైటీ నిర్వాహకులు బస్తాకు రూ.50 వసూలు చేస్తూ హమాలీలకు కేవలం రూ.10 మాత్రమే ఇస్తున్నారని, దీంతో హమాలీలు కూడా ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు “మేమే నేరుగా హమాలీలకు రూ.55 ఇచ్చుకుంటాం, మా వడ్లు తూకం వేయండి” అంటూ తీవ్రంగా వాదించారు.
ఈ ఆందోళనలో ఎమిరెడ్డి సంజీవ్ రెడ్డి, నందికొండ స్వామి రెడ్డి, కాంతాల స్వామి రెడ్డి, రామంచ మల్లారెడ్డి, అనుమండ్ల భాస్కర్ రెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సరిపడా గోనె సంచులు సరఫరా చేసి, లారీలు ఏర్పాటు చేసి యుద్ధప్రాతిపదికన ధాన్యం సేకరణ చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు.

### ‘బురదజల్లే ప్రయత్నాలను నమ్మొద్దు’

**గోనె సంచుల కొరతపై సొసైటీ నిర్వాహకులు**



హన్మాజీపల్లె ధాన్యం కొనుగోలు కేంద్రంలో గోనె సంచుల కొరతపై వస్తున్న ఆరోపణలపై సొసైటీ నిర్వాహకులు స్పందించారు. కేంద్రం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 55 లారీల ద్వారా సుమారు 13,000 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని విజయవంతంగా మిల్లులకు తరలించినట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ రోజుకు 2 నుంచి 3 లారీలు ధాన్యం తరలిస్తున్నామని వివరించారు. శనివారం సాయంత్రం కేంద్రానికి కొత్తగా 7 వేల గోనె సంచులు వచ్చినట్లు చెప్పారు. అయితే సీరియల్ నంబర్ లేని కొందరు రైతులు ఒక్కసారిగా ఎగబడి లెక్కా జమ లేకుండా సంచులు తీసుకెళ్తున్నారని, దీంతో నిర్వాహకులపై అదనపు భారం పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులందరూ సహకరించి సీరియల్ నంబర్ ప్రకారమే ధాన్యం తూకం వేయించుకోవాలని, సొసైటీ సిబ్బందికి అండగా నిలవాలని సొసైటీ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

### అక్రమ ఇసుక రవాణాపై కరీంనగర్ రూరల్

## పోలీసుల ఉక్కుపాదం

**రెండు ట్రాక్టర్లు స్వాధీనం.. నిందితులపై కేసులు నమోదు**

**కరీంనగర్ రూరల్, మే 31 (జనం సాక్షి):** అక్రమ ఇసుక రవాణాపై కరీంనగర్ రూరల్ పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తున్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న పెట్రోలింగ్ సందర్భంగా ఆదివారం రెండు వేర్వేరు ప్రాంతాల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కరీంనగర్ కిసాన్‌నగర్‌కు చెందిన నీరుకుల్లా అనిల్ కుమార్ మానేరు వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తవ్వి తన ట్రాక్టర్‌లో కరీంనగర్ వైపు తరలిస్తుండగా మొగ్దుంపూర్ గ్రామం వద్ద కరీంనగర్ రూరల్ పోలీసులు అడ్డగించి పట్టుకున్నారు. అదే విధంగా, సుల్తానాబాద్ మండలం పెద్దపల్లి గ్రామానికి చెందిన దాసరి వినయ్ మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తుండగా బహదూర్ ఖాన్‌పేట్ గ్రామం సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. ఈ రెండు ఘటనల్లో ఉపయోగించిన ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేసి, నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేశారు. అనంతరం తదుపరి చర్యల నిమిత్తం వారిని కోర్టుకు పంపించారు. ఈ సందర్భంగా కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకం మరియు రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని తెలిపారు.

## మున్సిపల్ కార్మికులకు ప్రమాద బీమా ఈఎస్ఐ కార్డుకు పాలకవర్గ ఆమోదం



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మే 31 (జనంసాక్షి) :** వేములవాడ మున్సిపల్ పాలకవర్గము శనివారం జరిగిన సమావేశంలో మున్సిపల్ లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ప్రమాద బీమా, ఈఎస్ఐ కార్డు అమలుకై తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో వేములవాడ మున్సిపల్ కార్యాలయంలోని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ అన్ని పార్టీల కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కోశాధికారి గుర్రం అశోక్ మాట్లాడుతూ కార్మికులందరికీ ప్రమాదా బీమా అమలు చేయుటకై కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేసినందుకు మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు,పాలక వర్గానికి, మున్సిపల్ కమిషనర్, కో ఆప్షన్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు సరిపెల్లి నరేష్ యూనియన్ నాయకులు ముంజ రమేష్, బొట్టు శ్రీనివాసు, సావనపల్లి శ్రీనివాసు, పందుల మల్లేశం, డ్రైవర్ యూనియన్ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

## పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా పాడి రైతు భరోసా భీమా పథకం అమలు

- సంవత్సరానికి రూ.250 చెల్లిస్తే పాడి రైతు భరోసా
- 27మందికి రూ.13లక్షల 50వేల విలువగల పాడిరైతు భరోసా చెక్కుల పంపిణీ
- ప్రతి ఇంటికి ఒక గేదెను పెంచుకోవాలన్న కరీంనగర్ డెయిరీ చైర్మన్ చెలిమెడ రాజేశ్వర్ రావు

**చిగురుమామిడి మే 31(జనంసాక్షి):** పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే లక్ష్యంగా కరీంనగర్ డెయిరీ పాడి రైతు భరోసా బీమా పథకం అమలు చేస్తుందని,ప్రతి రైతు వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమను పెంపొందించుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలని కరీంనగర్ డెయిరీ చైర్మన్ చెలిమెడ రాజేశ్వర్ రావు కోరారు.సోమవారం హుస్నాబాద్ లో కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో హుస్నాబాద్ చిల్లింగ్ సెంటర్ పరిధిలోని 27మంది లబ్ధిదారులకు 13లక్షల 50వేల రూపాయల విలువ గల పాడి రైతు భరోసా చెక్కులను చైర్మన్ రాజేశ్వర్ రావు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ రాజేశ్వర్ రావు మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుడు సంవత్సరానికి రూ.250 చెల్లిస్తే భార్య గాని భర్త గాని మరణిస్తే వారి కుటుంబానికి 50వేల రూపాయలను కరీంనగర్ డెయిరీ తరఫున అందజేస్తామని చెప్పారు.9,10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పాడి రైతు భరోసా పథకంలో భాగంగా 800రూపాయల చొప్పున స్కాలర్షిప్ లు అందజేస్తున్నట్లు చెప్పారు.పాల ఉత్పత్తిదారుడి సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ కరీంనగర్ డెయిరీ ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు.కరీంనగర్ డెయిరీ ఏ ఒక్కరి సొంతం కాదని లక్ష పాడి రైతు కుటుంబాల సంస్థ అని,డెయిరీ పరిధిలో ఎక్కడ అవినీతి అక్రమాలు జరిగిన ప్రశ్నించే స్వేచ్ఛ కరీంనగర్ డెయిరీలో మాత్రమే ఉందని పేర్కొన్నారు.మరణం ఎవరికి చెప్పి రాదని ప్రతి పాల ఉత్పత్తిదారుడు వాడ 250 చెల్లించి పాడి రైతు పథకంలో చేరాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బోర్డు డైరెక్టర్లు అంతం నారాయణరెడ్డి, కన్నబోయిన రవీందర్, మేనేజర్లు కోమటిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,చింతపూల నాగయ్య,అసిస్టెంట్ మేనేజర్ సింగిరెడ్డి తిరుపతిరెడ్డి,సూపర్ వైజర్లు సిర్రా కరుణాకర్ రెడ్డి,సీతా రవి,భాస్కర్ రెడ్డి,వీరస్వామి, అప్పాల మల్లయ్య, హుస్నాబాద్ పాలకేంద్రం అధ్యక్షులు కాయిత బాల్ రెడ్డి, సుందరగిరి అధ్యక్షులు పిట్టల తిరుపతి, రామంచ అధ్యక్షుడు కూతురు మల్లారెడ్డి, ఆంజనేయులు, వెంకటస్వామి, పాల ఉత్పత్తిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పదవి విరమణ పొందిన అలయ కార్యనిర్వనాధికారి పద్మ శ్రీధర్



**భిక్కనూరు మే 31 (జనం సాక్షి) :**
మండల కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ సిద్ధరామేశ్వర స్వామి స్వయంభూ లింగ మహా క్షేత్రంలో ఆలయ కార్యనిర్వాహక అధికారి పద్మ శ్రీధర్ గారు ఆదివారం పదవి విరమణ పొందారు. దేవాదాయ శాఖలో 35 సంవత్సరాల 8 నెలల 25 రోజుల పాటు నిరంతరం సేవలందించిన శ్రీధర్ గారిని ఆలయ పునర్నిర్మాణ కమిటీ ఘనంగా సన్మానించింది.
ఈ సందర్భంగా దేవాలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ తాటిపాముల లింబాద్రి మాట్లాడుతూ, ఉద్యోగ జీవితంలో పదవి విరమణ సహజమైనా, శ్రీధర్ ఆలయ అభివృద్ధి మరియు భక్తులకు మెరుగైన సేవలందించడంలో చూపిన కృషి ప్రశంసనీయమని కొనియాడారు. వైస్ చైర్మన్ అందే దయాకర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు, దేవాదాయ శాఖ సహోద్యోగులు ఆయనను ఘనంగా సత్కరించారు. పదవి విరమణ పొందిన పద్మ శ్రీధర్ మాట్లాడుతూ, తన సేవా కాలంలో సహకరించిన ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన బాధ్యతలను కామారెడ్డి పంచముఖి హనుమాన్ దేవాలయం లో విధులు నిర్వహిస్తున్న వి.శ్రీధర్ రావుకు అప్పగించారు.
ఆలయ సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీధర్‌ని అభినందించారు.

# ముగిసిన కరీంనగర్ బిజెపి శిక్షణ తరగతులు

### 2 రోజులు.. 12 సెషన్స్.. కీలక నేతల దిశానిర్దేశం



**కరీంనగర్ బ్యూరో, మే 31 (జనంసాక్షి) :**
బీజేపీ కీలక నేతల దిశా నిర్దేశంతో కరీంనగర్ జిల్లా బీజేపీ ఏర్పాటు చేసిన రెండు రోజుల ప్రశిక్షణ తరగతులు ఆదివారం సాయంత్రం ముగిశాయి. శనివారం నుంచి తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్‌లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ‘పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్’ పేరుతో నిర్వహించిన ఈ శిక్షణా తరగతుల్లో 12 సెషన్లు జరిగాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు శిక్షణ తరగతులను ప్రారంభించి, పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు, సంస్థాగత బలోపేతం, భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు. బీజేపీ రాష్ట్ర ముఖ్య నేతలు అయ్యంగారి ప్రభాకర్ రెడ్డి, దేవకి వాసుదేవరావు, అల్జాపూర్ శ్రీనివాస్, బండారి శాంతి కుమార్, రాణి రుద్రమ, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, పో రెడ్డి కిషోర్, రంజిత్ మోహన్, మురళీధర్ రావు, కడగంచి రమేష్, కరీంనగర్ ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ భాను తదితరులు 12 కీలక అంశాలపై శిక్షణ ఇచ్చారు.
పార్టీ ఆవిర్భావం, సిద్ధాంతాలు, లక్ష్యాలు, అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని ఎదుర్కోవడం, పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడం, ప్రజాక్షేత్రంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు వంటి ముఖ్యాంశాలపై ఈ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఒక్కో సెషన్‌లో నేతలు 45 నిమిషాల నుంచి గంటకు పైగా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో 346 మంది పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
శిక్షణ తరగతుల సమాప్తి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ గవర్నర్ సి.హెచ్. విద్యాసాగర్ రావు హాజరై మాట్లాడారు. పార్టీ సిద్ధాంతాలను, భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీని మరింత విస్తరించాలని, శిక్షణలో నేర్చుకున్న విషయాలను ఆచరణలో పెట్టి పార్టీని బలమైన శక్తిగా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. ఈ శిక్షణా తరగతుల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మేయర్ కోలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, పార్లమెంట్ కన్వీనర్, ప్రశిక్షణ కమిటీ బాధ్యులు, రాష్ట్ర నాయకులు, కార్పొరేటర్లు, సర్పంచులు, మండలాధ్యక్షులు, వివిధ మోర్చా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సుడా రెండేళ్ల ప్రగతి అద్భుతం

- రెండేళ్ల ప్రగతి పై జూన్ 1 నుండి జూన్ 15 వరకు పక్షోత్సవాలు
- ముఖ్య అతిథులచే త్వరలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- జూన్ 15 న సుడా ప్రగతిపై నివేదిక విడుదల
- సుడా ప్రగతి పై విలేఖర్ల సమావేశంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, మే 31 (జనంసాక్షి) :**
శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ రెండేళ్లలో అద్భుతమైన ప్రగతి సాధించిందని మునుపెన్నడూ లేనంతగా అభివృద్ధి జరిగిందని రాబోయే రోజుల్లో ఇంకా మరింత ముందుకు సాగుతుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి వెల్లడించారు. ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఇప్పటికే 183 పనులకు గాను కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు, స్ట్రీట్ లైట్లు, హైమాస్ లైట్లు, కూడళ్ల సుందరీకరణ తదితర పనులు చేపట్టామని సుడాకు గతంలో గజం జాగ లేదని 800 గజాలలో 5 కోట్లతో కమర్షియల్ బిల్డింగ్ నిర్మిస్తున్నామని, 20 సంవత్సరాల క్రితం కట్టి వదిలేసిన ఐడిఎస్ఎంటి మురికి కూపమై అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని దాన్ని కోటిన్నరతో అభివృద్ధి చేసి ఇప్పుడు త్వరలో అందుబాటులో కి తీసుకరాబోతున్నామని టవర్ ఏరియాకు వచ్చే వారికి 100 కార్లు, 300 బైకులు పార్కింగ్ చేసుకోవడానికి అందుబాటులోకి వస్తుందని, 40 షెట్టర్లు ఆధునీకరించామని వాటిని అద్దెకిస్తామని ఐడిఎస్ఎంటి వెనుక కోటి ఇరవై లక్షలతో ఫుడ్ కోర్ట్ ఏర్పాటుకు టెండర్లు పిలిచామని, త్వరలో శంకుస్థాపన చేస్తామని రాజీవ్ చౌక్ ను సుందరీకరించి 9 ఫీట్ల రాజీవ్ గాంధీ కాంస్య విగ్రహం ఏర్పాటు చేశామని తెలిపారు. త్వరలో ముఖ్య అతిథులచే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఉంటాయని నరేందర్ రెడ్డి తెలిపారు. జూన్ 1 నుండి జూన్ 15 వరకు సుడా ప్రగతి పై పక్షోత్సవాలు నిర్వహిస్తామ ని, అందులో భాగంగా ప్రతి రోజు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఉంటాయని ఏడున్నర కోట్ల నూతన పనులకు టెండర్లు పిలిచామని అవి త్వరలో శంఖుస్థాపన చేస్తామని నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ పక్షోత్సవాలలో అందరినీ భాగస్వాములను చేస్తామని రాబోయే రోజుల్లో ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతామని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఎండి తాజ్, చాడగొండ బుచ్చిరెడ్డి, టేల భూమయ్య, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, గుడిపాటి రమణారెడ్డి, మిర్యాల శ్రీధర్ రెడ్డి, జువ్వాడి అమరేందర్ రావు, కుర్ర పోచయ్య, దండి రవీందర్, జీడి రమేష్, మాసుంఖాన్, బషీర్, ఖలీల్, హనీఫ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
1 జూన్ 2026

# సేంద్రీయ ఆహార ఉత్పత్తులే వినియోగించాలి

## టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రజల ఆరోగ్య పరిరక్షణలో సేంద్రీయ ఆహార ఉత్పత్తుల వినియోగం కీలకమని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సేంద్రీయ వ్యవసాయం, ఆరోగ్యకరమైన జీవనశైలి, పర్యావరణ హిత ఉత్పత్తులను ప్రోత్సహించే లక్ష్యంతో హెచ్ఎమ్‌టీవీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ఆర్గానిక్ మేళా – ఎగ్జిబిషన్ అండ్ సేల్స్" కార్యక్రమం హైదరాబాద్‌లోని హెచ్ఎమ్‌డీఏ గ్రౌండ్స్, నెక్లెస్ రోడ్‌లో ఘనంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, గుత్తా అమిత్ రెడ్డి, చంద్రశేఖర్ గౌడ్ హాజరై వివిధ స్టాల్స్‌ను సందర్శించారు. సేంద్రీయ ఉత్పత్తులు, మిల్లెట్స్, సంప్రదాయ ఆహార పదార్థాలు, సహజ వ్యవసాయ ఉత్పత్తులు, హస్తకళలు, ఆర్గానిక్ తేనె, డెయిరీ వెల్‌నెస్ ఉత్పత్తులు మరియు సుస్థిర జీవన విధానాలకు సంబంధించిన ఆవిష్కరణలను పరిశీలించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో సేంద్రీయ ఆహార ఉత్పత్తుల వినియోగం కీలకమని అన్నారు. రైతులు సహజ వ్యవసాయ పద్ధతుల వైపు అడుగులు వేయాలని, ఇటువంటి మేళాలు రైతులు, వినియోగదారుల మధ్య ప్రత్యక్ష అనుసంధానానికి దోహదపడతాయని పేర్కొన్నారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించడంలో ఇటువంటి కార్యక్రమాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. 200కు పైగా స్టాల్స్‌తో నిర్వహిస్తున్న ఈ మేళాలో సేంద్రీయ ఆహార ఉత్పత్తులు, మిల్లెట్స్, సహజ మరియు పర్యావరణ హిత ఉత్పత్తులు, హ్యాండ్లూమ్, హస్తకళల వస్తువులు, వ్యవసాయ ఆవిష్కరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆరోగ్యకరమైన, పర్యావరణ హిత జీవన విధానాన్ని ప్రోత్సహించాలని నిర్వాహకులు కోరారు.

## మంథని, కాళేశ్వరం బస్టాండ్ల అభివృద్ధితో

# మెరుగైన ప్రజా రవాణా సేవలు

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- మహిళలకు 310 కోట్లకు పైగా జీరో టికెట్లు జారీ చేశాం
- త్వరలో పెద్దపల్లి బస్ డిపో ప్రారంభం : మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**మంథని, మే 31 (జనంసాక్షి) :** మంథని, కాళేశ్వరం బస్టాండ్ల అభివృద్ధితో ప్రజా రవాణా సేవలు మరింత మెరుగుపడతాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంథని మున్సిపాలిటీ పరిధిలోని మంథని బస్టాండ్‌లో రూ.93 లక్షల వ్యయంతో చేపట్టనున్న అదనపు ప్లాట్‌ఫారాలు, ఇతర అభివృద్ధి పనులకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష లతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మంత్రి శ్రీధర్ బాబు సూచనల మేరకు మంథని, కాళేశ్వరం బస్టాండ్ల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గోదావరి పుష్కరాలు–2027 నిర్వహణ కోసం ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని నియమించిందని, కుంభమేళాను తలపించే స్థాయిలో పుష్కరాలు నిర్వహించేందుకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కోట్లాది మంది భక్తులు పుష్కరాలకు తరలి వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి గ్రామం నుంచి పుష్కర క్షేత్రాలకు చేరుకునేలా ప్రత్యేక రవాణా సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. బాసర నుంచి భద్రాచలం వరకు బస్టాండ్లను ఆధునికీకరించడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం కింద ఇప్పటివరకు దాదాపు 310 కోట్ల జీరో టికెట్లు జారీ చేసినట్లు తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలను ఆర్టీసీ అభివృద్ధిలో భాగస్వాములను చేస్తున్నామని పేర్కొన్నారు.

ప్రస్తుతం రోజుకు సుమారు 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగిస్తుండగా, బస్సులు దాదాపు 35 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తున్నాయని తెలిపారు. ప్రతి గ్రామానికి మెరుగైన కనెక్టివిటీ కల్పించే దిశగా బస్సుల ఫ్రీక్వెన్సీ పెంచుతున్నామని చెప్పారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ మంథని బస్టాండ్‌లో రెండు అదనపు ప్లాట్‌ఫారాల నిర్మాణానికి రూ.74 లక్షలు, ఇతర అభివృద్ధి పనులకు రూ.19 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కాళేశ్వరం బస్టాండ్ అభివృద్ధికి రూ.3 కోట్లు మంజూరు చేశామని, కాళేశ్వరం దేవస్థాన అభివృద్ధిలో ఆర్టీసీ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.

# గోదావరి పుష్కరాలు మరింత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు

- మంత్రి శ్రీధర్ బాబు



**కాళేశ్వరం, జూన్ 01 (జనం సాక్షి) :** సరస్వతి అంత్య పుష్కరాలు 11వ రోజు ఆదివారం రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, శ్రీశ్రీశ్రీ మాధవా నంద సరస్వతి స్వామి సరస్వతి నవరత్న మాలా హారతిని వీక్షించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ బ్రహ్మశ్రీ మాధవానంద సరస్వతి స్వామి సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. స్వామి మాట్లాడుతూ, భక్తులు సరస్వతి పుష్కర స్నానం ఆచరించి స్వామివారి అనుగ్రహం పొందాలని, దేశ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గత సంవత్సరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరస్వతి పుష్కరాలు ప్రారంభించారని, ఈసారి గవర్నర్ చేతుల మీదుగా అంత్య పుష్కరాలుగా ప్రారంభమవడం గర్వకారణమని తెలిపారు. ఐటి , పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ లక్షలాది భక్తులు పాల్గొంటున్న ఈ మహోత్సవం విజయవంతంగా నిర్వహించడంలో అన్ని శాఖల సమన్వయం కీలకమని పేర్కొన్నారు. భక్తులు సరస్వతి నదిలో పుణ్యస్నానం చేసి, కాలేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకుని జ్ఞానం, మోక్షం పొందాలని ఆశిస్తూ పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. గత 11 రోజులుగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసిందని తెలిపారు. వచ్చే సంవత్సరం రాబోయే గోదావరి పుష్కరాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు భారీ స్థాయిలో మౌలిక వసతుల అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వేయి కోట్లు గోదావరి పుష్కరాలకు కేటాయించిన ట్లు తెలిపారు. కాళేశ్వరం దేవాలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి 200 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా జరిగాయని అభినందించారు. భక్తజనంతో కాళేశ్వరం కిక్కిరిసిపోగా, కాశీ పండితులచే సరస్వతి నవరత్న మాలా హారతి, సరస్వతి మాతా దర్శనం భక్తులను ఆధ్యాత్మికంగా మంత్ర ముగ్ధులను చేసింది.

# డిస్కంల ప్రయివేటుకు కుట్ర

## సీఎం క్లారిటీ ఇవ్వగలరా?

- తెలంగాణ జాగృతి తరపున కేసు కూడా వేశాం. పర్మిషన్ ఇస్తే సుప్రీంకి వెళ్లైనా అడ్డుకుంటాం
- దసరా లోపు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ప్రారంభించకపోతే తెల్లారి నుంచే పాదయాత్ర
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రైతు డిస్కం పేరుతో రేవంత్ రెడ్డి సర్కార్ కొత్త డిస్కం ను ఏర్పాటు చేసి మిగతా రెండు డిస్కంలను ప్రైవేట్ పరం చేసే కుట్ర చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. తాము ఆ ప్రయత్నం చేయటం లేదని ప్రెస్ మీట్ పెట్టి చెప్పే దమ్ము సీఎం కు ఉందా అని సవాల్ విసిరారు. రైతు డిస్కం ఏర్పాటు ద్వారా ఉచిత విద్యుత్, మోటార్లకు మీటర్లు పెట్టమంటూ మీడియాతో చిట్ చాట్ లో సీఎం మాట్లాడిన అంశాలపై కవిత కౌంటర్ ఇచ్చారు. బంజారాహిల్స్ లో తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఆదివారం ప్రెస్ మీట్ లో మాట్లాడారు. ఈ ముఖ్యమంత్రి ఉచిత విద్యుత్ ఎత్తివేయని చెప్తుంటేనే ఇంకా ఎక్కువ అనుమానించాల్సి వస్తోందన్నారు. చిట్ చాట్ లో కాకుండా అవే విషయాలను ప్రెస్ మీట్ ద్వారా ప్రజలకు చెప్పాలన్నారు. బహిరంగ సభల్లో ఇచ్చిన హామీలనే పట్టించుకోని ఈ సీఎం ఇప్పుడున్న చెబుతున్న మాటలకు కట్టుబడి ఉంటాడని నమ్మకం లేదన్నారు. రైతులకు నష్టం చేసే రైతు డిస్కం కు ఈఆర్సీ ఎట్టి పరిస్థితుల్లో పర్మిషన్ ఇవ్వొద్దని కోరారు. ఒకవేళ పర్మిషన్ ఇస్తే సుప్రీంకోర్టుకు వెళ్లైనా సరే దాన్ని అడ్డుకుంటామన్నారు. ఇప్పటికే తెలంగాణ జాగృతి తరపున కేసు వేసినట్లు కవిత చెప్పారు. రైతు డిస్కం గురించి ఆరు నెలల పాటు సీక్రెట్ గా ఉంచిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు చిట్ చాట్ పేరుతో దొంగచాటుగా మాట్లాడుతున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల ఆరోపించారు. రైతు డిస్కం కారణంగా ఉచిత విద్యుత్, రైతుల మోటార్లకు మీటర్లు పెడతారని మేము మాట్లాడితే కాదని ఆయన అంటున్నారని చెప్పారు. కానీ ఇదే విషయాన్ని ఎందుకు ప్రెస్ మీట్ పెట్టి చెప్పటం లేదని ప్రశ్నించారు. బహిరంగ సభల్లోనే ఎన్నో హామీలు ఇచ్చి ఎగ్గొట్టిన ఈ ముఖ్యమంత్రి చిట్ చాట్ లో మాట్లాడే మాటలపై జవాబుదారీ గా ఉంటారా అని అనుమానం వ్యక్తం చేశారు. రైతు డిస్కం పేరుతో కొత్తగా డిస్కం ఏర్పాటు చేసి మిగతా రెండు డిస్కం లను ప్రైవేట్ పరం చేసే కుట్ర చేస్తున్నారని కవిత ఆరోపించారు. నిజంగా ప్రైవేట్ పరం చేసే ఆలోచన లేకుంటే...డిస్కం లను ప్రైవేట్ పరం చేస్తే వచ్చే ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్లమని చెప్పే ధైర్యం ఉందా అని సవాల్ విసిరారు. ఈ ముఖ్యమంత్రి అంత గట్టిగా చెప్పినప్పటికీ మాకు నమ్మకం కుదరకపోవటానికి గత చేదు అనుభవాలే కారణమన్నారు. ఈ సారి రైతు భరోసా ఇప్పుడు రెండు ఎకరాల లోపు వారికే ఇచ్చారు. రైతు రుణ మాఫీ 30 శాతం మందికి కూడా కాలేదు. బోనస్ ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారు. చివరి గింజ వరకు ధాన్యం కొంటమని చెప్పి ఇప్పటికీ కొనుగోలు సరిగా చేయటం లేదని గుర్తు చేశారు. రైతు బీమాను యాక్సిడెంటల్ బీమాగా మార్చేసే కుట్ర చేశారన్నారు. ఇప్పటి వరకు ఈ ప్రభుత్వం చేపట్టిన అన్ని చర్యలు రైతులకు వ్యతిరేకంగానే ఉన్నాయన్నారు. అందుకే ముఖ్యమంత్రి చెప్పే మాటల మీద నమ్మకం కుదరటం లేదని కవిత అన్నారు. రైతు డిస్కం ను ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకొని తీరుతామని కవిత స్పష్టం చేశారు. రైతులకు నష్టం చేసే ఈ ప్రపోజల్ ను ఈఆర్సీయే రిజెక్ట్ చేయాలని కోరారు. కొత్త డిస్కం లో రైతులే వినియోగదారులుగా ఉంటారు కనుక ఈఆర్సీ వారి అభిప్రాయాలు తీసుకోవాలని సూచించారు. మొత్తం 33 జిల్లాల్లో పబ్లిక్ హియరింగ్ నిర్వహించాలన్నారు. ఈఆర్సీ ఈ ప్రపోజల్ కు ఒకే చెబితే న్యాయం పోరాటం చేస్తామని కవిత స్పష్టం చేశారు. ఇప్పటికే దీనిపై స్వచ్ఛంద సంస్థ అయిన తెలంగాణ జాగృతి తరపున కేసు ఫైల్ చేశామన్నారు. సుప్రీంకోర్టు లో పోరాటం చేసైనా సరే రైతు డిస్కంను అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

### లక్ష్మీదేవిపల్లిలో రిజర్వాయర్ కట్టకపోతే పాదయాత్ర చేస్తా

అటు పాలమూరు ప్రాజెక్ట్ కు సంబంధించి ప్రభుత్వం పనులను వేగవంతం చేయాలని కోరారు. ఈ అంశంలో తాము పదే పదే ప్రశ్నించటంతో ముఖ్యమంత్రి రివ్యూ చేస్తానని చెప్పారన్నారు. అందులో భాగంగా కుమ్మెర అనే గ్రామానికి వెళ్తున్నట్లు తెలిసిందన్నారు. ఐతే అదే గ్రామంలో కులవివక్షతో ఒక పసిగుడ్డును చంపేశారని కవిత గుర్తు చేశారు. ముఖ్యమంత్రి కచ్చితంగా ఆ కుటుంబాన్ని పరామర్శించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా తాము డిమాండ్ చేసినట్లు దసరా లోపు పాలమూరు ప్రాజెక్ట్ లో భాగంగా లక్ష్మీదేవిపల్లి లో రిజర్వాయర్ పనులను ప్రారంభించాలన్నారు. లేదంటే ఆ మరుసటి రోజు నుంచే పాదయాత్ర చేస్తానని కవిత హెచ్చరించారు. ఇక రాష్ట్రంలో ఉన్న స్కూళ్లను బాగు చేయాలంటూ, హైడ్రా తీరు గురించి కూడా కోర్టు ఈ ప్రభుత్వంపై అక్షింతలు వేస్తున్న పట్టించుకోవటం లేదని మండిపడ్డారు. కోర్టు తిడుతున్నప్పటికీ ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే మీడియా మాత్రం హైడ్రాను సమర్థిస్తూ వార్తలు రాయటం బాధకరమన్నారు. పెద్దవాళ్లను కాపాడుతూ పేదవాళ్ల ఇళ్లను హైడ్రా కూల్చుతుందని చెప్పారు. బడా వ్యక్తులు చేసే కబ్జాలపై నేను ఇచ్చిన ఫిర్యాదులను హైడ్రా పక్కన పెట్టిందని కవిత గుర్తు చేశారు.

### ఖమ్మంలో పసిగుడ్డుకు న్యాయం చేయాలి

ఖమ్మంలో ప్రభుత్వ హాస్పిటల్ లో వైద్యం చేయించుకోవటానికి తీసుకొచ్చిన ఓ పసిగుడ్డు చేయి తీసేయటంపై కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ హాస్పిటల్ లో డబ్బులు అయిపోతే ప్రభుత్వ హాస్పిటల్ లో వైద్యం చేయించేందుకు తీసుకొస్తే ఆ పసిగుడ్డు చేయి తీసేశారన్నారు. ఆ కుటుంబానికి ముఖ్యమంత్రి సహా ఖమ్మంలో ఉన్న మంత్రులు న్యాయం చేయాలన్నారు. ఆ చిన్నారి పేరు మీద రూ. 25 లక్షలు డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు.

# మహిళా వారోత్సవాలు దిగ్విజయం

- మహిళా సాధికారతకు కొత్త దిశ చూపిన తెలంగాణ ప్రభుత్వం
- అందరికీ ధన్యవాదాలు : మంత్రి సీతక్క




**హైదరాబాద్, మే 31 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా ఆర్థికాభివృద్ధికి చోదకశక్తులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో నిర్వహించిన వారంరోజుల మహిళా వారోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. మే 25 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమాలు మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబన, నాయకత్వ వికాసం, బాలికల అభివృద్ధి, మహిళా భద్రత, పారిశ్రామిక ప్రోత్సాహం వంటి అంశాల చుట్టూ సాగి మహిళల్లో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపాయి. రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క ముఖ్య కార్యక్రమాల్లో పాల్గొని మహిళల్లో స్ఫూర్తినింపారు.

మహిళా వారోత్సవాల విజయంపై మంత్రి సీతక్క సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణలో మహిళా సాధికారతను ఒక కార్యక్రమంగా కాకుండా ప్రజా ఉద్యమంగా మార్చాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఈ వారోత్సవాలు బలమైన పునాది వేశాయని ఆమె పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పం సాకారం అయ్యే దిశగా మహిళల్లో కొత్త ఆత్మవిశ్వాసం, కొత్త ఆలోచనలు, కొత్త అవకాశాలు ఈ కార్యక్రమాల ద్వారా వెలుగులోకి వచ్చాయని తెలిపారు.

గ్రామీణ మహిళలు వ్యవసాయం, సూక్ష్మ వ్యాపారాలకే పరిమితం కాకుండా పారిశ్రామిక రంగం, విద్యుత్ ఉత్పత్తి, సేవారంగం, నాయకత్వ స్థానాల్లోనూ రాణించగలరని ఈ వారోత్సవాలు నిరూపించాయని ఆమె అన్నారు. మహిళలు బలపడితే కుటుంబం బలపడుతుంది, కుటుంబం బలపడితే సమాజం బలపడుతుంది, సమాజం బలపడితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే నమ్మకంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.

మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారత కోసం భవిష్యత్తులో మరిన్ని వినూత్న కార్యక్రమాలు చేపడతామని, తెలంగాణ మహిళలను దేశానికి ఆదర్శంగా నిలబెట్టే దిశగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఉప ముఖ్యమంత్రి నాయకత్వంలో రవాణా శాఖ మంత్రి, ఇతర మంత్రులతో కలిసి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల అనంతరం కార్మిక ప్రతినిధులతో చర్చించి ఆర్టీసీ విలీన ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ ,రీజనల్ కరీంనగర్ మేనేజర్ రాజు, డిప్యూటీ ఆర్.యం.(ఎం) మల్లేశం, డిపో మేనేజర్ శ్రావణ్ కుమార్, ఆర్డిఓ సురేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆర్టీసీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# భద్రాచలంలో గోదావరి నదీ హారతి

**భద్రాచలం మే 31 (జనంసాక్షి) :** అధిక జేష్ట మాసం పౌర్ణమి ఆదివారం దివ్య క్షేత్రం భద్రాద్రిలో పుణ్య గోదావరి నదీ హారతి పురోహితుల మంత్రోచ్చారణలతో అంగరంగ వైభవంగా జరిగిందని పురోహిత సంఘం అధ్యక్షులు రామ వఝుల రవికుమార్ అన్నారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సీతారామచంద్రస్వామి కొలువై ఉన్న భద్రాద్రిలో గోదావరి తీరంలో ప్రతి ఆదివారం గోదావరి నదికి భక్తుల సహాయ సహకారాలతో భద్రాద్రి బ్రాహ్మణ పురోహిత సంఘం ఆధ్వర్యంలో గోదావరి హారతి నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, దేశ విదేశాల నుండి వచ్చే భక్తులు నదిహారతి కార్యక్రమంలో పాల్గొని పునీతులు అవుతున్నారని అన్నారు. పరాభవ నామ సంవత్సర అధిక జ్యేష్టపౌర్ణమి ఆదివారం రోజు నిర్వహించే నదిహారతి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు పురోహితులు గోదావరి హారతి విశేషాలను విశిష్టతను ముందుగా వినిపించి, గణపతి పూజ, జైశ్రీరామ్ అలంకారంలో 108 ప్రమిదలతో దీపోత్సవం భక్తుల సృసింప చేసిన పూజా ద్రవ్యాలతో శ్రీరామునికి గోదావరి నదికి అష్టోత్తర శతనామార్చన చేశారని, పురోహితులు శ్రీరామ అష్టోత్తరం పటిస్తుండగా ఓం శ్రీ రామాయ నమః అంటూ108 సార్లు భక్తులచే శ్రీరామ నామ భజన, ముందుగా సీతారామచంద్రస్వామి వారికి12 సార్లు హారతి ఇచ్చిన ఆనంతరం గోదావరి నదికి 21 సార్లు హారతిఇవ్వడం జరిగిందని, లోక కళ్యాణార్థం ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఈ మహాత్కార్యంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, రామానుగ్రహంతో గోదావరి మాత ఆశీస్సులు పొందాలని ఆయన అన్నారు. ఆనంతరం శాంతి మంత్ర పఠనం జరిపి, రామాచారి అండ్ సన్స్ ఆధ్వర్యంలో సమర్పించిన ప్రసాదం భక్తులకు పంపిణీ చేయడం జరిగిందని, పూజా ద్రవ్యాలు భద్రాచలం రెడీమేడ్ షాప్ సంఘం ఆధ్వర్యంలో అందజేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పురోహితులు సత్య ప్రసాద్ శర్మ, రామాచార్యులు, కారంబరి .కృష్ణ శర్మ, తేజ శర్మ, సాయి, స్వచ్ఛంద సంస్థలు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# తహసీల్దార్‌పై పోలీసు అధికారి దురుసు ప్రవర్తన



**కాళేశ్వరం, జూన్ 1 (జనం సాక్షి):** సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా ఆదివారం రాత్రి నిర్వహించిన నవరాత్రి హారతి కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు మహాదేవపూర్ మండల తహసీల్దార్, స్థానిక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ వెళ్తుండగా అక్కడ విధుల్లో ఉన్న ఓ పోలీసు అధికారి దురుసుగా ప్రవర్తించిన ఘటన చర్చనీయాంశమైంది.ప్రత్యేక భద్రతా ఏర్పాట్ల మధ్య కార్యక్రమ ప్రాంగణంలోకి వెళ్తున్న తహసీల్దార్‌ను పోలీసు అధికారి ఐడీ కార్డు చూపించాలని కోరాడు. తహసీల్దార్ వెంట ఉన్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) ఆయన స్థానిక మేజిస్ట్రేట్ అని వివరించినప్పటికీ, పోలీసు అధికారి వినిపించుకోకుండా ఐడీ కార్డు చూపించాల్సిందేనంటూ వాగ్వాదానికి దిగినట్లు సమాచారం.అంతేకాకుండా తలకాయ లేదా చూపించాలంటే అంటూ అసభ్యకర వ్యాఖ్యలు చేసినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. విధుల్లో ఉన్న ఓ ప్రభుత్వ ఉన్నతాధికారితో పోలీసు అధికారి ఈ విధంగా ప్రవర్తించడం పట్ల రెవెన్యూ శాఖ సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370